ఫిబ్రవరి 1979

88

ప్రత్యేక ఇంటర్వ్యూ :

నాగా ఉద్యమంపై ప్రణాబ్ ముఖర్జీ

చరిత్ర పుటల్లోంచి....

అలీఘడ్ సంఘటనలు - వాస్తవాలు

చరిత్ర కన్నెర్ర చేస్తుంది–

కంపూచియాపై దురాక్రమణ

కథ :

ఎత్తునిరి పిడికిళ్ళు....

రిపోర్టు :

విరసం సాహిత్య పాఠశాల

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మా స ప త్రి క

సంవత్సర చందా 15 రూపాయలు

ఈ సంచిక రు. 1-50 పైసలు

ఈ సంచికలో....

SRJANA is commended for use in Public Libraries in th
State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 00
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

88

ఫిబ్రవరి 1979

విరసం సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు, ప్రజా కళాకారుల అనుభవాలు వచ్చే సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాము.

— 'సాహితీ మిత్రులు'

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1.50 పైసలు

కమ్యూన్ కంపూచియా జయిస్తుంది!

కంపూచియా మీద రష్యా సహాయంతో దురాక్రమణ చేసింది వియత్నామ్. దీనికి ఏవ సరిహద్దు సమస్య సాకుగా చూపినా, పాల్‌పాట్ 'నిరంకుశ' పాలన కారణంగా చూపినా ఇది నగ్నంగా ఒక దేశం అంతరంగిక వ్యవహారంలో మరొక దేశం జోక్యం కల్పించుకోవడమే. జోక్యం అనే మాట కూడ చిన్నది. ఇది పచ్చి దురాక్రమణ. రష్యా స్వభావాని కిది కొత్తకాదు. మొన్న ఇండియాకు మద్దతునిచ్చి తూర్పు పాకిస్తాన్‌లో ఈ పని చేయించింది. క్యూబాను ముందుకుతోసి అంగోలాలో ఈపని చేసింది. ఈ అన్నిటికన్న ముందు తాను స్వయంగా జెకొస్లవేకియాలో ఈ పని చేసింది.

పాల్‌పాట్ పాలన నిజంగా నిరంకుశంగా వుందా– ఉంటే ఆ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ప్రతిఘటన నిర్మించరా– అన్నది ఒక అంశం. నిరంకుశ పాలన వున్న చోటల్లా అక్కడి ప్రజలను 'విముక్తి' చేయడానికి వియత్నామ్, రష్యాలు కంకణం కట్టుకున్నాయా అన్నది రెండవ అంశం. కంపూచియాలో వియత్నామ్ సైన్యాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయన్నది నిర్వివాదం. దానికి రష్యా సహాయం వుందనేది అంతకన్నా స్పష్టం.

కంపూచియాలో కమ్యూనిస్టుల పాలన జనచైనాలో మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో వచ్చింది. గ్రామాలకు తరలివెళ్ళే కార్యక్రమం, ఏ దేశం మీదా ఆధారపడకుండా తమ వనర్లతో, తమ ప్రజా సమీకరణతో స్వయం సమృద్ధి సాధించుకునే కార్యక్రమం వాళ్ళు క్రమశిక్షణతో అమలు చేసారు. సోమరులకు, రాచరిక వ్యవస్థ కింద కులాసా అలవాట్లకు లోనయిన వారికి యిది యిబ్బందిగానే వుండవచ్చు. నయావలస కాంబోడియాను నూతన కమ్యూన్ కంపూచియాగా రూపొందించుకునే ప్రయత్నంలో బయటి ప్రపంచాని కంతగా తెలియని యువ శ్రామికవర్గ నాయకులు ఏ దేశమూ ప్రదర్శించని చొరవనూ, సాహసాన్ని ప్రదర్శించారు. దురాక్రమణ స్వభావంతో, చివరకు ఇండియాలో ఎమర్జెన్సీని కూడ సమర్థించిన రష్యా, వియత్నామ్‌లకు ఒక చిన్న దేశం ఇట్లా రివిజనిజానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయడం సహజంగానే నచ్చలేదు. మరి ఈ రష్యా, వియత్నామ్ 'విముక్తి' సైన్యాలు ఇంకా ఎంతదూరం ఎన్ని దేశాల్లోని 'దుష్ట' పాలనను అంతంచేయడానికి 'జైత్రయాత్ర' చేస్తాయో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో రాటుదేలిన ప్రజలు ఈ నగ్న దురాక్రమణను ఇంకెంత కాలం సహిస్తారో చరిత్ర తేలుస్తుంది.

6-2-79

— సంపాదకుడు

కన్నీరు చేస్తున్నది చరిత్ర

కాంపూచియాకు జరిగిన అన్యాయానికి
కన్నీరు పెట్టుకొంటున్నది చరిత్ర
వియత్నాం అధినేతల దుశ్చర్యకు
కన్నీరు చేస్తున్నది చరిత్ర
పారిస్ కమ్యూన్ పతనం అయింది ఒకనాడు
కంపూచియా కమ్యూన్ ఓడిపోయింది నేడు
పారిస్ కమ్యూనార్డ్‌ల పతాకం
పలుతావుల రెపరెప మని ఎగిరింది
కమ్యూన్‌ను చిరస్మరణీయంగా నిలుపుకొంది చరిత్ర
కంపూచియా కమ్యూన్ ఇష్టుల
ప్రతిఘటనా పతాకం
పల్లెల్లో ఎగురుతూనె
పట్టణాలను చుట్టుముట్టి జయిస్తుంది
కంపూచియా స్వతంత్రతను నిలబెడుతుంది చరిత్ర
ఈ దురాక్రమణకు ఆశ్చర్యపడుతలేదు
ఆగ్రహిస్తున్నది చరిత్ర
ఇటువంటివి చరిత్ర ఎన్ని చూళ్ళేదు ?
ఎన్ని అనుభవించలేదు ?
సామ్రాజ్యవాదాన్ని ఎదిర్చి పోరాడి
స్వేచ్ఛా పతాకం ఎగరేసిన
మహాచరిత్ర అమెరికా స్వాతంత్ర్యసమరం
అదే అమెరికా ఎన్ని దేశాల స్వాతంత్ర్యాన్ని హరించి
ఎన్ని సార్లు చరిత్రలో నల్లసిరాతో రాయించుకొంది
కార్మిక కర్షక విముక్తి విప్లవ శంఖారావం
తొలిగా మోగించిన ఘనచరిత్ర రష్యాది
ఇతరదేశాలకు పెత్తందారుగా అగ్ర ఆధిపత్యరాజ్యంగా
చరిత్రలో పేరు రాయించుకోవటం లేదా ?
నిన్నమొన్నటిదనుకా మూడు దశాబ్దాలు
తన స్వాతంత్ర్యం కోసం పెనుగులాడి
ప్రపంచమంతటితో ఔననిపించుకొన్న వియత్నాం

కమ్యూనిజంవైపు కంపూచియా
తానూహించ లేనంత అంగీకరించ లేనంత
వేగంగా పరుగిడుతున్నందుకు
కమ్యూనిజం చెప్పి రివిజనిజంకాక
కమ్యూనిజంనే ఆచరిస్తున్నందుకు
సహించలేక సవాలును స్వీకరించలేక
తమ సైనిక ఆధిక్యతతో గర్వించి
కంపూచియాను తమ అధీనదేశం చేయటం
ఆ వరసలో జరిగిందే
అందుకే చరిత్ర ఆశ్చర్యపడదు
ఆగ్రహమే చూపుతుంది.
సామ్రాజ్యవాదం ఉన్నంత వరకూ
దురాక్రమణలూ యుద్ధాలూ
అనివార్యమన్న లెనిన్ మాట నిజం
అంతేకాదు దేశాల పాలకశ్రేణులలో
ఆధిపత్య పెత్తందారీ ధోరణులున్నంత కాలం
జోక్యందారీ ఆక్రమణలూ
దేశాల మధ్య యుద్ధాలూ
సామ్రాజ్యకాంక్ష పోకడలు అనివార్యం
ఇప్పటి చరిత్ర దీనికే సాక్ష్యం చెబుతున్నది.
బానిస విధానాన్ని చరిత్ర తొక్కేసింది
ఫ్యూడలిజమూ చరిత్ర నుంచి చెరిగిపోతోంది
పెట్టుబడి విధమూ రోజులు లెక్కించుతోంది
సామ్రాజ్యవాదంపై చరిత్ర తీర్పు చెప్పింది
ఈ కొత్తతరహా ఆధిపత్య పెత్తందారీ పోకడగతి
రేపు అంతే అయి తీరుతుంది
చరిత్రకు ఆశ్చర్యం కాదు ఆగ్రహమే కలుగుతోంది
కంపూచియా కమ్యూన్ కోసం
కన్నీరు విడిచే కంటే
ఆధిపత్యవాద జోక్యందారీ ఆక్రమణపై
కన్నెర్ర చేస్తున్నది చరిత్ర

– అట్లూరి రంగారావు

నవల - సీరియల్

కొలిమంటుకున్నది

అల్లం రాజయ్య

6

తాళ్ళల్ల పైరగాలి 'బొయ్'న రొద సేత్తంది- తెరలు తెరలుగా తోలుతన్న పైరగాలికి మక్క కర్రిలు ఒకటికొకటి రాసుకొని సెవుల కింపైన సప్పుడత్తంది- ఎన్నీల పిండి ఆరబోసినట్టుగున్నది- ఎన్నీల ఎలుగుకు సుక్కలు అంత తేజ్‌గ గన్పడ్త లేవు.... మొగులు కడిగిన గంగాలం తీర్గున్నది- గుట్టమీన సొటంత నల్ల మబ్బున్నది- సీతువ ఉండుండీ పలుకుతంది పైరగాలిల బడే పసందుగ ఇనత్తన్నది- గాలిరొదల సిమ్మెట్ల పలుకులు అంత బాగ ఇనరాకున్న కొద్దిల కొద్దిల ఇనత్తంది....

నర్సింహం మంచెల మోకాల్లు డొక్కల కిగ్గుకొని ముడుసుకొని పన్నడు- అతని మనుసు మొద్దుబారి పోయున్నది- జీవిత ఖైదు పడ్డోనికి మరింక ఇసారించే టందుకు ఏం మిగులనట్టు, అతనికి ఇసారించటానికి ఏం మిగులలేదు.... కండ్లల్ల నుంచి పానమెల్లిపోయినోని తీర్గ ఆకాశంలకు సూసుకుంట పండుకున్నడు....

ఎందరెందరో కండ్ల ముంగట సిడం సేపు కన్పిచ్చి మాయమై పోతంద్రు. భూములు పోంగ ఎడ్సినోల్లు- కానిమీని ఎడ్ల అమ్మంగ అలపోసినోల్లు- కూటికి లేక దొంగతనాలు సేసినోల్లు- తన్నులు బడ్డోల్లు- తలలు పలుగ్గొట్టుకున్నోల్లు- తప్పు దండుగలు గట్టినోల్లు- కట్టలేక దేశాలు తెగిచ్చుక పోయినోల్లు- అలి సచ్చినోల్లు- ఎందరెందరో? కన్పిత్తంద్రు.... ఆళ్ళంద రెల్లిపోయినంక పంచాతు- సింతసెట్టు కింద బొమ్మలోగ్గె కూకున్న ఊరిపెద్దలు- కనిపిచ్చింద్రు.... ఆళ్ళింక గుద్దులు పత్తి త్తులు జేసుకొని కేకలేత్తన్నట్టుగనే ఉన్నది....

తలుపు కతుక్కపొయి ఏడుసుకుంట నిలుసున్న ఎంకమ్మ ఎక్కెక్కిపడి ఏడుత్తనే ఉన్నది- దొర ఏందేందో అదురుతనే ఉన్నడు.

గిట్ల ఎందరెందరో అగుపడ్డరు....

లేనిపోని నిందలేసి, గాయిగాయిజేసి- చెప్పుతోని గొట్టినంక- గడినుంచి ఈ తల కచ్చిన నర్సింహం- ఊరు ఊరంత ముందుగాల్నే కూడబలుక్కొని కుట్రసేసినట్టుగ, అందరు గలిసి తనను తరుముతున్నట్టుగ, సాపుసీదా పెరడికాడికచ్చిండు.... ఎవడో పాలోడు సచ్చినట్టుగ అగుపడుగుల మునిగిండు. తడి బట్టతోటె మంచెక్కి కూకున్నడు.... పొద్దుండగ మక్క పెరడిని, దొర ఖరపతోటను సూసుకుంట కూకు

న్నడు. ఒంటిమీని దోతి ఎండిపోయింది. ఎండబొయి ఎన్నీలచ్చింది.... నర్సింహం మంచె మీన్నుంచి లేవలే....

కాళ్ళు రిల్లలు బట్టినయ్. కడుపుల ఎలుకల్ దిరుగుతున్నయ్ సోసచ్చి మంచెల ఒరిగి పోయిండు.... కడుపులకు కాళ్ళగ్గుకొని గట్ల ఎంత సేపు పండుకొన్నడో ?

కండ్లు మూసినా తెరిసినా ఎవలెవలో కన్పడ్తండ్రు.... అళ్ళవ్వ పోసాని ఏందేందో ఏడుసుకుంట సెప్పుతన్నట్టుగనే ఉన్నది. ఎన్నెన్నో సంగతులు యాది కత్తన్నయ్....

"బిడ్డా నర్సవ్వా ! ఇనుపమూతికాకుల్ల నిన్నిడిసిపోతన్న– మీ అయ్యసావంగ కండ్లార సూసిన– మనుసు రాయిజేసుకొని నీకోసరం ఇంత వరదనుక రాయోలె బతికిన. నా సేతులేమున్నది బిడ్డా ! నేనిప్పుడు బతుకద్దని పెద్దొర్సాని ఖరాఖండిగ సెప్పింది.... నీ కట్టం సుఖం సూడకుంటనే పోతన్న...."

"ఏడికి పోతన్నవే నేనత్త...."

"సానా దూరం పోతున్న బాంచేను.... నీకు పనుకాయి దెత్త...."

నర్సింహం మనుసంతా కోళ్ల తవ్వివ పెంట తీర్గ కకావికలై పోయింది. కండ్లు నిలుసుండి పోయినయ్.

పంచాతుల మాటలు మల్లమల్ల ఇనపడ్తన్నయ్. సేతులూపుకుంట పదిరెటోల్లు వదురు తున్నట్టుగనే ఉన్నది.

"ఎంకమ్మ ఎంత పన్జేసింది– దానికెందుకో నామీన పగ– బట్టగాల్సి మీనేసి నట్టు గిదేమన్నామెం ? చెప్పుకుంటె పట్టుకున్నట్టుగున్నది ఏవారం. దొరోడే దానికి నేర్పిచ్చి తీస్కచ్చినట్టుగున్నది– అంగదీయాలంటె ఎన్నో ఏషాలేత్తరు ! 'గిట్ల సెప్పు ఎంకిలంజె' అంటె అది కాదంటదా ? కాదంటె పొయిలుప్పు బోసుకున్నట్టేనాయె– నీతల్లి ఒక్క కంభాలకు ఎంతమంది సుట్టుకపోతండ్రు.... అడుగుతే జరిగింది గిది. సప్పుడు సెయ్యకుంట ఊకుంటె సల్లంగ నెత్తిదాక పాకుతడు– నిలువుతా ముంచుతడు. ఈ లంజకొడుకులతోని కిందబడ్డా బంచోతె– మీదబడ్డా బంచోతె.... మల్ల గిట్ల కుక్కిన పేండ్లోలె ఎంతకాలం నాశిడమై పోవుటం ? గీ బుడుగుల బద్దోల్లకు సెయ్యేవడంది య్యాలె– ఓట్ల కచ్చిరి– ఓట్లు ఏపిచ్చుకపోయిరి– బెల్లపు మాటలుసెప్పి, మల్ల మొఖమన్న సూడక పొయిరి– సర్కారోల్లున్నరు, అళ్ళకన్న సెప్పుకుంటే.... ఎంటిక లున్న కొప్పు ఎటు ముడిసిన సక్కగుంటదని.... అడు ఎదిసెప్పితె అదే సూటనరుగదా !" గిట్ల కొసేపు పత్తాయించిండు.

ఎందుకనో ఏడుసుకుంట తలుపుకతుక్కపొయిన ఎంకమ్మమీన కోపం రావటం లేదు– తనను సెప్పుతోని దొర గొట్టింది ఎంకమ్మ సెయ్యవట్టేననే మాట నమ్మబుద్ధి కావుటంలేదు– ఎంకమ్మ– ఎప్పుడో నూతిలబడి సచ్చిపోయిన తనవ్వ, పక్కపక్కకే కన్పిత్తంద్రు. ఎప్పుడనంగనో జరిగిపొయిన ఎన్నెన్నో సంగతులు అద్దనుకున్నా ఇప్పుడు జరిగి నట్టుగనే కన్పిత్తన్నయ్.

గిట్ల నర్సింహం ఆకలితోని, దెబ్బలతోని రందిపడుకుంటుండంగనే....

"సత్తెవ్వా.... ఓ సత్తెవ్వా...." బాయిగడ్డ మీన్నుండి పైరగాలిలో ఎవలో పిలుత్తంద్రు. నర్సింహం 'ఓ' యనలేదు– గట్ల ఎవలు పిలుత్తంద్రో నర్సింహం కెరికే....

కర్రిలు పాపుకుంట మల్లికాంబ మంచెకాడికచ్చింది– మంచె నిచ్చెనెక్కింది– మల్లికాంబ ముక్కుపుల్ల ఎర్రరాయి ఎన్నెట్ల మెరుత్తంది. మొఖం ఉబ్బున్నది– ఏడ్సేడ్సినట్టుగ....

"మంచెల్నేపండి మాట్లాడ్తలేవు.... నే నేం పాపం జేసిన.... పొద్దటి నుంచి నోట్లె మంచి నీల్లు బొయ్య కుంటెట్ల? ఏ యేల్ల లేసినవో? ఏల్ల కగ్గి తల్గ– గిట్ల అదిలిపోతెట్ల? నారాజీ పడి కూడుగ్గ పడితె–అచ్చిన సెక్కర్లు తొలిగిపోతయా? అచ్చిన కట్టం సచ్చిన తప్పదు.... కట్టాలు మనుషులకు కాక మాకుల కత్తయా! లే....లే.... ఏందో ఇంటికి రాకుంట గీడికచ్చినవ్.... కూసంత ఎంగిలిపడు.... ఎట్లయితె అట్లయి తది.... మీన దేవుడున్నడు. కిందమనమున్నం.... దిక్కులేనోల్లకు మరేసిన తిర్రే సిన– ఇరుసుకున్న.... ఏంజేసిన రెక్కలే దిక్కు.... మన రెక్కలనైతే గుంజుకోడు గదా!" మల్లికాంబ అటిటు ఊపింది....

నర్సింహం నోరిప్పలేదు....

"గీ ఈడుల నువ్వు ఎంకటిని ఏదో సేసినవంటే ఊరు నమ్ముద్దా? అసలు మెడ మీన తల కాయున్నోడెవడు నమ్మడు.... కనిదొరన్న మాటకు ఎవరు ఎదురు సెప్తరు? సెప్పినోడెవ్వడు బతికి బట్ట గట్టిండుగనక– వానింట్ల పీనెల్ల! లావు సెల్లిచ్చు కుంటండు. సెడి సెల్లిచ్చుకునోల్లు నా పియిదిని సెర్లకేపోతరు. అని బొత్తెవడో పలుగ జీరుతడు. మల్ల గీ దినమచ్చెటాల్లకు అని దినాలారాలయితయ్.... ఇయ్యానికైన కయ్యానికయిన సమానపోడు గావాలె.... ఏమో మనెంట బడ్డడు.... వానోట్లె ఉచ్చ.... పంచాతట– పంచాతు.... కంభాలు పీక్క పోయిందిగాక ఆదే పంచాతి బెట్టి.... నాకెరుకలే....

దమ్మగాసిన దోసెడు దుమ్ము అనిమీన అనికుర్చిమీన బోసత్తు.... పగటించి ధూప కెత్తుకచ్చిన పెరట్లకు.... ఇంటికచ్చేటాల్లకు గిట్లని తెలిసింది.... లబలబ మొత్తుకుంటే మున్నది.... అరుత్తేమున్నది.... పంచాతిల కూసునోల్లు తోడు దొంగలేనాయె. ఎవలకెరుకలేదని.... నాయెమెక్కడుంటది? లే ...లే...." ఊగుతున్న పెరట్లకు సూసుకుంట మల్లికాంబ ఎన్నుకింద సెయ్యేసి నర్సింహంను బలిమిటికి లేపి కూకుండ బెట్టింది....

"మూతికాడి ముద్ద గుంజుకోవట్టె ఇంక ఆకలెక్కడిదే?"

మల్లికాంబ మాట్లాడకుంట సద్దిముల్లె ఇప్పింది. ముద్దలు పిసికింది. గుండు సెంబుల నీల్లు నోటికాడబట్టింది.... "నా కాకలయిత లేదు.... అద్దు...." అనుకుంటనే నీళ్ళు పుక్కిలిచ్చి ఊంచిండు.... ఒక్కొక్క ముద్ద నోట్లెబెంట్టింది.

"ఇంటికాడ సత్తెవ్వ ఒక్కతున్నది. ఆట కోయిల పోరి.... దానికేమెరుకయిందో ఒకటే ఏడుసుడు.... భయపడ్తది.... నేను ఏగిరంగ త్తనని బుదుర కిచ్చి అచ్చిన- నువ్వేం రంధి బెట్టుకోకు- గీ రెక్కలెవడు గుంజుకోడు- అయిదు నూర్ల దండుగటగద? పెయ్యంత గొడ్తె పెరుక్క పెద్దకొత్తెల్లది. దండుగలేదు పండుగ లేదు- ఆఖరి దాకత్తె అందరం దొరింటికే పోదాం- అందరినీ తుపాకి నేసి సంపుతడా సంపనీయ్- సింత సెట్టుకు ఏలాడ దీత్తాడా? తీయనీయ్...." మల్లికాంబ సద్దిముల్లె సదురుకొని మంచె దిగింది....

"పదిలంగ పోయె-" నర్సింహం కీకేసి సెప్పిండు.

మల్లికాంబ ఎల్లిపోయింది....

నర్సింహం సేతులు తలకింద బెట్టుకొని మంచెల ఎల్లెలుకల పన్నడు- మల్లగయ్యే ఇసారాలు- మల్లగయ్యే మొఖాలు- కండ్లమీనికి నిదరచ్చేటట్టులేదు....

అ గొడ్డుకు నక్క ఊలేసింది- సెరువు కింది నుంచి సుత ఇంకొన్ని నక్కలు ఊలేసినయ్, మాదిగిండ్లల్ల కావచ్చు కుక్కొకటి అతి నీరసంగ ఉంది ఉండి- మొరుగు తంది- ఇంకెక్కనో కుక్క సన్నగ ఏడుత్తంది.

"నక్కలు లేసినయ్- ఇగ పెరండ్లుదక్కనియ్యయ్- పీసులు శంకుతయ్...." అనుకొని నర్సింహం మంచెదిగిండు. పెరటి సుట్టు దిరిగిండు- బాయిగడ్డమీని కచ్చె టాల్లకు ఇంజన్ షెడ్డు దయ్యంతీర్గకన్పిచ్చింది. మల్ల మనసు కలుక్క మన్నది.

దొర మిరుప తోట్ల "నేనున్నని" పాలేరోడొకడు కీకేసిండు- అటెన్క పెద్ద మంట లేపిండు- మంటను సూసెటాలకు నర్సింహంకు సుట్ట కుతి లేసింది.

రొండికున్న పొవాకు తీసిండు— తడిసి ముద్దయి పోయింది— అరిసేతుల్లేసి నలిసిండు— గెట్టుమీని మోతుకు గుబురు అకు తెంపి సుట్ట సేసుకున్నడు— రొండి జెకముక తీసిండు— జెకమొక సుత తడిసింది— కొట్టంగ కొట్టంగ నిప్పు పడ్డది— సుట్టమీన దూది పెట్టుకొని బాయి గడ్డమీన కూకుండి రెండు పీల్పులు పీల్సిండు.

మక్క కర్రలు సప్పుడయినయ్— సప్పుడచ్చినకెల్లి సూసిండు. ఎవరో తన దిక్కే అత్తండ్రు.

గట్ల అత్తన్న అకారం ఆడదానిది— పెరటి బందుకచ్చి ఎటూతోసనట్టు గుడిసేపు ఆగింది— దగ్గెరిదనుక అచ్చింది.

"గింత నాత్రి ఎంకటి—" అనుకునేటాల్లకే ఎంకమ్మ సుడిగాలోలె ఉరుకచ్చి నర్సింహం కాల్లమీన పడిపోయింది, ఎక్కెక్కిపడి ఏడుత్తంది.

"నర్సన్నా! ఏదిక్కులేని దాన్ని బాంచెన్— ఎద్దసొంటి నిన్ను నలుగుట్ల నామర్ద సేసిన— నీ బాంచెన్— బొండిగ పిసికి సంపెయ్.... నేనింకబతుక నర్సన్నా! నీకాల్ మొక్కుత— నన్ను సంపెయ్."

"లే, లే పిస్సదాన! లే...."

"నిన్న మాపటించి ఊర సెరుపు తూముకాడ.... దొరగల్సిండు. ఎవలో ఇగ్గిండ్రిని సెప్పుమన్నడు— నీ పేరు సెప్పిండు— నిన్నటి నుంచి కూడుదింటె అసిద్దం తిన్నట్టు...."

".... ...."

"ఎనుక బాయి, ముంగట సెరుపు— నింద మునిగిన నర్సన్నా నన్నుసంపేయ్."

"నాకెరికే లేయే.... గిసొంటిదేదో సేసిండని అనుకున్న— నువ్వో సాకు— ఆడు కొట్టాల్ననుకున్నడు, కొట్టిండు— మన బొండిగలు తప్పియ్యాల్నంటే గిసొంటి దేదో దొంగ నాటకం ఉండాలె— నీ కేష మేసిండు."

ఎంకమ్మ మాటలు రాక సానాసేపు అలపోసుకుంటేడిసింది— గ ఏడుపుల అవ్వను, అయ్యను, మొగన్ని తలుసుకొని తలుసుకొని ఏడ్సింది— నర్సింహం కండ్లు తుడిసిండు— సక్కగ కూకుండ బెట్టిండు— మనుసంతా దేవి నట్టయి పోయింది.

"అన్నిటికి కాలం రావాల్నె ఎంకవ్వ! కాలంరావాలె.... రాజులు పోయిండ్రు— రాజ్జాలు గంగల గలిసి పోయినయ్— గీ దొరలు మన పానాలు తోడుక తింటండ్రు— మన ఏడుపులు దాకి పిల్ల పిల్ల తరాలు నాశిడమైపోతడు. ఇంట్లున్నోల్ల బయటేత్తండు.

అడ్డమున్నోన్ని కట్టేసి తంతండు. ఏట్నొగని భూమి కబ్జ సేసుకుంటండు. ఏట్నొగని గుడిసె మూల ఆసం పీకుతండు– ఏట్నొగని ఊళ్ళెనుంచి ఎల్లగొడ్తండు– గీల్లందరి ఏడుపులు అట్టిగనే పోతయా? ఎంత కాలమని ఏడుత్తరు– అంగలారుత్తరు– సూత్తరు సూత్తరు.... పూర పాపం నిండిన్నాడు.... ఏమయితదో ఎవలకెరుక...."

ఎంకమ్మ మాట్లాడలేదు....

"నాత్రయితంది– ఇగ ఇంటికి బో.... నువ్వేం ఫికరు పడకు. నా కర్మం మంచిగ లేదు– అనుకున్నదోటయితె ఇంకోటి జరుగుతంది. సూడాలె– ఇంకే మయితదో?"

"........................"

"లే.... లే.... ఇంటికిబో– ఎవలేమన్నా ఏగిరపడకు– మా సెల్లసొంటి దానివి ఎంకవ్వా! లేయే సెల్లె–" నర్సింహం చెయిబట్టిలేపి కూకుండ బెట్టిండు.

ఎంకమ్మ కండ్లు తుడుసుకున్నది– ఎట్లచ్చిందో అట్లనే ఎన్నిలల కల్సిపోయింది.

"అంతేందో మాయ– గోత్రిలోల్లు భాగోత మేసినట్టున్నది–" అనుకుంట మంచెకెల్లినడిసిండు.

కండ్లమీనికి నిదుర రావటంలేదు– మొగులుకెల్లి సూసుకుంట మంచెల పన్నడు నర్సింహం.

పైరగాలి జోరు ఎక్కువైంది– కొండమీని మబ్బు పెద్దగయిపోయింది– మొగలు నిండా తేటగున్న ఎన్నిల గుడ్డిదైపోయింది.

నర్సింహంకు తండ్రి మనుసుల కన్పిత్తండు. ఎర్రటి రాగి మీసాలు– కోల మొఖం– పాసి పండ్లు– కన్పిత్తన్నయ్.

ఏ రాత్రిపూటో గుడిసెల కచ్చెటోడు– మాటలుగీటలు మాట్లాడకుంట, దేన్నో సూసుకుంట గిలేటు గిన్నెల గటుక ముద్దలు నముల రాకుంట నోటనిండా కుక్కుకొని ఏగిరంగ తినేటోడు– గడియ పుర్సతులేని బతుకు– ఎప్పుడన్నా నిదరబొయే తనను లేపి పల్లికాయలో తాటిపండ్లో యిచ్చెటోడు– అటెన్క అదే కాల్లమీన మూతన్న తుడుసుకోకుంట సీకట్ల కల్సిపోయేటోడు.

ఆ దినం ఎట్ల ఇంటి కచ్చిండు– సానాసేపు నిట్టాడు కొరిగి కూకున్నడు– రెండు సేతులతోటి మొఖం కప్పుకొని ఎక్లెడిసిండు– అటెన్క తనను ఎత్తుకొని ముద్దా డిండు– అట్లా లేచిపోయినోడు మల్ల కండ్లబడితెనా?

గిట్ల ఇసారిచ్చుకుంట ఎప్పుడు కన్నంటుకున్నదో?

7

నర్సింహం పెరట్ల కంభాలు, తీగ పీకిచ్చుకపోయి దొర బాజాప్తుగ తన తోట్ల నాటిచ్చుకొని ఆరం దినాలయిపోయింది. సెర్ల నీల్లు సెర్వేనుక బడ్డయి– నర్సింహం గట్లనుకోలే– నీల్లల్ల నుంచి ఒడ్డుమీన పడ్డ సేపోలె కొట్టుకొనే కాడికి కొట్టుకున్నడు. కాలుకు బట్టకట్టకుంట తిరిగే కాడికి తిరిగిండు– గట్టుకు కట్టెలు మోసినట్టే అయిపోతి యింది. ఊరి పెద్దలు చెప్పేకాడికి సెప్పింంద్రు– దొరనడిగి సెప్పుదెబ్బలు తిన్నడు.

"ఓరి పిచ్చోడా! కంభాలు, గింబాలు నీ కోసరంకాదు– పెద్దోనితోని పరాసికా లాడితే పెయ్యంత మెదుగుద్ది–" అన్నమాట దొర సేసి సూపెట్టిండు.

నర్సింహంకు ఆశ సావలే– కరంటు మోటర నీల్లుబోత్తే తన బతుకు బంగార మైపోద్దని ఎర్రి నమ్మక– కరంటు పూనినోనితీర్గ లేసినా, కూకున్నా "కరంటు, కరంటో" నని కలవరిత్తండు.

అడీడ సెప్పుకోంగ ఎవడో సలా సెప్పిండు– పోలీసోల్ల గలువుమని.

సీకటితోనే లేసి పోలీసోల్ల కాడికురికిండు– అంబటాల్లకు తానా సేరుకున్నడు. అమీనుసాబు అచ్చేదనుక కూకుండుమన్నరు.

నెత్తిమీనికి పొద్దచ్చేటాల్లకు అమీన్‌సాబచ్చిండు. అచ్చుడచ్చుడే తునికి కొంద్రా యోలె సిట్లిండు– పోలీసోల్లను తిట్టిండు– ఊరుపేరు లేనోల్లను తిట్టిండు.

"జమాన మంచిగ లేదు– పోలిసు నౌఖరంటే ఇంటి జవానైపోయింది– ఎవడు కొట్లాడిన ముందుగాల పోలీసోనికి తిప్పలు. ఒకడు "అందర్ దాలో" అని ఫోను సేత్తడు. ఇంకొకడు "ఇడిసి పెట్టు" మంటడు. ఎవనింట్లనో సొమ్ములు పోతయి– "బాగో మాకేలవుడోంకో పకడో...." మాదెర్ సోదుద్యోగం– కానూన్లెక్కువైనయి– అందరు లీడర్లే– కాదు పొమ్మంటే నక్సలైటు ఏరియాకు ట్రాన్స్‌ఫర్– పెండ్లాం పిల్లల సంగతి దేవుడెరుగు– యస్. పి. వైర్‌లెస్‌లిత్తడు కడుపుల బొంది కదలకుంట– జంగల్ల సచ్చేది– "వారే కాసిం...." కీకేసిండు. కాసిం ఉరికచ్చిండు....

"రేగులపల్లె కోమటోని భూమి పంచాతు పంచనామ రాసుకొచ్చినవా? లంజ కొడుకులు ఏమన్నరు?"

"జీ సాబ్– బాదుమే మిల్‌తాంబోలె...."

"యస్. పి. దొర దిగుతండట ఇంతెజాములు.... సమఝయ్యిందా అరేంజి మెంట్లు...."

కాసిం మాట్లాడలేదు_

"దండాల్ బాంచెన్...." నర్సింహం సేతులుముడుసుకొని అరుక్కింద నిలుసుండి.

"కిస్సాక్యాహై.... కహాంక హైయే మాకలవుడా ?"

"నయి మాలుము సాబు...."

"ఏవూరు మంది పచేలా ?" అమీన్‌సాబుకారెడ్డ మాడిండు_

నర్సింహం సెప్పిడు_

"రేపొద్దుగాల గలువు_" అమీన్‌సాబు టోపి బల్లమీన పారేసి కాళ్ళు బార జాపుకున్నడు. ఓ పోలీసు గాలి పంఖ దెచ్చిపెట్టిండు.

"సానా దూరం నుంచచ్చిన బాంచెన్...."

అమీనుకు సల్లగాలి తాకి కూసంత తామూలు కచ్చిండు_

"మూడు ముచ్చెట్ల మీన సెప్పు_ కర్సులు గిర్సులు తెచ్చుకున్నవ ?"

నర్సింహం మళ్ళోపారి దండం బెట్టి సెప్పుకచ్చిండు....

"గదీ సంగతి బాంచెన్.... తమరు మాట సాయం జేయిండ్రి బాంచెన్.... గరీబోన్ని_" అన్నడు.

"గరీబు సంగతి మాకెరుకలే_ ఏడసెప్పిన ఫాయిదాలేదు. ఇన్నావురా నీపేరేం దన్నవ్ ? నర్సిమ్మడు గద ? కంభాలు పీకంగ ఎవలన్న గవాఉన్నరా ?"

"అద్దుమనాత్రి గవా ఏడుంటడు బాంచెన్ ?"

గవా లేదు సూబిత్ లేదు_ సరే కంభాలు నీ పెరట్లయని ఆధారమేంది ?"

"అయ్యో బాంచెన్ కన్పడ్తనే ఉండే_ కరంటోల్లు పాతినయేనాయె...."

"కరంటోల్లు పాతింగ్రు పీక్కపోయింగ్రు_ మద్దెన మమ్ముల్నేం సెయి మంటవు ?"

"ఉద్దునూర్తంగ గొట్టిండు బాంచెన్_" అని సెప్పుదామనుకున్నడు_ మళ్లెందు కనో ఊకున్నడు....

"తమరికేం ఉదరు లేదా ? బాంచెన్...."

"ఏనుగతోని పరాసికమాడి నట్టున్నది ఎవారం_ ఉధరు గిదరు జాన్త నయి_ ఎల్లిపో_ భూమ్మీన బతుక బుద్ధయితలేదా ! నకురాల్ సేత్తె దొడ్డెదోల్త" అమీన్‌సాబు అరిసిండు.

నర్సింహం మొఖం మాడిపోయింది_ ఏడికి బొయిన ఏదేమానుక ఉన్నది ఎవారం....

"ఏీ నవ్వాల కుక్కలు దెం.... అందరిది ఒకటే మాట– ఎవడు దొరను ఎను కేసు కచ్చెటోడెకని, గిది దొరది తప్పని ఎవడంట లేడు– సవారాజ్జమట.... సావు రాజ్జెం– కొంపలు ముంచే రాజ్జం– ఎవని కడుపు కిందికి ఆడే ఇగ్గుకుంటండు. దొంగలు దొంగలు ఊళ్లు బంచుకున్నట్టు– ఇదివరకు తురుకోడో దూదెకులోడో రాజు ఉన్నప్పుడు గిదే జబర్దస్తీ.... ఆడుపోయినంక మల్లగదే జబర్దస్తీ.... తుః.... లంజ కొడుకులు...." ఊంచి ఊపల కచ్చిండు.

పెద్ద బల్లెనుంచి పిలగండ్లు ఎల్లిండ్రు....

నర్సింహం నడుత్తండు– కడుపుల ఆకలి.... మనుసుల మంట– నెత్తిమీన ఎండ లగాంచి కొడుతంది– ఏపసెట్టునీడకు గుడిసేపు కూకున్నడు– కూకున్నోనికి కూకున్నట్టుగనే కన్నంటు కున్నది....

పొద్దు అంగే ఏల్లకు ఎవలో లేపిండ్రు

"గీడ పన్నవేందిర నర్సిమ్మ–" లేపినాయిన అంటండు.

కండ్లు నలుసుకొని ఉలికిపడి లేసి నిలుసున్నడు– ఎదురుంగ నర్సింహం సడ్డ కుడు ఎంకటపురం అయిలయ్య.

"ఏంలేదే అయిలన్న, ఉప్పుబుబ్బలుబ్బి మాంచి సిక్కులిరికిన– అడ్లు పెరుగు కలిపినట్టుగున్నది పనివరుస–"

"అటెంక మాట్లాడుకుందాం– పల్లిగిన మంచిగున్నదా? పురాగ అటు కెల్లి రావుటమే బందుసేసిండ్రు. అదెరా పగయినవా? నువ్వొక్కనివేగాదుర సడ్డకునివి? పిల్ల పెద్దమనిషైందని సెప్పంపుతే రాకపోతివి. మీ అక్కనె సెల్లెకోసరం కలువరిత్తంది. దాదా.... గిన్ని 'సా' నీల్లు దాగుదాం– ఎండ కగ్గిదల్ల నిలబడి కొడ్తంది–" రెట్టబట్టి ఇగ్గుక పోయిండు.

హోటల్ గుడిసెల కూకున్నరు– అయిలయ్య సెప్పుక పోతండు....

"పెద్దోడు పాపన్న బాయిల దిగుతనని ఎగురుతండు– ఎవుసాయమవ్వ ఎవ్వ సాయం సేసి ఏడ్చచ్చింది.... అనచ్చె అరువచ్చె– అది రైతుమీన్నే పడే– అనరాకుంటె కొండ కెదిరి సూసినట్టు ఎదురు సూసుడేనాయె.... భూములుసుత లంచాలకు మంగి నట్టయ్యింది పనివరుస– ఎరువో సరువో ఎయ్యంగి పెట్టిన పంట ఇగిలిచ్చుకపోద్ది– రెక్కల కట్టం అటుంచి పెట్టినదే తిరగిరాదు. రెండేండ్లబట్టి ఏసిందే ఎట్టం దిగిందే బుడ్డ.... ఇంటి కిత్తచ్చింది లేదు సేసిన అప్పులు తీరిందిలేదు– మించుకచ్చింది–

ఎప్పుడో గంపతోని తెచ్చుకున్న నర్సిమ్మ కండ్లకురకుతం రాంగ మొన్న బండెడు జొండ్లు గొలిసిన- సిన్నోడు మూడు రోజులు కూడుదింటె ఒట్టు- కొట్టకొట్టచ్చిండు- అనికేమెరుక "గంత పెచ్చు గట్టుకుంటె సేతులు ముడుసుకొని ఊకుంద సంటడు-" అప్పు- అచ్చిన కర్మం సచ్చిన దప్పదని ఊకెనెఅన్నరా? ముగ్గురం కొట్టుపోసు కుంటె...." అయిలయ్య గొంతు పట్టేసి నట్టుగ టక్కున ఆగిపోయిండు- మిడిగుడ్లేసి అటెటో సూసుకుంట "ఛా" ఒక్క బుక్కతోని తాగిండు....

నర్సింహం మాట్లాడకుంట ఊదుకుంట తాగుతండు....

"నర్సిమ్మ! కాలం మంచిగత్తలేదు- ఆఖరికేడిదనుక వోతదో సమజయిత లేదు- కొనపోతె కొర్రి అమ్మబోతె అడివున్నది- మనకేమున్న పండిదంటే కోమటోడు అటెగిరేసి, ఇటెగిరేసి రంగులేదని, సీత్తలేదని అనిట్ల మచ్చినంతిత్తడు- ఇచ్చే కాడ ఊకుంటరా? మందలు బెట్టిత్తనంటె గొల్లోళ్ళు అడివిల కాసున్నరు. మందు బత్తాలు మనదనుక రానేరావు అచ్చిన నూర్లకు సూర్లు బెట్టాలె- కొని సత్తాము- వారీ నర్సిమ్మా! ఇగ నాకేమనిపిత్తుందంటే-" లేసి నిలుసుండి హోటల్ ముసలోనికి సిల్లర పైసలిచ్చిండు.

ఇద్దరు ఈవల కచ్చిండ్రు....

"మా పాపదేమంటండంటే- నాయిన! కట్టమో సుఖమో గిన్నేండ్లు మన్నదిని మన్నేర్గి భూమిని నమ్ముకొనే బతికినం- మనకు నా ఎరికల పదెకురాలుండె- అమ్మంగ అమ్మంగ మూడెకురాలు మిగిలింది- మందిమి పెరిగినమ్- ఎంత సతి పోరాడినా? అందుతలేదు- అప్పులేమో పెరిగిపోయినయ్- బతుకకుంటచ్చింది- ఏదన్న సూసుకోంది ఎల్లెటట్టు లేదు. నాయిన్నా నీకట్టమనిపిత్తది. కడుపు సుమ్మర్లు సుట్టుక పోద్ది- కని ఏం జేద్దాం? నేను బొగ్గు బాయిల పనికిబోర- మూడెకురాలు అమ్మి అప్పులుసప్పులు పోంగ ఏమన్న మిగులుతే- ఎవని మొకాన్నన్న గొడితే గండట్ల కొలువిత్తడు-" అయిలయ్య కండ్లు తుడుసుకున్నడు.

"అమ్మినరా! అమ్మిన- అయ్యవ్వ సంపాయించి ఇచ్చిన సెక్కమ్మిన. ఇయ్యాల్ల దానికి నాకు రుణం తీరిపోయింది. గండకనే తాసీలు కచ్చేరు కచ్చిన. పెద్దోడు దత్తకతు జేసి ఎల్లిపోయిండు, సిన్నోడు సిద్రు మొరాయిడుతండు- ఇగ నేను నీల్లు ధారిడిసి ఏలు ముద్దెరెయ్యాలె-" అని తాసీలుకచ్చేరు కెల్లి తొవ్వ దీసిండు.

"కొలువు దొరుకుత దంటవా?" నర్సింహం అడిగిండు-

"పదిహేన్నూర్లు ఎవనికో ఇచ్చొచ్చిండు. రేపోమాపో బాయిలకు దించుతరట."
నడుసుకుంట నడుసుకుంటనే నర్సింహం తన సంగతి సెప్పుకచ్చిండు–

"ఎవని బతుకు సూడవోయిన ఒక్కతీర్గనే ఉన్నది– గాయింత కరంటోల్ల కాడికే పోయిసూడు. ఆళ్ళేమంటరో ఇనాలెగదా! ఎప్పుడన్న గాడిదాకచ్చిపోర నర్సిమ్మ సిన్నోనికి కూసంత బుద్దన్న సెప్పేటోపు. నన్ను సూత్తెనే అగ్గిల బడ్తండు–" కాలంరా కాలమచ్చిందంటే ఇనడు– ఉడుకు నెత్తురు– ఆళ్ళనంటే ఏమున్నది? నాకోసరం బుడిగెమూతి సౌదరోడు ఎదురుసూత్తాండాలె– పోతన్న– మర్సిపోకు సుమా! పిల గండ్ల అడిగిన్నని సెప్పు– పోతన్న– మల్ల గలుత్తనో కలువనో–" అయిలయ్య ఎల్లిపోయిండు.

అయిలయ్య పోయినకెళ్ళే తిరిపోయి సానాసేపు సూసుకుంటున్నడు నర్సింహం. ఏందో మతికచ్చినోని తీర్గ పొద్దును సూసిండు. పొద్దు అంగుదల కచ్చింది.

"పాపయ్యాకంటె రెక్కలున్నయ్. ఏడ బతుకుదెరువుంటె ఆడి కెగిరిపోతడు. నా అసొంటోని గతేం గావాలె–" అనుకుంట తొవ్వొంట కలిసినోల్లను కరంటాపీసు ఎటున్నదో అడుక్కుంట కరంటాపీసుకెల్లి నడిసిండు.

కరంటాపీసు సేరుకొనేటాల్లకు ఆపీసుల ఎవ్వల నడుగాల్నో ఎరుకగాలే– కల్సినోల్లనల్ల కదిలిచ్చి సూద్దామంటే; కొందరు తెల్లబట్ట లేసుకున్నోల్లు నర్సింహం మొఖమే సూల్లే– మరి కొందరు ఎగాదిగా సూసి మాట్లాడలె– మాట్లాడినోల్లు మను షుల తీర్గ మాట్లాడలే– ఆఖరుకు ఓ సోరోడు 'డివిజనల్ ఇంజెనీరు' కమ్రా సూపెట్టి "చెప్పవలసిన దేమైనా ఉంటే పెద్దొరకు జెప్పుపో" మని దారి సూపెట్టిండు.

పెద్దొర అర్ర ముంగట కూకున్న జవాను కరువచ్చిండు– నర్సింహం కోతి దండాలు బెట్టి, గద్దువబట్టుకొని, సేతుల రూపాయిబెట్టి లోపటికి అడుగుబెట్టిండు.

లోపట గాలిపంఖ గద్దతీర్గ తిరుగుతంది– సల్లంగ నాత్రి తీరుగున్నది– పెద్దొర నెత్తిమీన కరంటుబుగ్గ ఎలుగుతంది.

దండం దొర! సానా దూరం నుంచచ్చిన–"

నోట్లెకాల్తన్న సికిలేటు 'ఏందన్నట్టు' మెరిసింది– పెద్దొరబుగ్గలుబ్బినయ్. అటెన్క రైలింజన్ల నుంచి పొగెల్లినట్టుగ నోట్లెనుంచి పొగ ఈతలకచ్చింది. బంగారు రంగు కండ్లద్దాలెనుక పెద్ద కండ్లు ముంగటున్న బల్ల మీని కాయిదాలను సూత్తన్నయ్. కుడిసేతులున్న కలప్పుల్లతోని గ కాయితాలమీన గీకుతండు.

నర్సింహం నక్కిల్లు దగ్గరపడి పెద్దొరను సూసిండు.

“సిబాంచెన్‌దొర! నాకున్నది రెండెకురాలనర పెరడు. రెండు బక్కెడ్లు– పెరడు పండితె తిన్నట్టు, లేకుంటె ఉపాసమున్నట్టు. మూన్నెల్ల కింద గ సెక్క– షావుకారికి గిర్వీపెట్టి ఇంజను కూసుండబెట్టుకున్న బాంచెన్– మీవోల్లచ్చి నా పెరట్ల కంభాలు పాతింద్రు– ఆటికి తీగ సుట్టింద్రు. కని మోటర కతుకు బెట్టలె– కనిపిచ్చిన కరంటు దొర కాల్లల్ల మొక్కిన బాంచెన్.... బతిలాడిన, గిమాలిన– ఎవలు నా మాటినలే– నా కట్టం సూశ్నే– ఇగత్తదన్నరు, అగో అచ్చె అచ్చెనన్నరు. అచ్చినట్టే సేసింద్రు. నీల్లు వోసినట్టే నీల్లారిచ్చింద్రు. నిముషాలన్నరు, గడియలన్నరు, గంటలన్నరు, దినాలన్నరు, నెలల కాడికచ్చింది.” నర్సింహం తల గోక్కున్నడు– ‘బరాబరే సెప్పుతన్ననా?’ అని గుడిసేపు ఆగిండు– సేతులు జోడిచ్చి కొంచెం ముంగటికి జరిగిండు.

కాయిదాలమీన గీకుతన్న కలాన్ని మూసి బల్లమీన పెట్టిండు– కొన్నిటికి గుండు సూదులు పెట్టిండు– కొన్నిటమీన సీసం గుండు పెట్టిండు– గ సీసపు గుండునే గిర గిర తిప్పిండు– అంగి బల్ల సొరుగిగ్గిండు– మల్ల మూసిండు– అటెన్క మోసేతులు బల్లమీన ఆనించి ఏల్లేల్లు ఇరికిచ్చుకొని బంగారు రంగద్దాల నుంచి సినిగిన అంగి నర్సింహంను సూసిండు– అటెన్క కనుబొమ్మలు ముడిసి ఎడంసేత బట్టతల పునుక్కున్నడు– గయ్యాన్ని సేసి సుత పెద్దొర పెదవిప్పలేదు. నర్సింహంను అరిపాదాల నుంచి నెత్తి దనుక మల్ల మల్ల సూసిండు.

నర్సింహంకు ఆశ పుట్టింది– మల్ల అంగి దండం బెట్టిండు.

“నీ కాల్మొక్కుత దొరా! మొన్న అయితారం అద్దుమరాత్రి కలికి గాంధారేల్ల నా పెరట్ల కంభాలు పీకిచ్చి మా ఊరి పెద్దొర పతాపరెడ్డివారు, వారి మిరప తోట్ల పాతిచ్చుకున్నరు– తీగె సుట్టిచ్చుకున్నరు– లబలబ మొత్తుకున్న.”

కరంటు పెద్దొర ముండ్లమీన కూసున్నట్టుగ కదిలిండు.

“చూడు, నీ పేరేమిటన్నవ్? ఇక్కడ కొట్లాటలు, కాట్లాటలు చెప్పవలసింది కాదు– ఇది కరంటు డివిజనల్ ఆఫీసు– వింటున్నవా? మున్సిబు మెజిస్ట్రేటుముందు కోర్టులో చెప్పాలి– మీ దొర కొట్టినాడో, నువ్వే మీ దొరను తిట్టినవో? ఆ సంగతంతా అక్కడ విచారిస్తరు– నీ పెరడి లోపలున్న కరెంటు పోల్సు పీకించుకపోతే పోలీసులకు చెప్పు–”

“ఆడికి సుత పోయిన బాంచెన్– అళ్ళు గవాలు కావాల్నన్నరు– రుజువులు గావాల్నన్నరు. ఆడికచ్చి సూడుండ్రన్న– నీ సేండ్లయి దొర మనుషులే పీక్క పోయిండ్రని నమ్మకమేంది ? నువ్వే దొర కంభాలు నాయంటన్నవు గావచ్చునని ఎదురడిగిండ్రు బాంచెన్– సెప్పబోతె కరువచ్చినట్లున్నది బాంచెన్– కాదు బాంచెన్ కరంటు దొరల నడుగుండ్రన్న– అమీన్ సాబు దొర బిలిసి మీనిమీనికచ్చి ‘అరె నీకు భూమ్మీన బతుక బుద్ధయితలేదా ?’ అని ఎక్కువ తక్కువదిరితే ‘దొడ్డెతోల్తు’ నన్నడు బాంచెన్.”

“అవ్వన్ని నా కవసరంలేదు– నాకు పనున్నది. నువ్వెళ్ళిపో– రేపు నేను మీ ఊరొస్తున్న– అక్కడ కలువ్ !” పెద్దొర కుర్సీల సదురుకొని కూకుండి బల్లమీన గంట కొట్టిండు.

నర్సింహం సున్నగ మెరుత్తన్న బూట్లను సూసుకుంట నిలుసుండి పోయిండు– జవాను నర్సింహంను బయటికి తీసుకపోయిండు.

నర్సింహం ఇంటికచ్చేటాల్లకు నాత్రి సాకల్లి ఊరుదిరిగి పోయింది– మల్లికాంబ దీపం పెట్టుకొని ఎదిరిసూత్తంది–

“కాయా ? పండా ?” అడిగింది మల్లికాంబ.

“కాయగాదు పండుగాదు– గుర్రం కడుపుల గుడ్డు. ఏడ జెప్పుకున్న ఎదురు కున్నట్టుగనే అంత ఒకటే మాట– గయినెతోనెందుకు కయిలాట్కం బెట్టుకున్నవని దొరనెనుకేసుకత్తంర్రుగని– గరీబోడని ఎవడన్న సాయపడ్తండా ?”

“నేం జెప్పుతలేనా ? ఇది దొరల రాజ్జెమని–”

“ససరాదే ఏం జెప్పుతన్నవ్.... సెప్పుడు–” నర్సింహం ఏడి కోపమో ఏన్నో తీసిండు.

“కసురుకుంటన్నవ్.... పొద్దుందాక కూడు దినలే, రా రా–”

“నువ్వు సుత తినలే–”

మల్లికాంబ కంచంల గడుకేసి కూకున్నది–

“అయిలన్న గలిసిండు–” అని బువ్వ దినుకుంట సంగతంత చెప్పొకచ్చిండు.

“దేవుని గుల్లె రాయివడ ! ఇద్దరక్క సెల్లెండ్ల బతుకులు గట్లనే ఉన్నయి–” అన్నది.

"సత్తెవ్వ పన్నదా?" అన్నడు నులక మంచంల బిడ్డను సూసుకుంటనే—

"పోరి సూసి సూసి పన్నది—" అన్నది మల్లికాంబ.

*　　　*　　　*

అడ్డదారికాడ అంబటాల్ల నుంచి నిక్కినిక్కి సూసుకుంట, ఆడికీడికి తిరుక్కుంట; ఇప్పసెట్టు కింద గుడిసేపు నిలుసుండుకుంట అత్తనన్న కరంటు పెద్దొర కోసం ఎదురుసూత్తండు నర్సింహం. పాయే— సరసర పొద్దు జరిగిపోబట్టె— పసుల మీదోల్లు దూపకులు దిని మల్ల పసులమీని కెక్కిరి— అట్టిట్ల నెత్తిమీదికి పొద్దచ్చె—

"మనువు నిత్తెంలేదు, మా అవ్వను ఏకుల రాట్నం బంపుమన్నట్టున్నది పని వరుస— అత్తనన్నోడు ఇంక రాకపాయె— అత్తడో రాడో? ఆనికేం తీట? మతి కున్నదో లేదో? మల్లేం పనిపడ్డదో? సీ, నీయవ్వ ఏ ఏల్లన తల్సుకున్ననో గని పల్లగుల్లాల పనైతంది— ఉబ్బిల దిగి పెద్దల తల్సినట్టున్నది కత— కొత్తిచ్చ రోగం గొనుక్కున్నట్టె గిసొంటి ఎవారాలు. అత్తడాండాలె, లేవద్దు— లేసుడే అంబటాల్లకు లేత్తరు దొరలు— లేసి మొకం దోమెటాల్లకే బువ్వలుదినే ఏల్లయితది— 'చా'లు గీలు తాగి— అటనఇటన బువ్వదినేటాల్లకు ఎంత లేదన్న పంచిగనే పొద్దెక్కద్ది— అత్తండాలె— పుట్టగడ్డమీనికెక్కి నొసలుకు చెయ్యడ్డం బెట్టుకొని పార సూసిండు.

సవుల్లమీన దుమ్ములేసినట్టనిపిచ్చింది— నిచ్చంగనే దుమ్ములేత్తంది— మోటర కనిపిచ్చింది. నర్సింహం జెపజెప తొవ్వల కురికచ్చిండు.

మోటర రానే అచ్చింది— మోటర్ల కరంటు దొర కూకున్నడు— పబ్బతి బట్టుకొని జీపు కెదురుంగ ఉరికిన నర్సింహం మొఖం మీన దుమ్ముపోసి బర్రున ఊల్లెకురికింది— దుమ్ము దులుపుకొని కండ్లు దెరిసిసూత్తే జీపు కనుపరుగై పోయింది— దానెంట బడి ఎగపోసుకుంట నర్సింహం ఉరికిండు....

మోటర అడలు అంతలు దాటి, సందు గొందులు దాటి ప్రతాపరెడ్డి దొర గడి ముంగటి కచ్చి ఆగింది.... సుంకరోడు ఎదురు సూత్తన్నట్టుగనే మోటర ముంగటి కురికచ్చిండు.

"దొర ఉన్నాడుర? కరంటు దొర వచ్చిండని దొరకు చెప్పుపో పరుగెత్తు" సిన్న ఇంజనేరు మోటర్లనుంచి కింద దునికి సెప్పిండు.

సుంకరోడు గడీల కురికిండు.

ఆపెన్క కరంటు పెద్దొర గడీలల్లకు నడిసిండు....

గప్పుడే నర్సింహం ఉరికచ్చి మాటలు రాక నిలుసుండి పోయిండు....

ఇంతెజాములన్ని తయినెతుగున్నయి– కుర్సీలు వేపిచ్చి ఉంచిండుదొర. ఇద్దరు అలాయి బలాయి తీసుకున్నంత పన్జేసిండ్రు– ఎనుకటి సుట్టాల తీర్గనే మాట్లాడుకున్నరు– తతిమ్మోళ్లకు కింద,పెద్దోరకుమీద, పలారం బెట్టించిండు భోజనాలు అళ్లే అద్దన్నరు– నాస్తనాస్త కిందనే, కోడిగుడ్లట్లు, ఏకీలుకాకీలు ఏంచిన కోడిని, పూరీలు తిన్నరు– అటెన్క ప్రతాపరెడ్డిని మోటర మీ నెక్కిచ్చుకొని మిరుపతోట్లకు పయన మయ్యిండు కరంటు దొర.

ఆగొడ్డుకు మోటరాపి సవారు కచ్చులం లెక్కిండ్రు– అట్ల మిరుపతోట్ల అడుగుబెట్టెటాల్లకు ఎసాలాల్లయ్యింది....

"మారెకురాల మిరుపతోట మస్తైగల్సి పోతుండే– సేసినశ్రమ అట్లుంచుండ్రి పెట్టిన పెట్టుబడి నీల్లల్లేసుకున్నట్టయి పోతుండె– యాల్లకు మీరందకపోతె...." ప్రతాపరెడ్డి పెద్దఇంజనీరును వోరగ సూసుకుంట అన్నడు....

"అఁ! మధ్యన మాదేమున్నది. నిమిత్తమాత్రులం– మీ అయిడియా అంతా మీ లాంటి వారు చెప్పడం మేం వినకపోవడమా? మాకు పుట్టగతులుంటాయండి?" ముసి ముసి నవ్వుకుంట అన్నడు పెద్దఇంజెనీరు–

పెద్ద ఇంజెనీరు దూరంగ పార సూసిండు– ఎండల కరంటు పోలుమీదికెక్కి లైనుమన్ పని జేత్తండు– మనుసుల నవ్వుకున్నడు.

హెల్పర్లు, పైరుమన్‌లు, లైన్ఇన్స్పెక్టర్లు కరంటుపోలు చుట్టు గాబరతోటి తిరుగుతండ్రు–

ప్రతాపరెడ్డి మీసాలకింద పెదవులు జోరుగ నవ్వినయ్.

"ఇంతకూ ఇయ్యల్ల పిట్టింగంతయిపోయి నీల్లు పోత్తదంటరా?"

"కరంటాఫీసే కదిలివస్తే– నీల్లుకాదండీ! పాలు పొయ్యమన్న పోస్తయ్...."

ఇద్దరు పకపక నవ్విండ్రు....

అల్లకు దూరంగ మక్కపెరట్ల బాయిగడ్డమీన నిక్కినిక్కి సూసుకుంట– పండ్లు పటపట గొరుక్కుంట– ఏందేందో గులుక్కుంట నిలుసున్నడు నర్సింహం....

"అదిగో అలా కన్పిస్తున్నది మొక్కజొన్న చేనేకదూ?"

ప్రతాపరెడ్డి ఇంకోదిక్కు సూయించుకుంట ఇననట్టే–

"కామేశ్వర్‌రావు గారు– గీ మిర్చి ఉన్నదే చాలా దూరంనుంచి తెప్పిచ్చిన– ఎకురాన ఎంత లేదన్న అరుపుట్లు రాలుద్ది...."

కామేశ్వర్‌రావు సమజ్ చేసుకున్నడు–

"అవునండి చూస్తే అలాగేఉంది– బాగాఎదిగింది కూడా! చెట్లు బాగా పిందెల తోటున్నయి– ఎరువులు బాగా వాడినట్టున్నది...."

నీళ్లపంపు దగ్గెరపడ్తంది– ముఢుతమందు అసన గుప్పుమన్నది. ముక్కుల నిండా మందు అసనే– ఆగొడ్డుకు పెట్లనీడలు తూరుపు దిక్కు పరుసుకుంటన్నయ్....

"దేఖోరెడ్డిసాబ్– నిన్న మీమీద నాకు ఫిర్యాదు వచ్చింది–" కామేశ్వర్‌రావు

"ఫిర్యాదా?" దొర గట్టిగ నవ్వి "ఊరకుక్కలు ఊళ్లెమొరిగే దమ్ములేక బయట గట్లనే మొరుగుతయ్– ఎంత మంచిగుండబోయిన ఓటిరానే అత్తది దానిదే ముంది?"

"అదికాదండీ! వాడి పెరట్లోని స్తంభాలు పీక్కొచ్చిండ్రట– కరంటువైరు కూడ తెచ్చుకున్నరట."

"నాకెరుకలేదే– సెకెదారు గిన– తమరికెరుకలేందేమున్నది.... అయ్యింటెనే గద తమరు గీడికొస్తిరి...."

కరంటు పెద్దొర, మాటలాపి జెప్పజెప్ప వాగొడ్డుకు నడిసిండు....

"సాగ్రదావు! అయిపోయినట్టేనా?" తనిఖీ చేసిండు....

ఆకసం పడుమటి దిక్కు నర్సింహం మొఖమోలె జేవురించింది. కరంటు పెద్దొర బిస ఒత్తిండు. మోటర గిరగిర తిరిగింది. ఇంజన గొట్టంల నుంచి నీల్లు సిమ్మినయ్– మేకపోతు తెగిన మెడనుంచి నెత్తురు సిమ్మింది– నీల్లు జలజల తోటల పారినయ్....

ప్రతాపరెడ్డి దొర సానా పసందుగ నవ్వుకుంట విలాసుండి ఇంజనును, తోటను సూసుకున్నడు.

* * *

ఆఖరి బుక్క నోట్లెపోసి, గొంతికె రాసుకొని కండ్లు పులపొడిసిండు కరంటు దొర. కండ్లు ఎరుపెక్కినయ్– మాట తడబడ్తంది....

"హమ్.... బహుత్ ఖుష్‌హోగయా రెడ్డిసాబ్...."

"దేఖో డి. ఇ. సాబ్ యాదురకునా! ఆనికి కరంటిచ్చినవో? వాడు నాగడి గోడ లెగ బాకుతడు– అన్ని ఏకీలు కాకీలు ఇరిసేయచ్చునను కో" కోడిబొక్కను పటుక్కున కొరికిండు దొర....

"వో కోన్ హై ? వాడా ! కరంటు రావాలంటె మాటలా ? తపస్సు చేయాలె– ఒంటికాలు మీద" కరంటుదొర అట్టట్టిగనే పలుగబడి నవ్విండు. అటెన్కనవ్వాపి కుర్సిల ముంగటికి జరిగి కూసున్నడు–

"రెడ్డి సాబ్ ! ఆప్‌క మర్జి– ఇంకో ముఖ్యవిషయం– నా ప్రమోషన్ సంగతి మినిష్టర్ సాబుసే బోల్‌దేనా...."

"సూద్దాం.... సూద్దాం...." దొర మరింక మాట్లాడలేదు....

కరంటు దొరకు బాగా ఎక్కింది– రానిది పోనిది ఏందేందో అదురుకుంట మెడలాలాడేసి కుర్సిమీన్నే ఒరిగిపోయిండు– రెండు సేతులు కూర గిన్నెల్నే ఉండి పోయినయ్....

"సదువు మానిని కోసం– ఏంచేస్తవుర ముసలిసన్నాసి– ఎవడు వాడు ఉస్తాద్ ఖయ్యామా ? ఉమర్ ఖయ్యామా ?" కరంటుదొర కలువరిత్తండు.

దొర అప్పటికే అక్కన్నుంచి లేసిపోయిండు....

ఎడ్లకొట్టంల ఇసిరెలఅర్రల లైనినిస్పెక్టరు కూరపూకుట్లసెక్క పేడు తిప్పిండు. ఒక్క మాంసంముక్కసుత తాకలేదు– "లంజకొడుకులు ! పందులు తిన్నట్టుతిన్నరు. ఒక్క తునుక మిగులకుంట– కట్టెముకడిది– పలిత మొకడిది...." పచ్చిమిరుపకాయ కొరుక్కుంట సార తాగిండు.

ఆశతోని సూత్తన్న ఎలట్రీషన్ "నోముకున్నోని బూరె నోసుకున్నోడు తిన్న డట–" అని పెదువులు నాక్కున్నడు.

హెల్పర్లిద్దరు దుబ్బుల సొమ్మసిలి కూరుకుపట్లు పడ్తండ్రు.

నూతి గడ్డమీన ఎటుతోసక కూకున్న నర్సింహం సీకటయ్యేదనుక దొర మిరుప తోటను, నీల్లు పోత్తన్న ఇంజనును సూసుకుంట కూకున్నడు.

"ఎన్నటికైని ఉన్నోడు ఉన్నోడు ఒక్కటె బంచత్.... కులంకులమొక్కటట– అశ్నాల్లు ఒక్కటి గాకుంటె లేనోన్ని భుజాల మీనెక్కిచ్చుకుంటరా ? ఒకడు సత్తెనె గద ఇంకోడు బాగుపడేది....? నూరుమంది అరిగోసపడ్తె దొర కిలకిల నవ్వుతడు– మూన్నెల్లు కాల్లకు బలుపాలు కట్టుకొని తిర్గి, కనిపిచ్చిన లంజకొడుకుల్లా కోతి దండాలు బెట్టినా సుత, నీ కడుపు నొప్పేందిరా అని అడుగనోల్లు.... దొర పిలువంగనే ఉరుకుత అచ్చి మూడు ముచ్చెట్లమీన పంపు పోపిచ్చిండ్రు– ఎన్నటికైనా దొరలంతా ఒక్కటే– కరంటవ్వను మాదుగులు దెం.... కరంటును గద్ద తన్నుకపోయింది– ఆశ పడ్డోని నెత్తిమీన తాటిపండు బడ్డది– ఇగ కరంటుకు నీళ్ళారగిచ్చి దండంబెట్టి, సెంప లేసు కొని మోటర సమ్మాళె...." నర్సింహం కాండ్రకిచ్చి ఊంచి లేసి నిలబడ్డడు– పెయి మీన ఏందో పారుతన్నోని తీర్గ నెత్తి పంచెతోని దులుపుకున్నడు– పెద్దపెద్ద జంగలేసు కుంట పల్లెకెల్లి నడిసిండు.

(ఇంకా వున్నది)

బండెక్కి జండెత్తు

ఎ. వి.

బాజాల్ల బండుండె నేరియాలో
బండికి రెండెడ్లుండె ,,
ఎర్రెర్రని తోవల్ల ,,
బండి సాగి దుమ్ము రేగె ,, ॥బాజాల్ల॥

ఎర్రమన్ను సెలుకల్ల ,,
మనయిగాని సేండ్లల్ల ,,
బతుకు పాతరయిపాయె ,,
మెతుకు దూరమైపాయె ,,
మనల దోచె దొంగెవడో ,,
మనల దోచె దొర ఎవడో ,,
కళ్ళు తెరిచి గుర్తుపట్టి ,,
గద్దరిచ్చి నిలబెట్టు ,, ॥బాజాల్ల॥

తెల్లు జెర్లు గుట్టంగ ,,
రాయి రప్ప లేరేసిన ,,
సేను సెలుక మనదన్నా ,,
పొలము పుట్ర మనదన్నా ,,
నాదన్నా మొనగాన్ని ,,
బండి గీరెకు గట్టు ,, ॥బాజాల్ల॥

సీటెక్కిన దొడుకావు ,,
నీతులెన్నో జెప్పుతాడు ,,
భూదాన మంటాడు ,,
భూములత్త యంటాడు ,,
సర్కారు మనాదాని ,,
సవారాజ్య మంటాడు ,,
నేతి బీరకాయ నీతి ,,
మీకు నాకు తెలావనిదా ,,
బలిసిన ఆ కొడుకులాను ,,
బండ కింద తోసెయ్యి ,, ॥బాజాల్ల॥

ముసిముసి మబ్బుల్ల ,,
మోటగొట్టె యన్నా ,,
మోటాపి ఇటు సూడు నేరియాలో
బండి కదిలి పోతంది ,,
మండేటి ఎండల్ల ,,
మన్ను దవ్వే అన్న ,,
కాలేటి బండల్ల ,,
కంకరగొట్టె యన్నా ,,
కాసేపు ఇటు సూడు ,,
బండెల్లి పోతంది ,, ॥బాజాల్ల॥

బొగ్గు బాయి పొక్కల్ల ,,
బొగ్గు తవ్వే అన్న ,,
రాకాసి యంత్రాన్ని ,,
కాక తీసే అన్నా ,,
తల ఎత్తి సూడరాద ,,
బండెల్లి పోతంది ,, ॥బాజాల్ల॥

మాలన్న మాదిగన్న ,,
గొల్లన్న కుర్మన్న ,,
కాపన్నా రైతన్నా ,,
లేనోడ కూలన్నా ,,
నీ బతుకు కొరకు పోరాడు ,,
నువు బాగుపడా పోరాడు ,,
భూమి కొరకు పోరాడు ,,
నీ భుక్తి కొరకు పోరాడు ,,
నువు పోరాడ బండెక్కు ,,
బండెక్కి జండెత్తు ,, ॥బాజాల్ల॥

నేటి పోరు బాటల్ల ,,
ఎర్ర పూల తోటల్ల ,,
అన్న లొరిగిస జాగల ,,
పేరు పేరు నన్నలాను ,,
ఊరు ఊరునా తలువు ,,
నువు పోరాడ బండెక్కు ,,
ఎరుపు రంగు జండెత్తు ,, ॥బాజాల్ల॥

చీకట్లో
చేన్ల మధ్యగా నడుస్తున్నాను
ఊళ్ళోకి ప్రవేశించనీకి.
సూర్యుడి అస్తమయం ఎరుపు
నా మీదుగా చుట్టూ ప్రదేశాన్ని
ఆవరించింది
చుట్టూ గ్రామాలన్నీ ఎర్రబారాయి

పొలిజెక్కులా కింద ఉయ్యాలో
పంట చేన్ల లోన ,,
పని చేసె అక్కలు ,,
దున్నేటి అన్నలు ,,
చకచకా చేన్లన్ని ,,
రగరగా పెరిగేను ,,
కూలి ధర పెరుగలే ,,
కూటి ధర పెరిగేను ,,
పెరట్ల దున్నేటి ,,
ఓ పేద రైతన్న ,,
కౌలు కిచ్చిన వన్ని ,,
కష్టించి దున్నేవు ,,
ముసుక్కలోన వుండి ,,
ముంచే వాళ్లెందరో ,,
పేదసాదలలోన ,,
పెట్టిరి తేడాలు ,,
పరంబోగులన్ని ,,
బంచరాయీలన్ని ,,
కలిపిరి పట్టలో ,,
కని బండ జరిపిరి ,,
కష్టపడె కూలన్న ,,
కంటిలో కనుపాప ,,

వెలుగు పుడుతుంది

గోదావరి

చినమెట్‌పల్లి శివయ్య రక్తం
లొత్తునూరు పోశాలు అన్నయ్యరక్తంతో
కలిసి గోదావరి ఎర్రగా పారుతుంది
ఈ ఎరుపు ఉత్తేజంనుండే వేలాది వీరులు
చీకటిలో పోరాడుతారు– వెలుగు కొరకు
నేను పయనించే చీకటి నుండే
వెలుగు పుడుతుంది.

ఉయ్యాల పాట

టి. వెంకటేశ్వర్

ఒంటిలో కండలను ఉయ్యాలో
కరిగించి వేశావ ,,
కరువులో ముంచావ ,,
కంట నీరెట్టకు ,,
ఒంటరిగ లేవన్న ,,
రక్తమసొంటిది ,,
ఎర్ర జెండున్నది ,,
ఆ జెండ కిందనే ,,
సంఘమై వుందాము ,,
పోరాట బాటలో ,,
పయనమై పోదాము ,,

జనం అంటె ఎవరు వారు?
కండల్ని కరగించెటోళ్ళు
సరుకును సృష్టించెటోళ్ళు
ఉత్పత్తిని పెంచెటోళ్ళు –

జనంమీద బ్రతికెటోళ్ళు
జనం శ్రమను దోచెటోళ్ళు
జనం కాదోయ్ జలగలోయ్.

— బి. వి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నాగా ప్రజల పోరాటం

లుయింగమ్ లుయితీ నాగా

గత రెండు దశాబ్దాలుగా నాగాలాండ్, మణిపూర్, మిజోరామ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో సైనిక పాలన విధింపబడింది. ఈ సైనిక పాలనకి వ్యతిరేకంగా చాలా చోట్ల సాయుధ తిరుగుబాట్లు జరుగుతున్నాయి. నాగాలు తమ స్వయం ప్రతిపత్తి కోసం రెండు దశాబ్దాలకు పైబడి వీరోచిత పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. నాగాలాండ్ జనాభా అయిదు లక్షల పదహారు వేలదాకా వుండవచ్చని అధికారవర్గాల అంచనా.

భారత ప్రభుత్వ దమననీతికి సుమారు లక్షకు పైబడి నాగాలు బలైపోయారు. బతికి బట్టకట్టిన వాళ్ళలో చాలామంది అనేక చిత్రహింసలకు గురైనవాళ్ళే. స్త్రీల మూకుమ్మడి మానభంగాలు, కరెంటు షాకులు, ఆకలితో రోజులతరబడి మాడ్చటం, మర్మాంగాల్లో కారం దట్టించటం, కర్రలతో - తుపాకీ మడమలతో చితక కొట్టడం, తలక్రిందులుగా వ్రేలాడదీయటం, పొగ నింపిన గదిలో నిర్బంధించటం.... యిత్యాది చర్యలన్నీ శాంతిభద్రతల పునరుద్ధరణ పేరున ప్రభుత్వం గైకొన్నవే. ప్రపంచాభిప్రాయాన్ని తన కనుకూలంగా మార్చుకోవాలనే తాపత్రయంలో ప్రభుత్వం తన యీ దుర్మార్గపు చర్యలన్నీ కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తోంది. అయినా ప్రపంచ ప్రజలు నిజం తెలుసుకొంటూనే వున్నారు.

నాగాలాండ్ చరిత్ర

భారత, బర్మా దేశాల నడుమ కొండ ప్రాంతాలమీద నివాస మేర్పరుచుకొన్న కొండజాతి ప్రజలే నాగాలు. చిండ్‌విన్ నది ఈ ప్రాంతంగుండా ప్రవహిస్తుంది. 'జూమే ఖేతీ', 'పానీ ఖేతీ' అనే రెండు రకాల వ్యవసాయం ఇక్కడి ప్రజల ప్రధాన వ్యాపకం.

పందొమ్మిదో శతాబ్దంలో ప్రపంచ మార్కెట్ల గుత్తాధిపత్యం కోసం వలస దేశాలు పోటీ పడుతున్న తరుణంలోనే, నాగాలు సామ్రాజ్యవాదుల చూపుల్లో పడ్డారు. యూరోపియనులు యీ ప్రాంతానికి వచ్చే నాటికే, నాగాలు ఒక తెగగా స్థిరపడి, ప్రత్యేకమైన జీవన విధానం కలిగివున్నారు. కమ్యూన్‌ల పద్ధతిలో పల్లెలు రూపొందించ బడ్డాయి.

ఆనాటి అస్సామీస్, మీటిస్ ఫ్యూడల్ సమాజాల దాడి నుంచి తమ్మ తాము కాపాడుకొనేందుకు నాగాలు సమిష్టి ప్రయత్నాలు చేశారు. నాగాలకి ఎన్నడూ కేంద్రీకృత ఆర్థిక, రాజకీయ విధానం వుండేది కాదు.

సహజ సంపదలు, యితర వనరులు సమృద్ధిగా వున్న బర్మా, బ్రహ్మపుత్ర తీరాల మీద బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకి 18వ శతాబ్ది నాటికే కన్నుపడింది. అయితే యీ ప్రాంతాన్ని తమ వలసగా మార్చుకోవాలనే ఏ యితర గట్టి ప్రయత్నం యీ రెండు దేశాలు చెయ్యలేదు. జాతీయంగా తమ దేశాల్లోని పరిస్థితులతోపాటు, యీవరకే ఆక్రమించిన యితర భూభాగాల్లో స్థిరపడే ప్రయత్నంలో ఆ దేశాలు వున్నాయి. చాలా కాలం పాటు యీ ప్రాంతం బెంగాల్‌లోని బ్రిటిష్ ప్రభుత్వానికి వియత్నాం (French-Indo-China) ల మధ్య నిర్యుద్ధ మండలం (Buffer Zone) గా వుండిపోయింది. 18వ శతాబ్ది అంతానికి తన అంతరంగిక రాజరిక తగాదాల నుంచి బయటపడి బర్మా శక్తివంతమైన రాజ్యంగా ఆవిర్భవించింది. ఆ ప్రాంతంలోని అస్సామ్, మణిపూర్, త్రిపుర, జయంతియా, కచార్ మొదలైన చిన్న రాజ్యాలన్నిటిని బర్మా పూర్తిగా జయించడమో, లేక తన వలసలుగా మార్చుకోడమో జరిగింది.

దీంతో బర్మా - బ్రిటన్‌ల మధ్య ప్రత్యక్ష ఘర్షణ చెలరేగింది. పదవీచ్యుతులైన అనేక మంది రాజులను ఒక కూటమిగా ఏర్పాటుచేసి, బ్రిటన్ వారిచేత 'ఆత్మ-రక్షణ' పేరున పోరాటాలను ప్రేరేపించింది. 1826 ప్రాంతాలకల్లా బర్మాను ఆక్రమిత ప్రాంతాల నుండి గెంటివేయడం జరిగింది. ఆనాటి నుంచి బ్రిటిషు వలసల ఏర్పాటు విధానానికి అక్కడ నాంది ప్రస్తావన జరిగింది. ఆయా రాజ్యాల్లో నెలకొని వున్న అంతరంగిక, బహిరంగ ప్రతిపక్షాలను అధిగమించేందుకు 'సహాయ పథకం' ముసుగులో యీ పథకం రూపొందించబడింది. ఇందుకు ప్రతిఫలంగా ఆయా రాజుల నుంచి బ్రిటిషు వారికి ఎన్నో వాణిజ్య రాయితీలు, నివాస స్థలాలతోపాటు, ఆయా రాజ్యాల్లో బ్రిటిషు సైన్యాన్ని వుంచేందుకు వీలు కల్పించబడింది. దీని పరిణామంగా తమ ప్రాంతాల్లో శాంతిభద్రతలు పర్యవేక్షించే అధికారం ఆ రాజులకు పోయింది. అసమర్థత, అవినీతి ప్రబలిందనే సాకుతో అధికారం వారి నుంచి దఖలుపర్చుకొని, ఆయా రాజులతో అధికార విరమణ చేయించి, పూర్తి రాజ్యాంగ అధికారాలని స్వీకరించారు.

బ్రిటిషు 'సహాయ పథకాలు, శాంతి భద్రతల పర్యవేక్షణ' ముసుగుల చాటున ఏర్పడిన వలసల ఏర్పాటు క్రమంలో, తనకు కీలు బొమ్మల్లా వ్యవహరిస్తున్న రాజుల చేత గిరిజన భూభాగాలను (Tribal Territories) ఆక్రమింపజేశారు. అప్పుడే నాగా భూభాగంలో కొంత భాగం పరాధీనం అయింది. ఆ తర్వాత కొంత కాలానికి కొండజాతి ప్రజల అడవి భూములు కూడా చుట్టు పక్కల రాజ్యాల్లో చేరి

పోయాయి. దీని పర్యవసానంగా బ్రిటిషు వారు వారి సైనాతిలయిన రాజులకి - నాగా ప్రజలకి మధ్య ప్రథమ పోరాటం 1832 లో జరిగింది. బ్రిటిషు సామ్రాజ్యవాదులను, వారి కూటాలను నాగా ప్రజలు ఎదిరిస్తూ, అవిశ్రాంత పోరాటం కొనసాగించారు. ఇలా యీ పోరాటం 1879 నవంబరు 22 దాకా సాగింది.

1880 మార్చిలో బ్రిటిషువారికీ, నాగాలకి నోటి మాటగా కుదిరిన శాంతి (?) ఒప్పందం ఫలితంగా ఈ పోరాటం తాత్కాలికంగా విరమించబడింది. ఈ ఒప్పందం ప్రకారం కొంత పరిమిత భూభాగం మాత్రమే స్వతంత్రంగా వుండిపోగా, మిగతా విస్తారమైన నాగా ప్రాంతమంతా బ్రిటిషువారి అధీనంలోనే వుండిపోయింది.

రాజకీయంగానూ, నిర్వహణాది యితర విషయాలలోను బ్రిటిషువారు నాగా ప్రాంతాన్ని మిగతా దేశం నుంచి భిన్నంగా చూసేవారు. ఇందుకు రెండు కారణాలు వున్నాయి.

1) నాగా ప్రాంతానికి, మిగతాదేశానికి చారిత్రకమైన అనుబంధం వున్న దాఖలాలు లేవు.

2) సాంస్కృతిక, ఆర్థిక, మతరంగాల్లో నాగాలకి, మిగతా దేశానికి ఎలాంటి పోలికా పొంతనా లేదు. జాతి పరంగా చూస్తే వారు నిర్ద్వంద్వంగా భారతీయులు కానట్లే.

ఈ కారణాల వల్ల బ్రిటిష్వారు నాగా ప్రాంతాన్ని ప్రత్యేకమైన ప్రాంతంగా (Exclusive territory) వేరుచేసి, ఒక్క రాజకీయాధికారాన్ని మాత్రమే వుంచుకొని, మిగతా అన్ని విషయాలు నాగాలకే వదిలి వేశారు. బ్రిటిషు వారి సుదీర్ఘ పాలనలో నాగా ప్రాంతంలో నూతన విద్య ప్రవేశపెట్టబడింది. మిషనరీలు వెలసి, క్రిస్టియన్ మత ప్రచారాన్ని ప్రారంభించాయి. ఎనభైశాతం నాగా జనాభాకి మత మార్పిడి చేయగలిగారు. ఈ మత మార్పిడి ఫలితంగా నాగాలకి, యూరోపియన్లకి (British and Americans) మధ్య సామరస్య వాతావరణం నెలకొంది.

భారత ఉపఖండంలోని హిందూ - ముస్లింలతో నాగాలకి ఎలాంటి చెప్పుకోదగ్గ అనుబంధం ఏర్పడలేదు. హిందువులు నాగాలని అంటరాని వారిగా చూడటం అందుకు ఒక కారణం. నాగా ప్రాంతం మొత్తంలో కాంగ్రెస్‌కి ఒక్క కార్యకర్త లేడంటేనే యీ వాస్తవం అర్థమవుతోంది. 1929లో సైమన్ కమీషన్ రాక సందర్భంగా, నాగాలకి ప్రాతినిధ్యం వహించే 'నాగాక్లబ్' నాగాలకి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రత్యేక రాష్ట్రం (State) కావాలని ఆందోళన చేసింది. హిందువులతో కలిపివుంచే

ఎలాంటి ఏర్పాటును సహించబోమని ఆనాడే వారు స్పష్టం చేశారు. ఆ తర్వాత 18 సంవత్సరాలు కొనసాగిన బ్రిటిషు పరిపాలనలో సైతం, 1953 భారత ప్రభుత్వ చట్టం క్రింద నాగా ప్రాంతాన్ని ప్రత్యేక ప్రాంతంగా (Excluded area) పరిగణించే వీలుని కల్పించటం మినహా మరేం చేయలేకపోయారు.

నాగా ప్రజలలో అంతకంతకూ పెరుగుతున్న చైతన్యానికి గుర్తుగా, కొంత మంది నాగాలు మాతృభూమి విముక్తి కోసం సాయుధ పోరాటం ప్రారంభించారు. నాగా ప్రజల నాయకుడు జడ్. ఎ. ఫిజో నాగా విముక్తి కోసం జపాన్ పక్షం వహించి, పోరాటానికి నాయకత్వం చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు 'భారత విముక్తి' కోసం నాగాలతో మంతనాలు జరిపారు. నాగాలాండ్‌ని భారత దేశంలో కలుపుకోవాలనేదే ఈ చర్చల సారాంశం. నాగా ప్రజలు 'నాగా జాతీయ సంఘం' (Naga National Council) పేరున రాజకీయ పార్టీగా ఏర్పడి కాంగ్రెసు వారి మోసపూరిత ఐక్యతా ప్రయత్నాలని త్రిప్పికొట్టారు.

'అధికార మార్పిడి' సమయంలో నాగాలతో జరిగిన అనేక సంప్రతింపుల ఫలితంగా తొమ్మిది అంశాల కార్యక్రమం రూపొందింది. నాగా జాతీయ సంఘం వాదన ప్రకారం నాగాలాండ్ ఇండియా యొక్క రక్షిత దేశం (Protected State) గా పది సంవత్సరాలు వుండేట్టు, ఆ తర్వాత సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటించుకొనేట్టు; ఇండియా వాదన ప్రకారం పది సంవత్సరాలు రక్షిత దేశంగా వున్న పిదప, నాగాలాండ్ మిగతా దేశంలో సంపూర్తిగా విలీనం కావాలి. ఈ కీలకమైన విషయంపైన అంగీకారం కుదరని ఫలితంగా, యీ పథకం కూడా బుట్టదాఖలా అయింది. సైన్యాల్ని పంపి, నాగాలాండ్‌ని స్వాధీనం చేసుకోవటం జరుగుతుందని అస్సాం గవర్నరు బెదిరించాడు. ఈ బెదిరింపును బ్రిటిషు ప్రభుత్వ దృష్టికి, గాంధీ దృష్టికి నాగాలు తెచ్చారు.

భారత దేశంలో నాగాలు విలీనం కావాలని అంటూనే, ప్రభుత్వం చేతిలో ఏ ఒక్క నాగా హతమయినప్పటికీ, తన జీవితాన్ని అందుకు ప్రతిగా త్యాగం చేయ గలనని గాంధీ ప్రకటన చేసిన దృష్ట్యా నాగాలు ఆయన దృష్టికి తెచ్చారు. నాగాలకి స్వతంత్రంగా వుండే హక్కు సంపూర్తిగా కలదని కూడా గాంధీ ప్రకటించాడు,

భారతదేశ అధికార మార్పిడికి ఒక రోజు ముందుగానే అంటే 14-8-1947న, నాగాలు నాగాలాండ్‌ని 'స్వతంత్ర దేశం'గా ప్రకటించి, జాతీయ పునర్నిర్మాణానికి తయారయ్యారు. నాగా ప్రజల అభిమతాన్ని ఎంత మాత్రమూ పరిగణనలోనికి తీసుకోకుండా, భారత ప్రభుత్వం నాగా ప్రాంతం అంతా మిలిటరీ పోలీసు బలగాలతో నింపి

వేసింది. నాగా పాఠశాలల్లో భారత జాతీయగీతాలాపన నిర్బంధం చేయబడింది. జాతీయ దినోత్సవాలను బహిష్కరించిన విద్యార్థులపై తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోబడ్డాయి. అయితే నాగాలు భారత ప్రభుత్వ అధికారాలను లక్ష్యపెట్టకుండా, సహాయ నిరాకరణ కొనసాగిస్తూ, తమకు తామే 'సంస్థలు'గా ఏర్పడి పనిచేయసాగారు.

భారత ప్రభుత్వం నాగా జాతీయ సంఘ సభ్యులని నిర్బంధిస్తూ, చట్టధిక్కారం చేసిన వారిని తీవ్రంగా శిక్షించగలమని పదే పదే ప్రకటించింది. ఈ దశలో కూడా 'స్వతంత్రంగా బతుకాలనే' తమ దృఢ నిశ్చయం గురించి నాగాలు భారత ప్రభుత్వానికి నచ్చ చెప్పే ధోరణిని అవలంబించారు. అయితే ప్రభుత్వం నాగా జాతీయ సంఘాన్ని గుర్తించ నిరాకరించింది. ఆ సంఘ సభ్యులు సంఘ విద్రోహక శక్తులని, లేనిపోని గొడవలు సృష్టిస్తున్నారని భారత ప్రభుత్వం ఆరోపించింది.

'ఎవరు సంఘ విద్రోహక శక్తులో, ఎవరు మైనారిటీయో' ప్లెబిసైటు జరిపి తేల్చుకోవాల్సిందిగా నాగాలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం యీ బహిరంగ సవాలుని స్వీకరించే ధైర్యం చేయలేక పోయింది. ఆఖరికి నాగాలే 1951లో ప్లెబిసైట్ జరుపగా, ఏ ఒక్క నాగా కూడా ఇండియా ప్రభుత్వానికి అనుకూలంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. దీంతో భారత ప్రభుత్వం రెచ్చిపోయి, మరింత దుర్మార్గంగా వ్యవహరించ సాగింది.

1952లో ఇండియన్ పార్లమెంటుకు నాగా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిందిగా కోరగా, ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. పైగా నాగాలు భారత ప్రభుత్వానికి పన్నులు చెల్లించటం మానివేశారు. నాగాలాండ్‌లోని ముఖ్య ప్రాంతాల్లో తమ స్వంత పాఠశాలలని ఏర్పాటు చేసుకొన్నారు.

1953లో బర్మా ప్రధాని యూను (Unu)తో కలిసి నెహ్రూ నాగాలాండ్ వెళ్ళాడు. నాగా జాతీయ సంఘ నాయకులు నెహ్రూకి ఘన స్వాగతం యిచ్చారు. ఆ సందర్భంలో నాగా జాతీయ సంఘం నాయకులు సమర్పించిన విధాన ప్రకటనని తీసుకోను నెహ్రూ తిరస్కరించటంతో, తీవ్ర అసంతృప్తితో నాగా ప్రతినిధులందరూ సభనుబహిష్కరించారు. ఆపై నెహ్రూ వెంటనే పెద్ద ఎత్తున సైనిక పటాలాలను నాగా లాండ్‌కి పంపించాడు.

భారత సైన్యం నాగాలాండ్‌లో చెయ్యని ఘోరం లేదు. నగరాలు, గ్రామాలను చుట్టుముట్టారు. ప్రజలను మూకఉమ్మడిగా హింసించారు. వయసుతో నిమిత్తం లేకుండా స్త్రీలను చెరిచారు. యిళ్ళు తగుల బెట్టారు. పంటలను సర్వనాశనం

చేశారు. ఈ పరిస్థితుల్లో నాగాలు ఆత్మరక్షణ కోసమై సాయుధ పోరాటం చేయక తప్పలేదు. తగినంత ఆయుధ సంపత్తి లేకపోయినప్పటికీ, నాగా ప్రజలు సైనిక స్థావరాలపై దాడులు చేశారు. మందుగుండు సామగ్రి అయిపోగానే, రక్షణ కోసం ఆందోళనాకారులు అడవుల్లో తలదాచుకున్నారు- అంతేగాని ప్రాణభీతితో సైన్యానికి లొంగిపోలేదు.

"ఫెడరల్ గవర్నమెంట్ ఆఫ్ నాగాలాండ్" పేరుతో నాగాలు స్వంత ప్రభుత్వాన్ని ఏర్పరచుకొన్నారు. రెచ్చిపోయిన ప్రభుత్వం అడవులపై బాంబు దాడులు జరిపింది. కొన్ని రకాల రసాయనాలు వెదజల్లి పైరులను సర్వనాశనం కావించింది. సైన్యం విచక్షణా రహితంగా ప్రజలపై కాల్పులు జరిపి, నాగాలాండ్‌ని మరుభూమిగా చేయసాగింది.

పట్టుబడ్డ లేక నిర్బంధించబడ్డ నాగాల కాళ్ళకి, చేతులకి సంకెళ్ళువేసి, వాళ్ళతో సైన్యం తమ సరుకులను సరఫరా చేయించేది. క్షణం కూడా విశ్రాంతి లేక, ఓపిక నశించి, నెత్తిమీది బరువుతో, అలానే స్పృహ తప్పి, నేలమీద పడ్డ నాగాలని భారత సైన్యం అక్కడి కక్కడే కాల్చి చంపేది.

భారత ప్రభుత్వం నాగాలాండ్‌లోని అన్ని దేశాల మిషనరీలను వెళ్ళగొట్టింది. విదేశీయులను పంపించి వేసింది. ఇందువల్ల రెండు ప్రయోజనాలు వున్నాయి.

1. నాగా ప్రజలు పొందుతున్న ఆధునిక విద్య లేకుండా చేయటం.

2. నాగా ప్రజలపై జరిపే కిరాతక హింసాకాండ బయటి ప్రపంచానికి తెలియకుండా చేయటం.

నాగా వుద్యమంలో పనిచేస్తున్న కొంతమంది సరిహద్దులు దాటి యితర దేశాలకి వెళ్ళిపోయారు. నాగా ప్రజలపై అమలవుతున్న హింసాకాండ, దురాక్రమణను నిలిపేసేలా భారత ప్రభుత్వంపై వొత్తిడి తేవాలని వీరు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయత్నాల ఫలితంగా 1964 లో భారత ప్రభుత్వం యుద్ధ విరమణ ప్రకటించి, తాత్కాలికంగా 'నాగా ఫెడరేషన్ ప్రభుత్వా'న్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత జరిగిన సమావేశంలో చర్చల్లో ఒక అంగీకారం కుదరని ఫలితంగా, చర్చలు విఫలమయ్యాయి. నాగా ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుని గుర్తించ నిరాకరించటంతో, చర్చలు 1967 లో అర్థాంతరంగా ముగిసాయి. యథా ప్రకారం నాగాలాండ్‌పై పెద్దయెత్తున సైనిక చర్యలు అమలు జరిగాయి. 1972 లో

'నాగా ఫెడరల్ ప్రభుత్వ' గుర్తింపును భారత ప్రభుత్వం ఉపసంహరించుకొంది. పైగా నాగా జాతీయ సంఘాన్ని దేశం నుంచి బహిష్కరించి, ఆ సంఘ సభ్యులను నేరస్తులుగా ప్రకటించింది.

1975 లో భారత ప్రభుత్వ కుట్రతో కొంతమంది నాగా నాయకులు వంచించ బడ్డారు. వాళ్ళతో 'షిల్లాంగ్ ఒప్పందం'పై సంతకాలు చేయించింది. దీని ప్రకారం నాగా ప్రజలు భారత రాజ్యాంగ చట్టాన్ని గౌరవించి, లోబడి వుండాలి. తమ వద్ద వున్న ఆయుధాలని ప్రభుత్వానికి ఒప్పగించాలి. గొంతులపై తుపాకులు బారుచేసి, రాయించిన బలవంతపు ఒప్పందం కాబట్టే, యీ ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా, నాగా యువకులు పోరాట కార్యక్రమానికి ప్రాధాన్యత యిచ్చి, నాగా ప్రజాసైన్యంలో చేరిపోవటం ప్రారంభించారు. షిల్లాంగ్ ఒప్పందంపై సంతకాలు పెట్టిన తర్వాత చాలా మంది తిరిగి నాగా ప్రజా సైన్యంలో చేరారు.

[షిల్లాంగ్ ఒప్పందంపై సంతకాలు పెట్టిన ప్రముఖుల్లో బిసెటో ఖియో (Biseto Kheyo) ఒకరు. ఆయన నాగా అజ్ఞాత ప్రభుత్వంలో హోమ్ మంత్రి. ఒప్పందం తర్వాత భారత ప్రభుత్వ నిరంకుశ వైఖరికి విసిగి, ఆయనిలా అన్నారు– "శాంతి ఒప్పందంపై సంతకాలు మేము సదుద్దేశంతోనే చేశాం. శాంతి పునరుద్ధరణ ప్రయత్నంలో మా సర్వస్వం ఒడ్డాం. కాని పరిస్థితులు యిలాగే వుండేట్లయితే, మనం మోసగించ బడలేదని ప్రజలతో ఎలా చెప్పగలం?"]

నాగాలాండ్‌లో యివాళ లక్ష యాభై వేల మంది భారత కిరాయి సైన్యాలు వున్నాయి. ప్రతి రెండు మైళ్ళకి ఒక సైనిక స్థావరం ఏర్పాటయి వుంది.

భారత ప్రభుత్వానికి సాగిలపడిపోయిన చట్ట బద్ధ (?) కీలుబొమ్మ నాగా ప్రభుత్వం అనేక సార్లు హీనాతి హీనంగా అవమానించబడింది. ఈ ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని, మిలటరీ బలగాలు అనేక దారుణాలు జరుపుతున్నాయి.

నాగాలాండ్‌లో ప్రజలు జంతువుల స్థాయికి దిగ జార్చబడి వేటాడ బడు తున్నారు. వాళ్ళ కష్టాల గురించి గొంతెత్తి మాట్లాడ గల ఏ ఒక్క స్వచ్ఛంద సంస్థ యివాళ్ళ అక్కడ లేదు. కాబట్టి మానవ హక్కుల పట్ల సానుభూతి గల ప్రపంచ ప్రజలందరూ నాగా ప్రజల పోరాటానికి తమ సంఘీభావాన్ని, వాళ్ళ బాధలపట్ల సానుభూతిని వ్యక్తం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

(Violation of Human Rights in NAGALAND. Third World Unity పత్రిక ఆధారంగా)

ప్రిణబ్ ముఖర్జీతో సృజన ప్రత్యేక ఇంటర్వ్యూ

1970 నుంచి 78 వరకు నాగాలాండ్, పశ్చిమ బెంగాల్ జైళ్ళలో మగ్గి నాగాలను మిజోలను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని జైల్లో కూడా నిరాహారదీక్షలు నిర్వహించి జయప్రకాశ్ నారాయణ్ మొదలుకొని ఎందరికో రాసి తీవ్రపోరాటం చేసిన ప్రిణబ్ ముఖర్జీ విడుదలై జైల్లోవేసిన నాగా జైళ్ళ బెంగాల్ జైళ్ళ చిత్రాలు (పెయింటింగ్స్) ప్రదర్శించడానికి ఢిల్లీకి వచ్చినప్పుడు సృజనకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ. సృజన తరపున ఇంటర్వ్యూ చేసింది. సు. రా.

సృజన : మీతో పాటు నాగా ఖైదీలందరూ విడుదలయ్యారా?

ప్రిణబ్ ముఖర్జీ : లేదు. కొద్దిమంది మాత్రమే విడుదలయ్యారు. అసలు నాగా రాజకీయ ఖైదీల సమస్యతో వచ్చిన ఇబ్బంది ఏమిటంటే ఎంతమంది నిర్బంధితులయి వున్నారో ఎవరికీ తెలియదు. సమస్య స్వరూపం గురించి ఒక అవగాహనకు రావడం అసాధ్యం.

సృజన : నాగా అజ్ఞాత ఉద్యమకారులకి తెలిసేవుంటుంది కదా?

జవాబు : అది కూడా సాధ్యం కాదు. భారత ప్రభుత్వ సైన్యాలు ప్రజల్ని నిర్బంధించిన తరువాత దారుణమైన చిత్రహింసలకు గురిచేసి వదిలి పెడ్తారు. లేకపోతే హత్యచేస్తారు. తరువాత శవాల్ని తిరిగి ఇచ్చే సంప్రదాయం లేదు. అందుకని ఎవర్ని చంపారో ఎవర్ని కేసుల్లో ఇరికించారో తెలుసుకోవడం కష్టం. ఒకటి మాత్రం చెప్పవచ్చు. వందల మంది ఉండరు. అక్కడ కేసులు జైళ్ళ ద్వారా నిర్బంధాన్ని సాగించడం కంటె చిత్రహింసలు హత్యలు ఎక్కువ. గత ఇరవై ఏళ్ళలో సుమారు లక్ష మందికి పైగా నాగాలు ఈ ఉద్యమంలో ఇండియన్ మిలిటరీ చేతుల్లో మరణించారు.

ప్రశ్న : ప్రభుత్వం ప్రకటించలేదా?

జవాబు : లేదు. పైగా అందర్నీ విడివిడి జైళ్ళలో ఉంచారు. మిజోరామ్, మణిపూర్, అస్సాం కారాగారాల్లో అజ్ఞాతంగా ఎంత మంది నాగా రాజకీయ ఖైదీలున్నారో తెలియదు. నన్ను, మరికొంత మంది ఖైదీలను బెంగాల్ జైళ్ళలో ఉంచారు.

ప్రశ్న : 1975 షిల్లాంగ్ ఒడంబడిక తరువాత ఉద్యమం పూర్తిగా దెబ్బ తిన్నదట వాస్తమేనా?

జవాబు : షిల్లాంగ్ ఒడంబడిక తరువాత ఉద్యమం ఆటుపోట్లకు గురిఅయిందే కాని పూర్తిగా దెబ్బ తినడం ప్రసక్తే లేదు. గత 25 ఏళ్ళలో నాగా ప్రజలు ఇలాంటి ఆటుపోట్లను ఒడుదొడుకులను ఎన్నో చూసారు. ఇంకా చూస్తారు. వారిని ఒక్కసారి కలిస్తే మీకు అర్థం అవుతుంది. ఆఖరి నాగా బ్రతికున్నంత కాలం ఈ పోరాటం కొనసాగుతుంది.

ప్రశ్న: సైన్యాల నిర్బంధాన్ని ఎలా ఎదుర్కొంటున్నారు ?

జవాబు : మొదట్లో కొంత దెబ్బతిన్నా ఇప్పుడు ప్రజలు అలవాటుపడిపోయారు. మిలిటరీ తన నిర్బంధ రూపాన్ని మారుస్తుంటే ప్రజల పోరాట రూపాలు కూడా మారుతుంటాయి. అయిదున్నర లక్షల జనం గల దేశంలో ఒకటిన్నర లక్షల మిలిటరీ, పారామిలిటరీ బలాలు ఉంటె ప్రజలు మొత్తంగా పోరాటాన్ని తమ జీవితంలో భాగం చేసుకుంటారు,

ప్రశ్న: అక్కడ వర్గ అసమానతలు ఏ రూపంలో ఈ బలగాల్ని నిర్ణయిస్తున్నాయి ?

జవాబు : వర్గ అసమానతలు ఉన్నమాట వాస్తవమే. అక్కడ పొలం ప్రధానంగా రెండు రకాలు: 'జూమే ఖేతీ', 'పానీ ఖేతీ'— మొదటిది కొండలపై అడవుల్ని కొట్టి ఆ ప్రాంతాన్నంతా దున్ని సారవంతంచేయడం. రెండవది కొండదిగువ సాగు. ఎక్కువ ఫలవంతమైనది 'పానీ ఖేతీ'. ఎక్కువ ఎకరాలు 'పానీ ఖేతీ' ఉన్నవాళ్ళను ధనవంతులుగా పరిగణిస్తారు. అయితే ఈ పోరాటంలో మాత్రం ఆ తేడాలు లేవు. అంతేకాదు జన సామాన్యంలో అధిక సంఖ్యాకులు క్రైస్తవ మతస్థులున్నారు. ఈ మత విభేదాలు కూడా లేవు. ప్రధానంగా నాగాలాండ్ కోసం ప్రజలంతా కలిసే పోరాడుతున్న పోరాటం ఇది. ఒక్క విషయం మాత్రం గమనించాలె. అసమానతలు అంటే ఇండియాలో మన మెరిగినవి మాత్రం కావు. అక్కడ చాలా తక్కువ తేడాలు.

ప్రశ్న: విముక్తి ప్రాంతాలు ఎంత వరకు ఉన్నాయి ? ఎన్నాళ్ళుగా ఉన్నాయి ?

జవాబు : అసలు విముక్త ప్రాంతాలు అన్న భావన అక్కడ లేదు. అక్కడ సమాంతర ప్రభుత్వమే (Parallel Govt,) (Concept) నాగా ఫెడరల్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం. విముక్తి ప్రాంతం కాని ప్రాంతం లేదు. స్వాధీన ప్రాంతం కానిదీ లేదు.

ప్రశ్న: మరి మీరు చెప్పే భయంకరమైన నిర్బంధ పరిస్థితుల్లో నాగా గ్రామాలలో ప్రజా ప్రభుత్వం ఎలా పనిచేస్తుంది?

జవాబు: రహస్యంగా. ఉదాహరణకి ప్రజా కోర్టులు. ప్రజలు గ్రామాల్లో వచ్చిన తగువులకి తీర్పు కోరడానికి భారత సైన్యాల దగ్గరకు వెళ్ళరు. నెలకోసారి రహస్యంగా వచ్చే ఏడవ కమీషనరు కోసం వేచి తమ సమస్యలని ఆ కమీషనరు ముందుంచుతారు. కోర్టు ప్రజల దగ్గరకు వెళ్తుంది.

ప్రశ్న: మీరు ఇందాక నిర్బంధ బర్బరీ పద్ధతుల గురించి మాట్లాడారు. వివరిస్తారా?

జవాబు: ఉదాహరణకి వియత్నాం, ఇండో చైనాలలో లాగా గ్రామాలకి గ్రామాలను తరలించి వాటిని పునర్వ్యవస్థీకరించి (వీటిని Regroup చేసిన Strategic hamlets అంటారు) ప్రజల్నించి పోరాటకారులను వేరు చేసేందుకు ప్రయత్నించడం. వీటిని 'శాంతి గ్రామాలు' అనే పేరుతో భారత ప్రభుత్వం నడుపుతుంది. రెండోది చిత్రహింసలు. నాకు తెలిసిన ఒక సంఘటన వుంది. అజ్ఞాత నాగా సైన్యంతో సంబంధాలున్నాయని అనుమానం మీద గర్భవతి అయిన ఒక స్త్రీని సైన్యాలు విపరీతంగా చెరిచి ఆమె తల నరికి ఆ తలమీద ఆమె గర్భాన్ని చీల్చి బయటకు తీసిన పిండాన్ని పెట్టి ఆ గ్రామానికి బహుమతిగా ఇచ్చారు. ఆ రకమయిన పాశవిక నిర్బంధం ఇంకెక్కడా జరుగుతుందని నేననుకోను.... కనీసం అలా ఆశిస్తాను.

ప్రశ్న: నాగా సైన్యాలు ప్రజాయుద్ధ పంథాను అనుసరిస్తారా? గెరిల్లాలా?

జవాబు: అవి రెండూ అలా విడదీయగల రూపాలని నేను అనుకోవడం లేదు. ఏప్రిల్ 1966 తరువాత (శాంతి గ్రామాలు ఏర్పడ్డ తరువాత) ప్రధానంగా గెరిల్లా యుద్ధ తంత్రాన్నే అవలంబిస్తున్నారు.

ప్రశ్న: అక్కడి సాహిత్యం గురించి ఏమైనా చెప్తారా?

జవాబు: పెద్దగా చెప్పేందుకు ఏమీలేదు. అధిక సంఖ్యాకులైన ప్రజలకు చదవడం రాదు. పాటలు ఒక్కటే అక్కడ వర్ధిల్లే ఏకైక సాహిత్యరూపం. ఆ పాటలు మాత్రం వాళ్ళ జీవితం నుంచి పుట్టి పోరాటంతో పెనవేసుకొని పోయినవి. ప్రత్యేకమైన బాణీలు అంటూ ఏమీ ఉండవు. ఈ విముక్తి పోరాట పాటలు ప్రజా జీవితంలో సహజమైన అంతర్భాగం.

ప్రశ్న: అక్కడున్న మైదాన ప్రాంతాల వాళ్ళకి ప్రజలకి ఏలాంటి సంబంధాలున్నాయి?

ప్రణబ్ ముఖర్జీ - జైలు చిత్రాలు

ఢిల్లీ పి.యు.సి.ఎల్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు మూడురోజుల పాటు ప్రణబ్‌ముఖర్జీ జైలు చిత్రాల ప్రదర్శన ఢిల్లీలోని గాంధీ పీస్ ఫౌండేషన్ భవనంలో ఏర్పాటు చేసింది. ప్రణబ్ ముఖర్జీ కలకత్తాలో 36 సంవత్సరాల క్రితం పుట్టాడు. 1970 నుంచి 78 వరకు నాగాలాండ్ పశ్చిమ బెంగాల్ జైళ్ళలో రాజకీయ ఖైదీగా గడిపాడు. ఈకాలంలో వేసినవి ఈచిత్రాలు. నాగాలాండ్‌లో నాగా ప్రజలపై భారత సైనికుల ప్రభుత్వాధికారుల హింసాచర్యలు మాక్స్‌వెల్ లాంటి సుప్రసిద్ధ పత్రికా రచయితలు ధృవపరచి వున్నారు. జ్యోతిర్మయిజసు, నాగాలాండ్ నుంచి పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి రేనోషైజా పార్లమెంట్‌లోనే చెప్పివున్నారు. ఇవే దృశ్యాలు ప్రణబ్ చిత్రాలలో కన్పిస్తాయి. కానీ ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన మొదటి రోజునుంచే కేంద్ర పోలీసు శాఖ ఈ ప్రదర్శన జరుగడానికి వీలు లేని వత్తిళ్ళను, భయాలను కల్పించడం ప్రారంభించింది. సి.ఐ.డిలు ఈ ప్రదర్శన కొనసాగిస్తే తీవ్రమైన పరిణామాన్ని ఎదుర్కొన వలసి వుంటుందని ప్రణబ్‌ను బెదిరించారు. అంతేకాదు ఆయన ఢిల్లీలో వుంటే ఆయన ప్రాణాలకు కూడ ప్రమాదం వుందని హెచ్చరికలు పంపారు. ఈ ప్రదర్శన చూడడానికి వచ్చిన ఒకతను తనకు తాను సైన్యానికి చెందిన వాణ్ణని చెప్పుకొని ముఖర్జీని బూతులు తిట్టాడు. ఈ బెదిరింపుల కారణంగా ఈ ప్రదర్శన రెండో

జవాబు : అక్కడున్న మైదాన ప్రాంతాల వాళ్ళంతా భారతప్రభుత్వ సైన్యాలు, అడ్మినిస్ట్రేటర్స్, రెవెన్యూ అధికారులు మొదలయిన వాళ్ళు. కాకపోతే వ్యాపారస్తులు మాత్రం భయం వల్ల ఫెడరల్ ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తుంటారు. నాగా ప్రజలు మైదాన ప్రాంతాల వాళ్ళకి అనురిత్యం తగుల్తారు. కాని వారితో సంబంధాలు పెట్టుకోవడానికి నిరాకరిస్తారు. నన్ను కూడా మొదట అలాగే చూసినారు. మొదటిసారి సైన్యం నన్ను నిర్బంధించిన తరువాత నేను వాళ్ళ మనిషినన్న నమ్మకం వాళ్ళకు కుదిరింది. ఆ తరువాత వాళ్ళ ప్రేమాభిమానాలు అన్నిటినీ మించి స్నేహం కోసం ప్రాణం పెట్టగల మానవీయత నేను మర్చిపోలేని విలువైన అనుభవం.

ప్రశ్న : నాగా ఉద్యమం భవిష్యత్తుపై మీ అభిప్రాయమేమిటి ?

జవాబు : నాగా ప్రజల పోరాటాన్ని బర్మా, నాగా, మిజో, లావోస్, కాంబోడియా, వియత్నాం, చైనాప్రాంత(Belt)ప్రజాచైతన్యం ప్రాతిపదికగా చూడాలనుకుంటున్నాను.

ప్రశ్న : అసలు వేర్పాటు ఉద్యమం........

జవాబు : అది వేర్పాటు ఉద్యమం కాదు. భారత ప్రభుత్వ దురాక్రమణకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న జీవన్మరణ విముక్తి పోరాటం.

రోజుననే (సెప్టెంబర్ 1, 1978) ఎత్తివేసుకోక తప్పలేదు. ఢిల్లీ పి.యు.సి.ఎల్ భావ ప్రకటనా స్వేచ్ఛపై జరిగిన ఈ దౌర్జన్యాన్ని ఆనాడే ఖండించింది. జగిత్యాల, సిరిసిల్లల లాగే తెలుగు దేశంలోని శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం, తూర్పుగోదావరి జిల్లాల లోని "కల్లోలిత ప్రాంతాల" లాగే నాగాలాండ్, మిజోరామ్, మణిపూర్‌లు కూడా "కల్లోలిత ప్రాంతాలే". ఈమూడు ప్రాంతాల్లో కేంద్ర సైన్యాల క్యాంపులున్నాయి. సరి హద్దు రక్షకదళాల క్యాంపులున్నాయి. విస్తీర్ణత దృష్ట్యా ఈ మూడు ప్రాంతాల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని కల్లోలిత విస్తీర్ణం వస్తుంది. అంటే దేశంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, హరిజనులు, బలహీన వర్గాలు మామూలు పౌరులుగా జీవించే స్థితి ఈ స్వతంత్ర భారతదేశంలో లేదన్నమాట. కల్లోలిత తెలుగుదేశంలో జీవిస్తున్న మనం కల్లోలిత నాగా ప్రాంతం గురించి పరిణబ్ ముఖర్జీ చిత్రాలు వివ రించే దృశ్య భాష విందాం.

1. అస్సాం నుంచి ముందుకుచూస్తే నాగాలాండ్ కన్పిస్తుంది. మబ్బుల్లో పొగ మంచు కప్పుకొని ఒక స్వప్నంలాగా అర్థంకాకుండా ఎంతో శాంతిగా నిరామయంగా వున్నట్లు. కాని అక్కడ ప్రతి గుండె అవమానపు నెత్తుటితో జ్వలిస్తుంది. ద్వేషమూ నిరసన పొంగి వస్తాయి. స్మశాన శాంతినీ, నిరామయాన్ని అక్కడ స్థాపించడానికి ఫలించని ప్రయత్నాలు అప్పుడప్పుడూ అక్కడ జరుగుతునే వున్నాయి.

2. బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలో కాప్టన్ జెంకిన్స్ గద్ద కళ్ళు నాగాలాండ్ మీద పడ్డాయి. ఇక్కడి బొగ్గుగనులను ఉపయోగించుకొని బర్మాను చేతుల్లో పెట్టు కోవాలనుకున్నాడు. నాగాలాండ్ కాళ్ళూచేతులూ విరిచాడు. ఆరోజుల్లోనే కొత్తరోడ్లు, ఉక్కువంతెనలు నిర్మించబడ్డాయి. అప్పటినుంచి విదేశ వాహనాలు అటూఇటూ తిరుగుతూనేవున్నాయి. ఆ పరిస్థితే ఇప్పటికీ వుంది.

3. నేను నాగాలాండ్‌లో ఒకస్త్రీని కలిసాను. మాకు ఒకరి భాష ఒకరికి రాదు- ఇద్దరికీ అర్థమయ్యే భాష ఒకటి లేదు. కానీ అది మా స్నేహానికి ప్రతిబంధకం కాలేదు. ఆమే నా మూగ నెచ్చెలి.

4. చాలాకాలం కిందటి సంఘటన. ఒకతెగ ఇంకొక తెగతో యుద్ధం చేసింది. వాళ్ళు ఈయుద్ధ నృత్యం చేసారు. ఇప్పటి నాగాలాండ్ దృశ్యంవేరు. ఇపుడు వాళ్ళంతా కలసి ఇదే నృత్యం చేస్తున్నారు. తమందరికీ శత్రువయిన వాడికి వ్యతిరేకంగా దృఢంగా నిలువాలని వాళ్ళు ప్రతిజ్ఞ తీసుకుంటున్నారు.

5. చాలా ఎత్తైన ప్రదేశాలమీద విలాసవస్తువుల పెద్దపెద్ద ప్రదర్శనలు, మత్తు పానీయాలు, ఖరీదయిన తిండి వగైరా, వాటికిందనే నివాసం. తమ శరీరాలను కప్పు

కోడానికి చిన్న బట్టపేలికలు కూడా లేనివాళ్ళు, శోష నిలుపుకోడానికైనా నాలుగు మెతుకులు లేనివాళ్ళు, ఎండిపోయిన రొమ్ముల్లోంచి తాగడానికి పాలుకాదుకదా పీల్చే నోట్లోకి నెత్తురు కూడ రాని తల్లులూ వాళ్ళ పిల్లలూ.

6. నాగాలాండ్‌లో చాలా కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపులు వున్నాయని చెప్పడం కేవలం పాక్షిక సత్యం. ఎందుకంటే మొత్తం నాగాలాండే ఒకపెద్ద కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపు. మిలటరీబూట్లు, రైఫిళ్ళు తాకని శరీరంలేదు. ఆ బూట్లకింద అణగారిన మానవుల రుధిరప్రవాహాలు నాగాలదేశం నిండా ప్రవహిస్తున్నాయి. ఎవరికీ తనదంటూ చోటులేదు. ప్రతివాడు చెదరిపోయాడు. సాంకేతికవిజ్ఞాన నాగరికతను కొల్లగొట్టి లాభ సాటి దేరగాళ్ళ పళ్ళకింద స్వచ్ఛమైన, అందమైన పువ్వులవంటి మానవజీవితాలు నలిగిపోతున్నవి. అయినా బలహీనంగానైనా ఆశా కాంతివైపు చేతులు లేస్తున్నవి. గాఢమైన అంధకార ఆకాశంలోంచి నూతన ప్రభాతం హాపీ ఉదయిస్తున్నది.

7. భారత సైనికులు నాగా గ్రామంలో ప్రవేశిస్తారు. స్త్రీలను, పురుషులను, పిల్లలను బయటి కీడుస్తారు. బట్టలొలిచి నగ్నంగా సూర్యునికి మొఖంచేసి పొద్దటి నుంచి రాత్రిదాకా నిలబెడ్తారు. కొంచెం కదలినా సరే భరించలేని హింసలకు గురి చేస్తారు. ఏ స్త్రీ కూడ మానభంగం కాకుండా తప్పించుకోజాలదు. వీటన్నిటితో పాటు తిట్లు, బూతులు, జుగుప్సాకరమైన అవహేళనలు. ఇలాంటి సంఘటనలూ, సందర్భాలు నాగాలాండ్, మణిపూర్, మిజోరామ్‌లలో సర్వసాధారణం.

8. గ్రీకు పురాణాల్లోని లావోకూన్‌లాగా ప్రతిదాన్ని పాముల్లాంటి వెంట్రుకలు చుట్టివేస్తాయి. భావ వ్యక్తీకరణకు, స్వేచ్ఛగా కదలడానికీ, పనిచేయడానికీ అక్కడ హక్కులు లేవు. అక్కడ సౌందర్యం నిషేధించబడింది. కానీ ఆకాశమంత స్వేచ్ఛా యుతమైన మానవ మేధస్సుమీద ఏ చట్టం పనిచేస్తుంది? ఇదిగో ఇక్కడి నుంచి స్వేచ్ఛ వస్తుంది.

9. నాగా విప్లవకారుణ్ణి పట్టుకోవడం సాధ్యంకాక భారత సైనికులు అతని తండ్రిని పట్టుకొని చెట్టుకు కట్టివేశారు. అతని చెల్లెల్ని ప్రాణాలు పోయేదాక చెరిచారు. బయనెటుకు కుచ్చి ఆ మృత దేహాన్ని నేలమీద పడవేశారు. నాగాలాండ్ నేల మీద ఈ సైతాన్ల నెత్తుటి పాద ముద్రలు. ప్రతి నాగా మనస్సుపై ఎంతో లోతుగా ఈ అవమా నాల, హింసల చెరగని ముద్రలు.

10. వియత్నాంలో అమెరికా దౌర్జన్యం కాదు. నాగాలపై, మిజోలపై భారత ప్రభుత్వం, గాంధీ సిద్ధాంతాలను వల్లిస్తున్న భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న

"మాకీ స్వాతంత్ర్యం వద్దు"

లుయింగమ్ లుయితీ నాగా
(జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ)

1977 ఆగస్టు 20, 21 తేదీల్లో ఢిల్లీలో జరిగిన రాజకీయ ఖైదీల పౌరహక్కుల సదస్సులో నాగా మిజో రాజకీయ ఖయిదీల, పౌరహక్కుల సమస్యపై లుయింగమ్ లుయితీ నాగా యిలా మాట్లాడాడు.

"ఈ సదస్సులో మీ మధ్యన వున్నందుకు నాగా, మిజో ప్రాంతాల నుంచి వచ్చిన నేను, నా మిత్రులు చాలా ఆనందంగా వున్నాం. మేమిక్కడ స్వేచ్ఛగా

హింస, దౌర్జన్యాలన్నీ ఒకలాగే కన్పిస్తాయి. ప్రతి హింసా సంఘటన నుంచి ఒక అరుణ విరి వికసిస్తుంది. కాన్సెంట్రేషన్ క్యాంపుల ఇనుప ముళ్ళ తీగలపై ఎన్నో ప్రాణాలు బలిఅయిపోయాయి. అయినా అదే తీగలపై ఒక పక్షి కూర్చుని స్వాతంత్రోదయం కోసం నిరీక్షిస్తున్నది.

11. గాంధీ అహింసావాదాన్ని పల్లించే వాళ్ళు శాంతిని ఎలా అమలు చేస్తున్నారో చూడండి— గర్భవతి అయిన ఒక నాగాస్త్రీ భర్త పనిచేస్తున్న పొలం దగ్గరకు వచ్చింది. విశ్రాంతి తీసుకుంటున్నది. ఇంటి దగ్గర ఆమె ఇద్దరు పిల్లలు ఆమె తిరిగి వస్తుందని ఎదురుచూస్తున్నారు. ఆమె కళ్ళల్లో పుట్టబోయే శిశువు కలలు. అకస్మాత్తుగా నిష్కారణంగా పర్వతాలమీదవున్న సరిహద్దు రక్షక దళాల క్యాంపు నుంచి బుల్లెట్ల వర్షం. కొందరు పరిగెత్తిపోయారు. పరుగెత్తలేనివాళ్ళు చచ్చిపోయారు. ఈ గర్భిణీ స్త్రీ భర్త వారిలో ఒకడు. ఆమె తొడల్లో కూడా తూటా. తెల్లవారి గ్రామస్థులు వచ్చి చూస్తే ఆమె శరీరం నుంచి వేరయ్యి ఆమె తల. ఆమె చెరచబడి చనిపోయిందని స్పష్టంగా ఆమె శరీరం చెప్తున్నది. ఆమె నేదో జంతువు తిన్నది. ఆమె గర్భం చీల్చబడ్డది. వేరు చేయబడిన నోటిదగ్గర ఆమె గర్భస్థ పిండం. నాగాలాండ్ చుట్టూ ఏదో పెద్దసర్పం చుట్టుకున్నట్లున్నది. పాము పడగలు సైన్యాధికారుల తలలు ఒకేలాగున్నాయి.

12. వేదన నుంచి, బాధల నుంచి, దుఃఖం నుంచి విముక్తి సాధ్యమే. కానీ అన్ని సంకెళ్ళనూ తెంచుకున్నపుడు మాత్రమే.

"సామాన్య మానవుని జీవించే హక్కును నిరాకరించే వారికి వ్యతిరేకంగా ప్రకృతి సిద్ధమైన సహజమైన భావవ్యక్తీకరణ మార్గాలకు అడ్డుపడే వాళ్ళకు వ్యతిరేకంగా ఈ చైతన్యం పిడుగులా గర్జించనీ."

తిరుగ గలుగుతున్నాం- మాట్లాడ గలుగుతున్నాం. మేము మిలిటరీ అధికారుల అప్రకటిత జెయిళ్ళు తప్ప మరేమీ కాని ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్ళం.

నేను 1951 లో పుట్టాను. కాని నా పుట్టిన దేశంలో నేను స్వాతంత్ర్యం చూడలేదు. నాకు తెలిసిన స్వాతంత్ర్యం ఒక్కటే- మిలిటరీ అధికారులకు శిరసా వహించడం, లొంగి వుండడం. కాని మాలో ఎవ్వరూ యిలాంటి స్వాతంత్ర్యాన్ని ప్రేమించజాలరు. మేమీ స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా ద్వేషిస్తాం. ఎందుకంటే ఈ స్వాతంత్ర్యానికి- అవమానింప బడడానికి, హింసింపబడడానికి, బహిరంగ, ఏకాంత ప్రదేశాల్లో చెరచబడడానికి, ఉరితీయ బడడానికి స్వాతంత్ర్యం అని అర్థం.

చాలా తరచుగా మా ఇళ్ళకు మిలిటరీ వెతకడానికి వస్తుంది. స్త్రీలను అవమాన పరుస్తుంది, చెరుస్తుంది. ప్రజలందరినీ బహిరంగ ప్రాంతాల్లో మందలుగా పెట్టి మా పెద్దలను మాముందే అవమానపరచి హింసిస్తుంది. గ్రామాలు, ధాన్యంరాసులు ఎన్నోసార్లు తగులబెట్టబడ్డాయి. ప్రజలను పంటలు కోసుకోనివ్వలేదు. వాళ్ళను కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో మందలుగా పెట్టారు. అక్కడ వాళ్ళ నిత్యావసరాలు ఉత్పత్తి చేసుకోడానికి వీలుకాదు. అక్కడ మిలిటరీ అధికారులు యిచ్చే కొంచెం పిండి, బియ్యం మీదనే వాళ్ళు జీవించాలి. "చూడండి మిమ్మలను మీరు పోషించుకోను కూడా లేరు- మేము దయతో చేసే దానాల మీదనే మీరు బతుకుతున్నారు-" అని మిలిటరీ అధికారులు హేళన చేస్తారు. ఇట్లా తమ జీవితంకోసం తాము కష్టపడకుండా కూడా నిరోధిస్తున్నారు మిలిటరీ అధికారులు.

ఈ క్రూర చర్యలకు ఏమాత్రం ఎదురు తిరిగినా శిక్ష పాశవికంగా వుంటుంది. ఈ విపరీతమైన అమానుష చర్యలవల్ల ఎంతోమంది మా మిత్రులు, పెద్దలు తమ హక్కులను కాపాడుకోవడానికి ఏ సాధనం వీలయితే ఆ సాధనమే వాడుకుంటున్నారు. మేం తీవ్రమైన భీతావహంతో జీవిస్తున్నాం. ఎప్పుడయినా ఓ పాప ఏడిస్తేనో, తల్లి చెప్పినట్టు వినకపోతేనో తల్లి మిలిటరీని పిలుస్తానంటుంది- వెంటనే పాప ఏడుపు మానేస్తుంది- తల్లి చెప్పినట్టు వింటుంది. స్వేచ్ఛగా నడవడానికి, మాట్లాడడానికి, బతకడానికి, మా వందలాది మిత్రులు విదేశాలకు వెళ్లారు- వెళ్తున్నారు కాని వాళ్ళెంతో విలువగా చూసుకునే స్వాతంత్ర్యాన్ని పొందక ముందే వాళ్ళు చంపబడుతున్నారు. ఇక్కడున్న మేం కూడా ఎన్నో బెదిరింపులకు లోనవుతున్నాం. మామీద ఎన్నో తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇది మాకెంతో భయంకరమైన అనుభవంగా వుంది. ఆ సంక్షుభిత ప్రాంతం నుండి ఎంతో దూరంగా వున్నప్పటికీ మాకిక్కడ మనశ్శాంతి

లేదు. ఇంటి దగ్గరవున్న మా తల్లిదండ్రులను, స్నేహితులను మేం కలువగలమో లేదో తెలియదు. నిద్రలు లేని రాత్రులను వేగిస్తున్నాము. ఈ బాధాకరమైన ఉనికిని, మర్చిపోవడానికి మేం నవ్వడానికి ప్రయత్నిస్తున్నాము. కాని ఆ నవ్వు వెనక మేం అణచుకోదల్చుకున్న బాధ తోసుకుని ముందుకు వస్తున్నది.

ఎంతో తీవ్రమయిన ఆవేదనలతో మన నేలపై ఎంతో మహత్తరమైన భారత ప్రజల నిరసన లేకుండా ఈ విషయాలెట్లా ఇలా జరుగుతున్నాయా అని మేం ఆశ్చర్య పోతున్నాం. ఇక్కడే పాలక వర్గాల ప్రచార యంత్రాంగం ఎంత శక్తివంతమైందో దానికి అర్థమేమిటో మాకర్థం అవుతున్నది. పత్రికలు ఇతర ప్రచార సాధనాలు ఉద్దేశపూర్వకంగానే నాగాలను మిజోలను నరమాంసం తినే ఆటవికులుగా చిత్రించి పెట్టాయి. వాళ్ళకు మానవ విలువలు తెలియవని కాబట్టి వాళ్ళను జంతువుల్లాగానే హింసించాలని ప్రచారం చేసారు. మా ప్రజల మీద దారుణ హింసాకాండను కొన సాగిస్తూ పాలకవర్గాలు భారత ప్రజలకు దీనికి సంబంధించిన పూర్తి తప్పుడు చిత్రాన్ని ఇస్తూ తమతో ఉంచుకుంటున్నారు. ఈ నేరాత్మక విధానాన్ని చాలా పథకం ప్రకారం క్రమం తప్పకుండా అనుసరిస్తున్నారు. కాని పందొమ్మిది నెలల ఎమర్జన్సీ తరువాత దేశ వ్యాప్తంగా కూడా ప్రజలందరి మీద చెప్పనలవికాని దౌర్జన్యాలు జరిగిన తరువాత తమలాగే మిజో నాగా ప్రజలు కూడా ఇన్నాళ్ళుగా ఎన్నిబాధలు అనుభవించి ఉంటారో దేశప్రజలు అర్థం చేసుకుంటున్నారు. స్వాతంత్ర్యంకొరకు మేం చేస్తున్న పోరాటంలో మేము ఇవ్వాళ ఒంటరివాళ్ళం కాము. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే భారత ప్రజల స్నేహభావాన్ని మేమెంతో విలువయిందిగా మా హృదయాల్లో పదిలపరచుకుంటాం.

ఈ నాటికీ 23 గ్రామాల్లో కర్ఫ్యూ ఉంది. ఉక్రుల్ జిల్లాలో 14 గ్రామాల్లో 'పాస్' విధానం ఉన్నది. "పాస్" అంటే గ్రామస్తులు సమీపంలోని అడవుల్లోకి కాలకృత్యాలను తీర్చుకోవడానికి వెళ్ళాలన్నా, వ్యవసాయపు పనులకు వెళ్ళాలన్నా మిలిటరీ అధికారుల దగ్గర నుంచి పాస్ తీసుకోవలసి ఉంటుంది. కాబట్టి ఇది గంట గంటకూ తల ఎత్తే సమస్యే. పాస్ ఇవ్వవలసిన మిలిటరీ అధికారులు బెట్టు చేయ వచ్చు. కోపించవచ్చు. కష్టపెట్టవచ్చు. కనుక వాళ్ళను ప్రసన్నులను చేసుకోవాలంటే వాళ్ళకు కోళ్ళను, కోడిగుడ్లను సమర్పించుకోవాల్సి వుంటుంది.

మత సంస్థలు, మత కార్య కలాపాలు కూడా వీళ్ళ ఉక్కు పిడికిలి నుంచి తప్పించుకోలేదు. సైన్యాలు ప్రజలందరినీ చర్చిలో పడవేసి, అవమాన పరచి హింసించి స్త్రీలను చెరచి, చర్చి పవిత్రతను అవహేళన చేసారు. ఈ సంవత్సరం

నడుస్తున్న చరిత్ర పుటల్లోంచి....

అలీఘడ్ అల్లర్లు - కొన్ని వాస్తవాలు

మళ్ళీ మతోన్మాదం పడగ విప్పింది- మెలికలు తిరిగిన మతభుజంగం కసరి బుసకొట్టింది. నేలతల్లి గుండెమీద విషపుకాట్లు- జనసామాన్యం జీవితాల్లో కల్లోలం- మతోన్మాదం రక్తదాహం- బరితెగించిన నగ్న తాండవం- హత్యలు, లూటీలు, మానభంగాలు.

అది అక్టోబర్ 5. అలీఘడ్ మళ్ళీ మత కలహం మంటల్లో- వీధులు రక్త పంకిలం- పీనుగు పెంట- కాళ్ళకూ కళ్ళకూ తగిలే శవాలు- మనసుకు కోతపెట్టే, గుండెను పిండి ప్రశ్నించే కాలిపోయిన కళ్ళూ, మసై బూడిదై ఆరిపోయిన ప్రాణాలు- ఇది మతం. ఈ శవాలమీద శ్మశానాలమీద మతం డ్రిల్లు చేస్తుంది- గుండాయిజం ఊరేగుతుంది- "ఖూన్ కా బద్‌లా ఖూన్ సే లేంగే" (రక్తానికి రక్తం) "ఏక్ కె బద్‌లే దస్" (ఒకరికి బదులు పది మందిని చంపుతాం) నినాదాలతో మతం వేయి పడగలు విప్పింది- తరతరాల చరిత్రలో మతం పేరిట మారణహోమం.

అలీఘడ్ మానక్‌చౌక్‌లో 240 నెం. ఇల్లు- అక్కడ ఒక చెట్టు కొమ్మకి ఉరితాడు వేలాడుతోంది- ఒక రిక్షావాణ్ణి అక్కడ ఉరితీశారు. హంతకుల కసి తీర

ఉక్రుల్ జిల్లాలోని వార్షిక క్రైస్తవ సమావేశాలు నిషేధింపబడ్డాయి. ఈ విధంగా మిలిటరీ అధికారుల అప్రకటిత క్యాంపు జైళ్ళలో మా ప్రజలు బందీలై ఉన్నారు.

నాగా మిజో రాజకీయ ఖైదీలకు సంబంధించిన వరకు అసంఖ్యాకమైన ఖైదీలున్నారని మాత్రమే చెప్పగలం. వాళ్ళ సంఖ్య నాకు తెలియదు. మాకు తెలుసుకోవడానికి అవకాశాలు లేవు. మా పొరుగున ఉన్న అన్నలను, అక్కలను మిలిటరీ అధికారులు ఏం చేస్తున్నారో తెలుసుకునే అవకాశం మాకు లేదు.

ఇది చాలా క్లుప్తంగా ఈ నాడు మేం జీవిస్తున్న పరిస్థితి. ఇవ్వాళ దేశమంతా రాజకీయ ఖైదీల విడుదల గురించి మాట్లాడుతూ వుంటే నా మనస్సులో వున్నమాట ఎలా చెప్పాలో నాకు అర్థం కావడంలేదు. కాని ఈ మాటే నేను మొదటి సారిగా చాలా స్వేచ్ఛగాను ఎవరిచేత నిరోధించ బడకుండాను ఉన్నట్లు భావించడానికి నాకు బలాన్ని ఇస్తుంది. నాగా, మిజో ప్రజలందరి తరపున భారత ప్రజలందరికి మేం చేసే విజ్ఞప్తి ఒక్కటే. రాజకీయ ఖైదీల విడుదల గురించి మీరు ఆలోచించినప్పుడు గాని, ఉద్యమించినప్పుడు గాని నాగా మిజో ఖైదీల గురించి కూడా ఆలోచించండి. ఉద్యమించండి. 'ఎందుకంటే ఇవ్వాళ వాళ్ళు మొత్తంగా మిలిటరీ అధికారుల అప్రకటిత జైలు క్యాంపుల్లో మగ్గుతున్నారు'. "

లేదు— వేలాదే అతని శరీరంలో కత్తిపోట్లు పొడిచారు— తరువాత శవాన్ని కిందికి లాగి ఎదురుగా ఒక తోపుడు బండిమీద వేసి తగులబెట్టారు. జనం భయభ్రాంతమై చూస్తూండగా నడివీధిలో పగటి వెలుగులో జరిగిన దారుణమైన హత్య ఇది. ఆ రిక్షా వాడు చేసిన నేరం అతడు ముస్లిం కావడమే. హంతకులు హిందూ మతోన్మాదులు. రిక్షావాడు నిజానికి అక్కడివాడు కాడు. బోద్‌పూర్ దగ్గర షోరాబాద్ నివాసి. మొదటి ఆట ప్రేక్షకుల చేరవేసి నాలుగు డబ్బులు సంపాదించుకొని వస్తానని తండ్రితో చెప్పి పొద్దుండగానే రిక్షాబండితో లక్ష్మి సినిమా హాలువైపు బయలుదేరాడు. అంతే అతడు యింటికి తిరిగి వెళ్ళలేదు— మత విద్వేషపు మంటల్లో కాలి బూడిదై పోయాడు.

అదే మానక్‌చౌక్ ఇంటి నెం. 504, పండ్లు అమ్ముకునే యిద్దరు ముస్లింలు 35 ఏళ్ళ లియాఖత్, 43 ఏళ్ళ ముఖ్తయార్. ఇద్దరిని 5 అడుగుల బల్లెంతో పొడిచి చంపారు— అందులో ఒకరిని రెండు ముక్కలుగా నరికి మంటల్లో విసిరేశారు— హంతకులు హిందూమత దురహంకారులు. హతులు చేసిన పాపం— వారు ముస్లింలు కావడమే. ఈ హత్యలను కళ్ళారా చూసిన అక్కడి స్త్రీలు ఆషాక్‌నుండి రెండు వారాలదాకా తేరుకోలేదు.

అదేవీధి— ఇంటి నెం. 245, 246 సులేమాన్, ఆరిఫ్‌అనే యిద్దరు ముస్లింలను, మరో కొత్తగా పెళ్ళైన 19 ఏళ్ళ ఒక యువకుణ్ణి హత్యచేశారు. అన్వర్ అనే 22 ఏళ్ళ మరో ముస్లిం యువకుని తల్లిని పొడిచి మంచానికి కట్టి తగులబెట్టారు.

సర్వరీబేగం అనే స్త్రీ హజ్ యాత్రకని దాచుకొన్న 2000 రూ. దోచుకొని ఆమె యింటిని తగులబెట్టారు— మానక్‌చౌక్‌లో ఒకవైపు గృహదహనాలు, లూటీలు జరుగుతుంటే వీరికి మద్దతుగా చుట్టూవున్న ఎత్తైన హిందూ భవనాల మీది నుండి పెట్రోలు కుమ్మరించారు— మంటల్లో సర్వం ధ్వంసమైపోయింది.

అలీఘడ్‌లో భయభ్రాంతులైన ప్రజలేకాదు— అక్కడ అనేక ముస్లిం వాడలూ, యిళ్ళూ, వాకిళ్ళూ నెత్తురు మరకలతో, విధ్వంసపు గుర్తులతో మత విద్వేషపు కథల్ని, అవమానపు గాథల్ని అక్కడి వాస్తవాలను కనుక్కోడానికి ఢిల్లీ పౌరహక్కుల సంఘం (పి.యు.సి.యల్) పక్షాన వెళ్ళిన కమిటీ సభ్యులకు వినిపించాయి.

ఒక్క మానక్‌చౌక్‌లోనే 12 మంది హతులైనారు. (కాని ప్రభుత్వం ప్రకటన మొత్తం అలీఘడ్‌లోనే 12 మంది చనిపోయారని.)

అక్టోబర్ 5, సుమారు సా॥ 3-45 నుండి రాత్రి 9 దాకా ఐదు గంటలపాటు దారుణ హింసాకాండ జరుగుతూంటే నిస్సహాయులైన ముస్లిం ప్రజలు ఎన్నిమారులు

సమీప పోలీసు స్టేషన్లకు విజ్ఞప్తులు చేసుకొన్నా వారి మొర ఎవ్వరూ ఆలకించలేదు– ఏ సహాయమూ అందలేదు. పైగా హిందూ మతోన్మాదులకుతోడు రాష్ట్రీయ సాయుధ పోలీసు దళాలు (పి. ఏ. సి.) విచక్షణారహితంగా ముస్లిం గృహాలమీద, మసీదులమీద కాల్పులు జరుపుతూ పోయాయి.

హత్యాకాండ ప్రారంభమైన కొన్ని గంటల తరువాత కర్ఫ్యూ విధింపబడింది– కాని కర్ఫ్యూ ముసుగులోనూ హత్యాకాండ, ముస్లిం యిళ్ళ దోపిడీ విచ్చల విడిగా కొనసాగినై.

ఈ హత్యాకాండను ప్రోత్సహించిన ముఖ్యులలో అలీఘడ్ పట్టణ జనతాపార్టీ అధ్యక్షుడు శ్రీ కృష్ణకుమార్ నవమన్ కూడా ఒకడని పలువురు సాక్షాధారాలతో నమ్ముతున్నారు. ఇతడు ప్రముఖ ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త, పూర్వపు జనసంఘ్ నాయకుడు కూడా– ఇతని కుమారుడు సత్యా, చేతిలో తుపాకితో కొందరు అనుచరులను వెంటేసుకొని విధ్వంసకులకు సూచనలిస్తుండగా అనేకులు చూశారు– చూసిన వారు ఎన్ని ఫిర్యాదులు చేసినా అతణ్ణీ అతని అనుచరులనూ పోలీసులు నిర్బంధించలేదు. ఈ మారణ హోమానికి వెంటనే పైకి కనిపించే కారణం అక్టోబర్ 3న సురేశ్ ఘారా అనే ఒక హిందూ ముఠా వస్తాదును అతని ప్రత్యర్థి ముఠావాళ్ళు ఒక సినిమా హాలుముందు పొడవడమూ తరువాత అతడు అక్టోబర్ 5న హాస్పిటల్‌లో చనిపోవడమూ– ఘారా చనిపోతూ యిచ్చిన వాఙ్మూలంలో తనను పొడిచిన ఐదుగురిలోనూ ముగ్గురి పేర్లు చెప్పాడు– ఆ ముగ్గురూ ముస్లింలే.

కొంత కాలంగా ముస్లిం వర్గాలతో కయ్యానికి దిగాలని పొంచి వున్న హిందూ మతోన్మాదులకు యీ సంఘటన మంచి సాకుగా దొరికింది–

ఘారా చనిపోయినట్టు ప్రకటించగానే అంతకు ముందే బయట గుమి గూడిన అతని అనుచరులు హాస్పిటల్‌లో చొరబడి బలవంతంగా అతని శవాన్ని లాక్కుపోయారు. ముఠా కొట్లాటల కారణంగా చనిపోయిన వారి శవాలను సాధారణంగా పోస్టుమార్టమ్ తరువాతగాని బయటికి అనుమతించరు. మరి ఎస్.పి. తో సహా హాస్పిటల్ వద్ద వున్న అధికారులు, సాయుధ పోలీసులు శవాన్ని లాక్కుపోకుండా ఆపకపోగా పట్టణ ముఖ్యవీధుల్లో ఊరేగించనివ్వడం ఆశ్చర్యం. అంతే కాదు మతోన్మాదులు అమాయక ప్రజల్లో మతోద్రేకం, హింసాకాండ చెలరేపే కుటిల బుద్ధితో ఊరేగింపు జరుపుతుంటే పోలీసులు మౌనంగా వారి వెంట నడుస్తూ పోయారు.

శవాన్ని భూరా యింటి వైపుకాని, శ్మశానం వైపుగాని కాకుండా జనసమ్మర్థం గల వ్యాపార కేంద్రాల నుండి, మత కలహాలు భగ్గున రగుల్కొడానికి అవకాశమున్న వీధులగుండా, కవ్వింపు చర్యగా ముస్లింలు అధికంగా నివసించే ఊపర్‌కోట్ వైపు "రక్తానికి రక్తం- ఒకరికి బదులు పది మందిని చంపుతాం" అనే ఉద్రేక పూరిత నినాదాలతో వెళ్ళారు- అంతకు ముందే హాస్పిటల్ ఆవరణలోనే భూరా మద్దతుదార్లు కొందరు ముస్లింలను పోలీసు అధికార్ల ముందే కొట్టారు- శవ ఊరేగింపు జరుగుతుండగా దారి పొడుగునా ముస్లిం దుకాణాలను దోచుకోవడం, కనబడ్డ ముస్లింనెల్లా కొట్టడం ఎప్పుడో ప్రారంభమైంది- ఇలా ఊరేగింపు ఊపర్‌కోట్ చేరగానే అక్కడ కొందరు ముస్లింలు ప్రతి నినాదాలు చేశారని యిళ్ళపై నుండి రాళ్ళు విసిరారని చెప్పుతున్నారు- అంతే యిక ఆ ప్రాంతమంతా భగ్గున మండింది- లూటీలూ, దహనాలూ హత్యలూ మాన భంగాలూ- మతం కరాళ నృత్యం చేసింది- అంతా రక్తసిక్తం- శ్మశానం- బూడిద- ఈ అరాచకం, కల్లోలం అగ్నిలా చుట్టుపట్ల అనేక ప్రాంతాలకు వ్యాపించింది.

నిజానికి మరణించిన భూరా పేరుమోసిన గుండా- ఎమర్జెన్సీ కాలంలో అతడు ఇందిరా కాంగ్రెసుతో వుండి తన గుండా అనుచరులతో పట్ట పగ్గాలు లేకుండా అలీఘడ్‌లో భీతావహాన్ని సృష్టించాడు- ఎమర్జెన్సీ తరువాత ప్రభుత్వం మారడంతో వెంటనే అతడు జనతా వైపు ప్లేటు ఫిరాయించాడు- ఇతని మరణంతో పీడ విరగడైనట్టు హిందూ, ముస్లిం ఉభయ వర్గాల వారూ భావించారు.

భూరా ముఠాకూ, ప్రత్యర్థి ముఠాకూ చాలా కాలంగా వస్తున్న తగాదాలే అతని హత్యకు కారణమని స్థానికులందరికీ తెలుసు- రెండు ముఠాల్లోనూ హిందూమహ్మదీయ గుండాలు కలిసివున్నారు.

గత సెప్టెంబర్ 12న జరిగిన ఒక కుస్తీ పోటీలో రెండుముఠాలకు చెందిన వస్తాదుల మధ్య పేచీ వచ్చింది. భూరా ఒక ముస్లిం వస్తాదుమీద చేయిచేసుకోవడంతో యిరు పక్షాల్లో పగలూ పట్టింపులూ పెరిగి దరిమిలా సమయం చిక్కినప్పుడెల్లా ఒకరినొకరు కొట్టుకోవడం పొడుచుకోవడం జరుగుతూ వచ్చింది- చివరికి అక్టోబర్ 3న భూరాను పొడిచిన సంఘటనతో ఏదో ఒక సాకుకోసం పొంచివున్న మతవిద్వేషం కట్టలు తెంచుకొంది.

భూరా శవాన్ని హాస్పిటల్ నుండి బలవంతంగా లాక్కుపోయిన వారిలో అధిక సంఖ్యాకులు ఆర్.ఎస్.ఎస్, పూర్వ జనసంఘ్‌కు సంబంధించిన వారున్నారు- వీరిని

అంతకు క్రితం గొడవల్లో పోలీసులు నిర్బంధిస్తే అలీఘడ్ జనతా పార్టీ అధ్యక్షుడు కృష్ణకుమార్ నవమన్ రాజకీయ వత్తిడితెచ్చి ఘెరావ్‌లు చేయించి విడిపించుకున్నాడు.

ముస్లిం అల్ప సంఖ్యాకులపై యీ హత్యాకాండకు కారణం భూరా హత్యకానీ, మతా తగాదాలు కానీ కావు– భూరా హత్య కేవలం ఒక సాకు మాత్రమే– హిందూ మతోన్మాదులు ఈ హత్యలూ, లూటీలూ, దహనాలూ ఒక పథకం ప్రకారం జరిపించారు.

కొంత కాలంగా అలీఘడ్‌లో కొన్ని సమస్యలపై మతోద్రేకాలు పెరుగుతూ వచ్చాయి– అందులో ప్రధానమైనది అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ మైనారిటీ ప్రతిపత్తిని కాపాడేందుకు ఉద్దేశించిన బిల్లు. గత జూన్ నెల నుండీ యీ బిల్లుకి వ్యతిరేకంగా ఆర్.ఎస్.ఎస్. మరియు పూర్వపు జనసంఘ్‌కి సంబంధించిన కొందరు ముఖ్యులు తీవ్రమైన ప్రచారంచేపట్టి మత విద్వేషాలు రెచ్చగొట్టడం మొదలుపెట్టారు. ప్రముఖ జనతాపార్టీ సభ్యుడు, న్యాయవాది వెనకటి జనసంఘ్ నాయకుడు శ్రీ శివహరి సంగాల్ అధ్యక్షతన ఆగస్ట్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మతవిద్వేషాలు రెచ్చ గొట్టే ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు యివ్వబడ్డాయి– అందులో కొందరు వక్తలు "పార్లమెంటు ఆ బిల్లుని ఆమోదిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు– అలీఘడ్ మరొక మరత్వాడ*గా మారిపోతుంది" అని హెచ్చరికలు కూడా చేశారు. అలా హెచ్చరించిన వారిలో అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ సైకాలజీ లెక్చరర్ శ్రీ బి. డి. గుప్త, మరో లెక్చరర్ శ్రీ మంగారాం కూడా ఉన్నారు. వీరిద్దరూ ప్రముఖ ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు– ఇందులో గుప్తాగారు అక్టోబర్ 5న మానక్‌చౌక్ ప్రాంతంలో హింసా చర్యలు జరిపిన మతోన్మాదులకు సూచనలిస్తుండగా అనేకులు చూశారు– అలీఘడ్ జనతాపార్టీ అధ్యక్షుడు కృష్ణకుమార్ నవమన్ కూడా యూనివర్సిటీ బిల్లుని మొదటినుండీ తీవ్రంగా వ్యతిరేకించాడు.

మత వైషమ్యాలు రెచ్చిపోవడానికి మరో కారణం, మానక్‌చౌక్ ప్రధానంగా ఆర్. ఎస్. ఎస్‌కు బలమైన కేంద్రం. కృష్ణకుమార్ నవమన్ బంగళా కూడా అక్కడే వుంది– హిందువుల ఆధిక్యతగల ఆ ప్రాంతంలో ముస్లిం ఇళ్ళ సంఖ్య కేవలం 10, 15 మాత్రమే– చాలాకాలంగా హిందూ మతోన్మాదులు యీ 10, 15 ముస్లిం కుటుంబాలను

---

* మహారాష్ట్ర యూనివర్సిటీకి డా॥ అంబేడ్కర్ పేరు పెట్టాలనే సమస్యపై ఆ మధ్య మరాత్వాడా అగ్రవర్ణాలవారు హరిజనులపై దారుణ హత్యాకాండ జరిపిన ఉదంతం పాఠకులకు తెలుసు.

అక్కడి నుండి ఎత్తివేయాలని ప్రయత్నిస్తున్నారు— అల్లర్లు జరిగే నాటికి రెండు వారాల క్రితం కూడా ఆర్.ఎస్.ఎస్‌కు చెందిన కొందరు అక్కడి ముస్లింలను యిళ్ళు ఖాళీచేసి వెళ్ళమనీ లేదా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందనీ హెచ్చరిక చేసారు— అక్కడ నివసించే ముస్లింలు పండ్ల వర్తకులు, బ్యాండు మేళాలవారు, చిన్న చిన్న ఫ్యాక్టరీలలో ఉద్యోగులు. మరి యీ పేదలు తమ యిళ్ళను వదిలేసి ఎక్కడికి వెళ్ళాలో ? ఎందుకు వెళ్ళాలో ?

అలీఘడ్ మతవిద్వేషాలకి యింకొక చిన్న కారణం కూడా వుంది— చంద్రా టాకీస్ అనే ఒక కొత్త సినిమాహాలు ప్రేక్షకులు వెళ్ళే గేటొకటి తమ వాడలోకి ఉందని ఆ హాలు ప్రారంభానికి ముస్లింలు అభ్యంతరం తెలిపారు— జిల్లా మెజిస్ట్రేటు వారి అభ్యంతరం సమంజసమైందేనని హాలుకి అనుమతి నిరాకరించాడు. థియేటరు యజమాని శ్రీ చంద్రప్రకాశ్ హాలు అనుమతి సాధించడంలో పట్టణ జనతా అధ్యక్షుడు కృష్ణకుమార్ నవమన్ సహాయాన్ని అర్థించాడు— అనా మెజిస్ట్రేట్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. చట్టరీత్యా హాలు యాజమాన్యంవారు తమకు అనుకూలమైన తీర్పు సాధించుకోలేకపోయారు. అంతటితో అక్కడి ముస్లింలను బెదరగొట్టి లొంగదీసుకునే కార్యక్రమం ఒకటి చేపట్టబడింది— అందులో సహజంగానే నవమన్ అనుచరవర్గం ఆర్.ఎస్.ఎస్ ప్రముఖ పాత్ర వహించింది.

ఇలా యీ కారణాలన్నీ అక్టోబరు 5 నాడు బ్రద్దలైన మత హింసాకాండకు నేపథ్యంగా పని చేశాయి.

అల్లర్లు జరగడానికి ముందూ ఆ తరువాత కూడా స్థానిక పరిపాలకులు పరిస్థితులను అదుపులో పెట్టడంలో పూర్తిగా విఫలులై పోయారు.

నిజానికి జిల్లా మెజిస్ట్రేట్ నిజాయితీపరుడు. కాని రాజకీయ ఒత్తిడులు అతణ్ణి మత విద్వేషాలు రెచ్చగొట్టే దుండగుల యెడ కఠినంగా వ్యవహరించకుండా నిరోధించాయి— ఉదాహరణకి— అక్టోబర్ 4న భూరా సహచరుడు జైపాల్‌ను అల్లర్లు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా అరెస్ట్ చేసినవుడు పట్టణ జనతాఅధ్యక్షుడు కృష్ణకుమార్ అనుచరులు అతణ్ణి విడుదల చేయవలసిందని కోత్వాలీ పోలీసుస్టేషన్‌ను ఘెరావ్‌చేశారు— ఈ విధంగా ఆర్. ఎస్. ఎస్. మతశక్తులు స్థానిక పరిపాలనను పూర్తిగా స్తంభింపజేశాయి.

ఉత్తర ప్రదేశ్ జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘీయుల ప్రాబల్యమే ఎక్కువ— అక్కడి ముఖ్యమంత్రి రామ్‌నరేశ్‌యాదవ్ పూర్వపు బి.యల్.డి. వాడైనా తన పదవి నిలుపుకోడానికి సంఘీయులపై ఆధారపడ వలసిందే— అందుకే అలీఘడ్

అల్లర్ల విషయంలో అతడు చాలా వరకు మౌనాన్నే పాటించాడు. న్యాయవిచారణకి కూడా అసమ్మతిగానే అంగీకరించాడు- అల్లర్లకు బాధ్యులైన ఆర్. ఎస్. ఎస్. మతోన్మాదులపై తీవ్రచర్య గైకొనే విషయంలో అందరికీ అనుమానంగానే వుంది- అటు జనతా అధిష్టానవర్గం కూడా చరణ్‌సింగ్ బి.యల్.డి. గ్రూపుమద్దత్తు విరమణతో కేంద్రం నుండి రాష్ట్ర, జిల్లాస్థాయిల వరకు పూర్వపు జనసంఘీయులపై ఆధారపడ వలసి వస్తున్నది- కాకపోతే అలీఘడ్ అల్లర్లలో ఆర్. ఎస్. ఎస్. పాత్రలేదనే జనతా అధ్యక్షుడు చంద్రశేఖరు ప్రకటనలోని ఆంతర్యమేమిటి? అంతేకాదు అలీఘడ్ పట్టణ జనతాపార్టీ సభ్యులు 29మందిలోనూ 16గురు కృష్ణకుమార్ నవమన్‌ను అధ్యక్ష స్థానం నుండి తొలగించాలని తీర్మానించినా అధిష్ఠాన వర్గం ఎందుకు మౌనం వహించింది?

న్యాయవిచారణ సంఘాల నియామకంపట్ల కూడా అలీఘడ్ ప్రజలకు ఏనాడో నమ్మకం పోయింది- విచారణలు దీర్ఘకాలం కొనసాగడమే కాకుండా నేరం రుజువైన సందర్భంల్లో కూడా నేరస్థుల మీద చర్యలు తీసుకోబడవు- 1971 లో అలీఘడ్‌లో జరిగిన హిందూముస్లిం అల్లర్లలో తనపై అఘాయిత్యం జరిపిన దుండగులను గుర్తించి కోర్టులో ఒక అమ్మాయి వేలెత్తిచూపినా వారు శిక్షింపబడ లేదు- స్వాతంత్ర్యం అనంతరం యీ 30ఏళ్ళలోనూ అలీఘడ్‌లో 6సార్లు మతకల్లోలాలు జరిగినై- కమిషన్ వేశారు- ఎందరివో నేరాలు రుజువైనవి- కాని ఏ ఒక్కరూ యీనాటికీ శిక్షింపబడ లేదు- ఈ కఠోర అనుభవాలదృష్ట్యా మొన్నటి ఘోరాలకు కారకులైనవారికి ఏదోజరుగ బోతుందనే విశ్వాసం సామాన్య ప్రజానీకానికి అందులోనూ దెబ్బతిన్న ముస్లింమైనారిటీ ప్రజలకు ఏ మాత్రంలేదు.

ఈ అల్లర్లలో రాష్ట్రియసాయుధ పోలీసు దళాలు (పి. ఏ. సి) వ్యవహరించిన తీరు అత్యంత హేయమైనది- మానవ నాగరికతకు తలవంపులు కలిగించే వీరి ప్రవర్తనచూస్తే యీదేశంలో అల్పసంఖ్యాకుల ముఖ్యంగా ముస్లింల మనుగడకు అవకాశమున్నదా అనే అనుమానం కలుగుతుంది.

గుంపులను చెదర గొట్టేందుకు గాలిలో మాత్రమే కాల్పులు జరపాలన్న జిల్లా మెజిస్ట్రేటు ఆజ్ఞలను ధిక్కరించి పోలీసులు ముస్లిం యిళ్ళమీద, మసీదుల మీద గురిచూసి కాల్పులు జరిపారు- స్థానిక హిందువు ఒకాయనను ముస్లింల యిళ్ళు చూపెట్టమని అడిగి అల్లర్లులేని ప్రాంతాల్లో కూడా ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు- మానక్‌చౌక్ తదితర వీధుల్లోని ముస్లింలయిళ్ళు, మసీదులగోడల మీద బులెట్ గుర్తులు యిప్పటికీ పోలీసుల అఘాయిత్యానికి సాక్ష్యంగా ఉన్నాయి. షమీం అనే ఒక కళాశాల గుమాస్తాతో సహా యిద్దరు ముస్లింలు యిళ్ళలోను మరో వ్యక్తి మసీదులో తుపాకి గుండ్లు తగిలి మరణించారు.

ఢిల్లీ పౌరహక్కుల సంఘం కమిటీసభ్యులు అక్కడి వాస్తవాలను కనుక్కోడానికి అక్టోబర్ 21 న వెళ్ళినపుడు అంటే అల్లర్లు జరిగిన 16 రోజుల తరువాత కూడా మానక్‌చౌక్‌లో సాయుధ పోలీసులు హిందువుల భవనాలపైనుండి ముస్లింయిండ్ల మీదికి తుపాకులు గురిపెట్టి ఉండడంచూశారు- ఈ సభ్యులు గమనించిన మరో విషయం రాష్ట్రీయ పోలీసు దళాలలో ముస్లింల నియామకం బహు అరుదుగా జరిగింది.

హిందూ పక్షపాతంతో ముస్లింలపై దమనకాండ సాగించిన యీ పోలీసు దళాలంటే ప్రజల్లో అసహ్య మేర్పడింది- అల్పసంఖ్యాక ప్రజల్లో విశ్వాసాన్ని కలుగ జేసేబదులు వీరి ఉనికి మరింత ఉద్రిక్తతకు కారణమౌతున్నది- కనుక వీరిని వెంటనే అలీఘడ్ నుండి తొలగించివేయాలని పలువురు భావిస్తున్నారు.

అలీఘడ్ దారుణాల వెనక యింతటికుటిలపాత్ర నిర్వహించిన ఆర్.ఎస్.ఎస్.కి మతకల్లోలాలు సృష్టించటం కొత్త కాదు- స్వాతంత్ర్యానికి పూర్వం 1946 ఆగస్టులో బెంగాల్ బీహార్‌లలో జరిగిన మతకల్లోల నాటినుండి స్వాతంత్ర్యం తరువాత పంజాబ్, ఉత్తరప్రదేశ్ జమ్ము కాశ్మీర్ అల్లర్లదాకా, దరిమిలా 1972 లో ఉస్మానియా యునివర్సిటీలో జార్జిరెడ్డిహత్య, కేరళ అల్లకల్లోలాలు- యిటీవలి కాలపు బెనారస్, అలీఘడ్ మతకలహాలు, వీటన్నిటిలో ఆర్. ఎస్. ఎస్. స్పష్టమైన పాత్ర వుంది. కాని ఆశ్చర్యమేమిటంటే ఆర్.ఎస్.ఎస్. తననుతాను సాంస్కృతిక సంస్థ అని చెప్పుకొంటున్నది.

ముస్లింలను క్రైస్తవులను యీ దేశంలో 'అతిథులు'గా మాత్రమే భావించే ఆర్.ఎస్.ఎస్. మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం కష్టంకాదు- 1939లో ఆర్.ఎస్.ఎస్. గురుగోల్వాల్కర్ మాటల్ని గమనించండి "ఈ దేశంలో హిందువులు కానివారు హిందూ మతం యెడ అత్యంత భక్తి భావం కలిగి వుండాలి. హిందువుల భాషా సంస్కృతులను అవలంబించాలి- హిందూజాతి మరియు హిందూ సంస్కృతి ఔన్నత్యం యెడ పూజ్య భావం తప్ప మరే భావానికీ తమలో స్థానమీయరాదు- ఇక్కడ వారు విదేశీయులుగ మనరాదు. అలా కాని పక్షంలో వారు ఏ హక్కూ అధికారమూ, చివరికి పౌరహక్కులకు కూడా అర్హత లేకుండా హిందూ జాతికి పూర్తిగా లొంగి వుండాలి."

ఇలా హిందూ మతాధిక్యతాభావం, కరుడు గట్టిన జాతీయ దురహంకారం పునాదులుగా మతంలో పుట్టి మతకల్లోలాల వల్ల పెరిగే ఆర్.ఎస్.ఎస్. తన పూర్వపు వైఖరిని మార్చుకున్నట్టు ఎన్ని ప్రకటనలు చేసుకొన్నా అది మతాతీతంగా వ్యవహరిస్తుందనుకోవడం పొరపాటే అవుతుంది.

ప్రజల్లో పడిపోతున్న ప్రతిష్ఠని నిలుపుకోడానికి, బూజుపట్టిన భావాలకి రంగు బుంకా తగిలించేందుకు ఆర్.ఎస్.ఎస్. యిటీవలి కాలంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు హిందువులు కాని వారికి (వారెంత నిరుపేదలైనా) సాధారణంగా విస్తరించవు.

స్వాతంత్ర్య ఉద్యమకాలంలోనూ ఆర్.ఎస్.ఎస్. పాత్ర గర్వించ తగ్గదేమీకాదు. అటు హిందూమహా సభ వాళ్ళలాగా బ్రిటిషు అనుకూల వైఖరిగానీ యిటు కాంగ్రెసు వారిలాగా పూర్తి ప్రతికూల విధానంగానీ కాక ఒక మధ్యే మార్గాన్ని అవలంబించింది- అందుకే ఆర్.ఎస్.ఎస్. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనలేదు.

మరో ముఖ్య విషయం- జనతాలో తన పార్టీ విలీనాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసిన అప్పటి బి.యల్.డి. సభ్యుడు శ్రీ బ్రహ్మదత్ రాసిన 'ఐదు తలల రాక్షసి' అనే గ్రంథంలో తిరుగులేని అనేక దాఖలాలతో యిలా వుంది "అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ శ్రీమతి ఇందిరాగాంధీని సుప్రీంకోర్టు నిర్దోషిగా ప్రకటించినప్పుడు ఆర్.ఎస్.ఎస్. నాయకుడు శ్రీ దేవరస్ ఇందిరాగాంధీని అభినందించాడు. తమ మీద చల్లని చూపు కోసం ఆమెకు సిఫార్సు చేయవలసిందిగా అతడు ఆచార్య వినోబాభావేను బతిమాలాడు- 'లోక్ సంఘర్ష్ సమితి'తోగానీ శ్రీజయప్రకాశ్‌నారాయణ చేపట్టిన 'సంపూర్ణ విప్లవం' అనే ఉద్యమంతో గానీ ఆర్.ఎస్.ఎస్.కు ఎట్టి సంబంధం లేదని కూడా శ్రీ దేవరస్ స్వయంగా శ్రీమతి ఇందిరాగాంధీకి రాశాడు- అంతేకాదు ఆర్.ఎస్.ఎస్. మీద నిషేధం తొలగించి నిర్బంధించిన సభ్యుల విడుదల చేస్తే ప్రభుత్వం చేపట్టిన 20 అంశాల పథకాన్ని అమలు పరచడంలో తమ వాలంటీర్ల సేవల్ని కూడా అందజేస్తామని శ్రీ దేవరస్ విన్న వించుకున్నాడు-" ఇదీ ఎమర్జెన్సీ కాలంలో తీవ్ర నిర్బంధాలకు గురయ్యామని గర్వంగా చెప్పుకొంటున్న ఆర్.ఎస్.ఎస్. అచార్యుడు ఆడిన తెర వెనుక భాగోతం.

ఏమైనా విశాలమైన, ఆరోగ్యకరమైన జాతీయ భావానికీ అంతర్జాతీయ దృక్పథానికీ మత సంస్థలు అడ్డుగోడలు- సామాజిక జీవితాన్ని కలుషితం చేయడంలో వాటి పాత్రను తక్కువ అంచనా వేయలేం.

దేశంలో జరిగిన వివిధ మత కల్లోలాల్లో కొన్ని సందర్భాల్లో ముస్లిం మత సంస్థల పాత్ర కూడా లేదని చెప్పలేం.

దోపిడీ వ్యవస్థ తన దోపిడి సజావుగా సాగడానికి తగిలించుకునే అనేకానేక ముసుగుల్లో మతం కూడా ఒకటి- ఈ అన్యాయ వ్యవస్థను కూలగొట్టి శ్రామిక జన రాజ్యం ఏర్పడ్డనాడే మతానికి గోరీ కట్టడం సాధ్యమౌతుంది.

ఎత్తని పిడికిళ్ళు....

చుక్క

1

ఎప్పటిలాగే- నిన్నటిలాగే- పల్లె లేచింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. వెలుగునిచ్చే సూరీడు అప్పుడే పొత్తిళ్ళలో పొర్లాడే పసిగుడ్డులా, ఎర్రని మందారంలా, ముద్దబంతి పువ్వులా, నింగిమీద నిలిచాడు. తెల్లని సూర్యకిరణాలు లోకానికి వెచ్చదనాన్నందజెయ్యాలని ఆరాటపడుతున్నాయి. కోడి కూసి చాలా సేపయ్యింది.

* * *

"ఏమత్తా ! ఏమొ, మా మర్దలు పండుక్కు రాకపాయె? మా తమ్మున్ని గంక ఇడ్సి ఉండలేదన్నదా ఏంది నీ బిడ్డ?" అన్నది ఈరమ్మ నవ్వుతూ, కొంగుని నడుం సుట్టు బిగించి, కుండలో పేడనీళ్ళు కలియపెడ్తూ.

"ఏందోనే ఈరా, ఈ కాలపోరగండ్ల దేందోగానీ 'అద్దాలనాడే బిడ్డలుగానీ, గడ్డాలచ్చినంక బిడ్డలా !' అన్నరట ఎన్కటి కెవరో. లగ్గమయి మొగనింటికి బోతే సాలు, ఇగయ్యవ్వలు సచ్చిన్రా, బతికిన్రా అని తిర్గి సూడరు."

"నువ్వన్నా జెప్పే ఈరా, నాకు మాత్రం ఎందరున్నరు సూస్కోని మురిస్టాన్కి ? అదొక్కతేనాయె. బిడ్డ లేంది పండుగెట్టయితదని తోల్కరాను బోతే, పనాడ మావచ్చిందన్న గ్యానమున్నండద్దే దానగ్గెర- 'అవ్వా! నేనాడికత్తె అల్లునికీడ బువ్వండుకునుడు లిప్పలు గాదా. నేన్రానే !' అన్నది-" ఆగి కళ్ళనీళ్ళు తుడ్సుకున్నది లస్మమ్మ.

"ఏడ్సుడెందుకత్త ! ఆడ మా తమ్మునికి సుత ఎన్కముందెవలున్నరు ? ఎటు బెట్టినా నీ ముద్దులబిడ్డ దప్ప. పోనియిమరి ఇద్దర్ని కల్సి రమ్మంటయిపోతది గద- ఏడ్సుడు తూడ్సుడేంది మల్ల."

"పాపం, మా అల్లున్కి తెల్లారేసి మొక్కాల్నే. 'లచ్చిమీ ! మీయవ్వ మన్సు బడి, పేడకొద్దచ్చే- పోరాదు. నాది నేన్సూసుకుంట గనీ, నువ్వయితే పోరాదన్నడు. ఆకర్కి ఇగేంజెప్పిన యినదని ఇద్దర్ని రమ్మన్జెప్పిన. అయినకు రెండు జాగల్ల యాతంబోసుడుండె. ఇగ నా ముకంజూసి అత్తనన్నడే. ఓయాళ్ళ ఈడికి జాంపొద్దాల్లకు సేరత్తరు గావచ్చు."

"నేన్జెప్పలేదత్త ! ఎదిగిన్రంటే అలామొగలు ఆళ్ళే కల్సుంటరని. నీకు యాదికున్నదోలేదో, నీ బిడ్డ పంచాలప్పుడు- నీకేలి లేనందుకు నన్నిట్టమొచ్చినట్టు తిట్టినవ్."
నవ్వుతూ అన్నది ఈరమ్మ.

పేడనీళ్ళు కలియబెట్టడం అవగానే, ముంతతోటి వాకిట్లో అలుకు జల్లసాగింది.

"పాడు పోరి! పండుగపూట గయన్నెందుకులేయే— అయినా కోడలా, నీకేమిన నాకాయింత పెద్దిరికం లేదంటవా? ఎంతైనా నేను పరాయిదాన్నయితిని— నీ మొగడు నా కొడుక్కాదాయె— నువ్వు నా కోడలువు కాదయితివి—" అంది జీరగా లస్మమ్మ.

"అదేందత్త గట్లంటవు— నీ కొడుకునూ, నన్ను మీ ఇంట్లనే ఉంచుకోరాదు. పోరగాండ్లతో ఏగలేకున్న— మంచిగ పోరగాండ్లను నువ్వుర్సుకుందువు, ఇంటి పనంత నేనూసుకుంట."

"నాకంత అదురుట్టమా! నా గీతే మంచిదయితె నా కడుపే పండేది. అయితే మానేగాని, ఇయ్యాల బువ్వ గివ్వ ఏమండకు— అందరు మాయింట్లనే తిందురుగని."

"ఏందత్త! నువ్వేందో అంటవు. మీ ఇంటికి మేమచ్చుడేంది? మా ఇంటికే మీర్రారాదుర్రి." నవ్వుకుంట అన్నది ఈరమ్మ.

తమింటి ముందు అలుకు జల్లడం అయిపోగానే. అట్లాగే లస్మమ్మ ఇంటి ముందు వాకిట్లో కూడ అలుకు జల్లింది, ఈరమ్మ. అదీ యీరమ్మకు మామూలే.

"ఏందే కోడలా! నన్నసలు మాట్లాడనియ్యవే. నీతోని ఏమ్మాట్లాడినా గోసనే." నవ్వింది, లస్మమ్మ కూడా.

"నా కొడుక్కు లేసినాడే ఈరా! పిల్లగ్గాడ ఇంక లేవనట్టున్నరు గద."

"నీ కొడుకా....! నీ కొడుక్కు ఇల్లెందుకత్తా? రాత్రింట్ల పంటేగద? యేటా బతుకమ్మలకు తనే పువ్వు దెచ్చేటోడు ఈయేడు సున్నా. నిన్న మాపటీల నేనే పెరట్లకుబోయి అంచెడంత పువ్వు గోసుకొచ్చిన. రాత్రింట్ల బండకపాయె. ఇగింత పొద్దెక్కి వత్తున్నా జాడ లేదాయె. ఇగ నీ కొడుకుతోని నే నేగియ్య నత్తా! ఇంట్ల పెండ్లామనేదుంటదని మర్సిపోతడేందో అప్పుడప్పుడు. అచ్చినంక నువ్వన్నా జెప్పత్తా!" అని అలుకు చల్లిన వాకిట్లో ముగ్గులు వేయడానికి సుద్దడబ్బ కోసం యింట్లోకి పోయింది యీరమ్మ.

* * *

"అన్నలార! అక్కలార! ఊర్లున్న పజలందరికీ సంగపోల్లు తెల్యపర్తున్న దేందంటే—

"ఏమేటా, పనందరం. బతుకమ్మ పండుగనాడు, మనూరి దొరగారి గడీ ముందట సావిట్లొ బతుకమ్మ ఆటాడు కుంటున్నం. అడ్కనే మన అక్కలను, అవ్వ

లను, చెల్లెల్లను, పెండ్లాలను అకర్కి బిడ్డల్ను గూడ, కుర్సీ మీన కూసుండి. మంచిగ సిగిరెట్లు దాక్కుంట, పొగూదుకుంట, దొరగారు సూత్తుండడం మంచిదేనా....

"ఊర్లె ఎవ్వలు మంచిగ అందంగ ఉన్నరా— అని సూసుకుంట, ఆళ్ళ పెళ్ళాం పిల్లలకంటె— మంచి బట్టలు— నగలు పెట్కున్న మన ఆడోల్లను— 'ఇంత మంచిగ సోకు జేస్కును డెందుకే! తెల్లారేత్తె ఎద్దు గుద్ద పొడ్సుకు నెదోల్లు, అని అనడం మంచి దంటారా?"

"అయినా మనం ఇన్ని రోజులు— గాడిదలోలె అన్ని సహించినం. ఎందుకంటే: దొరోరు పెద్దోరు, అధికారం పలుకుబడీగలోడు అనీ, డబ్బుగలోడు అనీ, ఏమంటే ఏమయితదోనని, నోర్లు మూసుకున్నం.

"మరి. దోరోరు! మన్సికాడా? ఆయినకు కాళ్ళు, చేతులు, ముక్కు, మొకం లేవా? ఆయినకు పెళ్ళం, పిల్లల్లేరా? మరాయన పెత్తనం, దవుర్జన్యం ఇంకా ఇంకెన్ని రోజుల్ నడువాలె?

మనందరం ఒక్కటయితే, ఇసోంటి దొరలు పదిమందచ్చినా మనల్నేం జెయ్యరు, పేదోళ్ళమంత ఒక్కట్కావాలె.

"యాట మన ఆడోళ్ళందరు దొరోరి గడిముంగట సావిట్ల బత్కమ్మ లాడు కోడం అసారమయిపోయింది. అదే? ఆడ్నే ఎందుకాడ్కోవాలె? దొరోరి గడిముం దట్నే బత్కమ్మ లాడుకుంటెనే— బత్కమ్మ పండగ జేస్కున్నట్టా?

"ఇయ్యాల్ల బతుకమ్మ ఎవ్వలాడల వాల్లే ఆడుకోవాలే"....

* * *

చాటింపు సాగుతానే వున్నది— ఇంకా చిక్కగవుతున్న ఎండ పొడలా.

"ఏందత్తా! ఏందో సాటింపేత్తాన్రు? మల్లేమన్న పైసల్గిట్ల అసూలు చేత్తనరా యేంది" అన్నది ఈరమ్మ, ఇంట్లోంచి బయటికి వచ్చి.

"అయ్యో! సాటింపు నీకిన్రాలేదె? నీ మన్సంత నా కొడుకుమీన్నే ఉన్నట్టు న్నది. పైసల్ అసూల్ జేసుడు గాదు గనీ, ఈయ్యేడట బత్కమ్మల్నాట దొరోరి సావిట్ల ఆడద్దట, అన్సంగపోలు సాటింపు చేస్తాన్రు. ఈ సంగపోరగాండ్లకు పిస్స లేసినట్లున్నది. తాతముత్తాతల్నుంచి అత్తున్నది ఒక్క రోజుల కుదిరి కూసుండు మంటె కుదుర్తాది!"

"నా కొడుకు నాత్రియింటికి రాలేదంటివి? ఇన్నవా? నా కొడుకేం జేసిండో, సంగపోల్లేం జేత్తనో!" అన్నది లస్మమ్మ.

"సాల్లే, సంబురం! ఎంత సంగపోల్లయితేంది ఆసారాన్ని కాదంటమా? అయినా ఈనెకు ఎంత జెప్పినా ఇనడత్తా. ఆ సంగంల ఉండుడెందుకు? దొరోరి కంట్లె పడుడెందుకూ? ఏదో ఉన్నకాడిక్కి కట్టం జేసోక్కని కలో గంజో తాగి బత్కాక?" అన్నది ఈరమ్మ. ఆమె మనసు క్షణకాలం గతంలోకి పోయింది.

తనకు కొత్తగా పెళ్ళయినేడు. అయ్య దోల్కపోనచ్చినా, అత్త మామల్లోల లేదు. ఆళ్ళకు మాత్రం ఎవరుండె? ఉన్నొక్క కొడుకు బొంబాయికి పోయె. పోయి మూడ్నెల్లగ్గావచ్చు- తన పెనిమిటి అచ్చినాంక- ఇంట్లోళ్ళం చెప్పకున్నా, బయట ఎవరన్నా జెప్పరా? దొర మీన కారాలు మిరాలు నూరిండు. తనూ, అత్తమామలూ కాలుగడ్పులు మొక్కి ఎట్లనో సాంతింప జేసిన్రు.

అనాడు దొర ఏమన్నడు-?

"ఏందే! నీ మగనికి సంపాందన గిట్ట ఎక్కువయ్యిందా ఏంది? అవుగానీ నీ మొగుడు బొంబాయికి బోయిండేమో? ఈ సుక్కల సీరా ఆడే బంపిచ్చిండా- లేకుంటే ఎవ్వడన్నా కొనిచ్చిండా! ఎందుకంటె! ఆడ సంపాదన ఆనికే సరిపోతలేదట గద? తెల్లారత్తె ఎద్దు గుద్ద బొడ్సుకునే దానివి, మొగడేద్నో బొంబాయిలుండెనా నీకీడింత సోకు లెందుకే....?"

కళ్ళలో నీళ్ళు తిరిగినయ్.

"ఏందే ఈరా! కండ్లల్ల నీరు నిండవట్టె?" అడిగింది లస్మమ్మ.

"ఉహుఁ ఏం లేదత్త! ఏందో యాదికచ్చింది-" కళ్ళు తుడుసుకున్నది.

"తన పెనిమిటి పెడ్డ పనుల్ సేత్తలేడు- ఎవర్ని అన్నాయం సేత్తలేడు- దొంగతనం లంజెతనం జేత్తలేడు- కానీ తన కొక్కటే బయ్యం- తన పెన్మిటి దొరకు ఎదురు తిరుగుతాండు. దొరంటే పెద్దలోకు మనిషి. వాన్ది పాము పగ- దొరోరి కంట్లెబడితే అన్నీ కట్టాలేన్రా అని సచ్చేదనుక అత్త చెప్పింది. అదే తన బయ్యం, బుగులు-" ఈరమ్మ కంటికొలుకుల్లోంచి రెండు కన్నీటి చుక్కలు రాలినయ్.

"ఇది నిజంగా జరుగుద్దా అత్తా! ఎవరెట్లపోతె ఈయినెకేంది? ఆ సంగం బుండి ఒరుగబెట్టుకునేదేంది? సగ్గురి కంట్లెబడుడు తప్ప-" బరువుగా నిట్టూర్చింది.

చిప్పలోని సుద్దపొడిని కుడిచేతి పిడికిలినిండా అందుకున్నది. వాకిట్లో ముగ్గులు పరిచింది. ఆకుపచ్చగాఉండే కళ్ళాపిమీద తెల్లని ముగ్గులు ముత్యాల దండల్లా ఉన్నాయి.

"అవ్వా!".... పిల్లలు లేచినట్టున్నారు. అయిదేళ్ళ కూతురు లచ్చిమి లేచి రాగం అందుకుంది. నిద్దర్లేచే సరికి ఎదురుగా కన్నతల్లి కనిపించలేదు.

"నా తల్లివి కాదె? నా ముత్యాల మూటవి కాదె? సూడు అన్న లేసిండా– కసేపు పడో్కే!" బిడ్డని లాలింప జూసిందిగానీ, ఆ చిన్నది విన్లేదు. తల్లి కొంగు వదలి ఉండలేదు ఆ పసిది.

ఇంతలో బయట ఎవరో వస్తున్నట్టు చెప్పుల సవ్వడి–

"అవ్వని ఏడ్పిస్తాన్నావ్, నా కన్నతల్లివి గాదు– యిగ రా."

అదివరకే వెనుతిరిగి చూసింది ఈరమ్మ. ఆ చెప్పుల సవ్వడి తన పాణం.

తల్లి భుజాలమీద ఒరిగిన లచ్మి తండ్రి చేతుల్లోకి జారిపోయింది.

"వచ్చినావయ్యా! కసేపు నీ బిడ్డని ఆడించు– నా పని నేను జూసుకుంట."

"ఇదెక్కడి విచిత్రపబ్బా? నా బిడ్డా? నువు లెందే నేనెక్కడ కంటి?" మల్లయ్య నవ్వాడు.

"సాల్లే సరసం– అద్సరె గనీ.... ఆ సాటింపిన్నవా?"

"అదా?"

"నాగ్గూడ దెల్సు– నేంగూడా యిన్న కనీ.... అయ్యన్నీ మన కెందుకు? ఏదో మన మానాన మనం బత్కుదాం– నల్గురి కండ్లల్ల నల్సు గావడం ఎందుకు? పెద్దలోకుల్తోని పెట్టుకునుడెందుకు?" అన్నది మెల్లగా తన దీపం మీది ప్రేమతో.

ఏం మాట్లాడలేదు మల్లయ్య. కొద్దిసేపు ఇద్దరిమధ్య మౌనం రాజ్యం చేసింది.

"ఈరా! నేనేం పాడుపని చేస్తలేను. దొర సంగతి నీకు దెల్సు. ఊళ్ళె అందరికి దెల్సు. కాని వాళ్ళకు ఏమంటే ఏమయితదో, దొరకెదురు తిర్గితే ఏమయి తదోనని భయం. కానీ ఇప్పుడు నా అసొంటేళ్ళే గాదు ఊరంతా సంగం పేరుతో ఒక్కటయితున్నరు. వాళ్ళేదో చెయ్యాలన్నరు– అదే చెయ్యబోతున్నరు. ఏద్జేసినా సంగమే జేస్తది గనీ నేనుగాదు. ఈరా! దీంట్ల నా ఒక్కనిదేంవున్నది?"

"అవునయ్యా, అదే.... చేసేది సంగమే– గానీ సేయించేదంతా నువ్వేగద? సంగానికి పెద్దవు నువ్వేగద? సంగాన్ని నడ్పించేది నువ్వేగద?" దాదాపు శోకం అందు కుంది ఈరమ్మ.

"ఈరా! నువ్వు ఏడ్సుడేం బాగలేదు_" భార్య దగ్గరగా జరిగి నెత్తిని కుడి చేతితో నిమిరాడు.

"నా మన్సంతా నీమీదేనయ్యా_" అతని ఎదపై తలనాన్చింది.

* * *

గ్రామమంతా ఉడికిపోతున్నది.

"దొరోరి సావిట్ల బత్కమ్మలాడుడు ఏనాటినుంచో అత్తున్న అచారమాయె_ ఆ ఆచారం ఇప్పటప్పటిది కాదు_ తరతరాల్నుంచీ తాత ముత్తాతల్నుంచి వస్తాంది. ఏక్దమ్మున ఇయ్యాలది మారాల్నంటె జర్గేపనేనా?"

ఎవరికివారే ఉడికిపోతున్నరు_ ఆలోచిస్తున్నరు.

కొందరు సంతోషపడుతున్నారు.

కొందరు ముక్కుమీద వేళ్ళేసుకుంటున్నరు.

మరింతవరకు అదేమిటన్న నాథుడే లేడాయె....

2

"పోశాలు! నువ్వన్నా సెప్పకపోతివి_ నా సంగతి నీకుసత దెల్వదా? నేనెవ్వల్నన్న ఏమన్న అన్ననా? సిన్నప్పట్నుంచి మా గునం నీకెర్కే కద! నువ్వంటే నేనెంత మర్యాద ఇచ్చేటోన్నో?.... ఇయ్యాల ఆ మల్లయ్య, అని సంగం నా మీద లేనిపోని నిందలు పుట్టించి నన్నెంత అల్లరి జేత్తన్రో! ఓయాల్ల ఎప్పుడన్నా తెల్సో తెల్వకనో ఏమన్న జరిగిందనుకో_ పెద్దమన్సులు మీరంత లేరా? అయ్యా బాంచేన్ ఇది తప్పంటే, అప్పుడ్నే నొప్పుకోకపోతే అనున్రి.

ఈ వూర్లె పెద్దమనుషులు, నా సిన్నప్పట్నుంచీ ఏన్నో పంచాతులు జెప్పినోల్లు అసోంటి మీక్కన్పడని సెడ్డబుద్ధులు, అనికి_ అని సంగానికి కనిపించినయా! అంటే ఆ మల్లయ్య కండ్లకు మీరంతా సచ్చు దద్దమ్మలన్న మాట! అదీ ఇడ్సిపెట్టు. మనల్ని వాల్లనకపోతే ఎవలంటరు? అంటే అననీ. బతుకమ్మంటె అచ్చంగా గౌరమ్మను పూజించుడె కదా? అసోంటి గౌరమ్మను పతేటా కొలిసే సావిట్ల కాదని, యాడ్నో మూడుబజార్ల కాడ కొలుత్తమంటే ఆ దేవత వూకుంటదా? ఇగ ఆ గౌరమ్మకు కోపమత్తె, ఇగ మన పెండ్లాం పిల్లలకు సుకం జరుగుద్దా? పాడిపసువులు సల్లగుంటయా? మీరే సెప్పునిరి?" ఒరుగుడు కుర్చీలోంచి కాస్తా ముందుకు జరిగి సిగిరేటు అంటించుకున్నాడు_ దొర.

"పోశాలూ! అంతా ఇవరంగ ఇస్నరు కదా? అది నేను సెపుతున్నది కాదు. రాత్రి గౌరమ్మ పసుపు బట్టలు కట్టుకోని, ముక్కుపుల్ల పెట్టుకోని, నడుముకు వడ్డాణం పెట్టుకోని కలలకచ్చి ఇదంతా సెప్పింది."

దొర గుప్పున బయటికి వదలిన పొగ, చిన్న మబ్బుతునకలా అన్పించింది అందరికి.

ఆ గ్రామం పెద్దమనుషులు గుసగుస లాడుకున్నరు. చెవులు కొరుక్కున్నరు.

"బాంచెన్ దొరా! మీ గులాపోల్లం– మీర్జెప్పిందంతా మంచిగనే ఉన్నది– లంజకొడుకు ఆ పల్లనికి, ఆని సంగాన్కి సుతమంత బుద్దిలేదు. తాత ముత్తాతల్నుంచీ వత్తన్న ఆచారమాయె– కాలదంతే పుర్గులబడి సావమా?" అన్నడు కులపెద్ద పోశాలు.

ఒకరిద్దరు తందానా.... అంటూ తాళం పేశారు.

కొందరేమ్మాట్లాడలేదు కానీ బుర్రలూపారు. వాళ్ళ గుండెల్లో వేరే గుస గుసుంది.

"అయితె ఇప్పుడు ఏం సేద్దామంటరు? ఓటి మాంఛి అయిడియా! మా సుంక రోన్ని సాటింపుకు తోలుత– ఆ సంగపోల్ల మాటెవ్వలు ఇనద్దని, తాత ముత్తాతల్నుంచి అత్తన్న ఆచారాన్ని కాదని ఊరికరిట్టం తేవద్దని" అన్నడు దొర.

పెద్దలు తలలూపారు. దొరోరి మాట బాపుందంటే బాపుందన్నారు. ఇగ మేమెల్తామన్నట్టు లేచారు.

"అదేంది, మరి? మా గడీలకొచ్చి ఛాయన్న తాగకనె పోతరా?" టీ తెమ్మని ఇంట్లోకి కేకేసాడు.

దొరవారిది దొడ్డమనసని పెద్ద మనుషులందరు అనుకున్నరు.

"అరె కొంరా! నువుపోయి వూర్లె సాటింపెయ్యి" పురమాయించాడు దొర.

కొంరడు బుర్రాడించాడు. వాడి కళ్ళకింకా జ్ఞాపకమున్నది; పోయినేడు తన సెల్లె ఇస్త్రీ సేయించుకొని కొత్త సీర గట్టుకొని, దానత్తగారు బెట్టిన చెవులకమ్మలు, పట్టగొలుసులు, బెట్టుకొని. సావిట్లకు బతుకమ్మాట సూడచ్చింది.

"ఏందే పోరీ కతా! నీ మొగని పెండ్లాన్ని.... పీమాదిగులకు బత్కమ్మ పండుగేలేదాయె? మరి నువ్వు సొన్లంజ తీర్గ సోకు జేసుకొనచ్చిన వేందే!" అన్నడు దొర అప్పుడు.

ఈ యేడు పండుక్కు దాన్ని తోల్కరానుబోతే, మీదవడి ఏడ్సింది.

"అన్నా పండుగులకు నేనాపూరు రానే ?" అన్నది.

కొంరని గుండె అవిసింది. కళ్ళవెంట నీళ్ళు కారడమే తక్కువ. జరిగింది గుర్తు కొచ్చింది మనుసుకు.

ఇంటితోవబట్టాడు. చాటింపు జేయడానికి, డప్పు తీసుకురాను.

తోవలో కలిసాడు చలపతి.

చలపతికి ఇరవయ్యేళ్ళుంటాయి. పట్నంలో చదువుకునేవాడు. మధ్యతరగతి కుటుంబం. గడవక, చదువు చాలించి, వూళ్ళోనే వుంటూ వ్యవసాయం చూసు కుంటున్నాడు.

చలపతి కన్పడేసరికి కొంరనికి కొండంత బలమొచ్చింది.

'సలపతి బాబూ,' పిలిచాడు.

ఆగాడు చలపతి. "ఏందే కొంరన్నా! బాబనద్దని నీకెన్నిసార్లు జెప్పిన. ఏందో కత." అన్నాడు.

చెప్పాడు కొంరడు జరిగిందంత. కనుబొమ్మలు ఎగిరేసాడు చలపతి. "నేను ముందే అనుకున్న.... నీ పని నువు చూసుకోవే కొంరన్నా!"

కొంరని భుజం తట్టాడు.

వడివడిగా అడుగులేసాడు.

* * *

రెండు జాముల వేళ దాటిపోయింది.

ఆకాశం మీద మబ్బులు పరచుకున్నాయి. ఆకాశమంతా ఎర్రలి తడకలా వుంది.

బతుకమ్మ లాటకు సింగారించుకునే ఆడజనమంతా ఆగిపొయింది. "ఇగ సింగా రించుకొనుడు ఎందుకు? ఏట్ల బెట్టనా? ముందే ఆన మొగులు గాబట్టె. అయింత ఆనందుకుంటె. కొత్త సీరా సింగారం పాడయిపోతయ్. ఓ యాళ్ళ ఆనే బడితే ఇగ ఆటెక్కడిది? సేతులు ముడుసుకొని, సేసుకున్న పిండి ముద్దల్ని సప్పరించుడే"

"అమ్మా గౌరమ్మా! యాడాదికోదినం.... ఈ ఆన మొగులు ఇయ్యాళే రావాల్నా! నువ్వన్నా ఆ ఆన దేవునికి జెప్పు. ఇయ్యాల ఆన గొట్టద్దని."

దొరవారి పంచతంత్రాలు, నీతిబోధలు, మూతి మీసాల కంటించుకున్న పెద్ద మనుషులు ఆ సమయంలోనే పాచికలాట మొదలెట్టారు.

"ఏం లేదు. ఇగ-ఆ గౌరమ్మకు కోపమచ్చింది. గౌరమ్మ మగడు మూడో కన్ను తెరుస్తున్నడు. తాత ముత్తాతల్నుంచి వస్తున్న ఆసారాన్ని సీ కాదంతే మన్సులకు మంచిదా? లేపోతే నిన్న- మొన్న బుట్టి ఇయ్యాల బుడ్డగోసి బెట్టిన పోరగాండ్లు ఇన్ని జాగోతాలేత్తరా! ఇగ యీ వూరుకు ఏదో సని జుట్టుకున్నట్టే- ఇగ ఆ దేవునిక్కి- సాంతి బెట్టంది లాబం లేదు.

కొందరవునంటె అవునన్నారు. కొందఁహూఁ అన్నారు.

దొర మనుషులు వూళ్ళో తిరగడం ఎక్కువయింది. ఆ మనుషులు ఎవరి మీదికీ పోవడం లేదుగానీ, గీతబోధలు చేస్తున్నారు. వాళ్ళ గీతోపదేశం చేస్తున్నపుడల్లా వచ్చే నాటు సారాయి ఘూపైన వాసన దిక్కులకు వ్యాపిస్తున్నది.

అసలు తామేం మాట్లాడ్తున్నాం అనేది వాళ్ళకు తెలియకున్నా జనానికి తెలుస్తున్నది వినేవాళ్ళు వింటున్నారు. చీదరించుకునే వాళ్ళుసైతం వింటున్నారు.

నీళ్ళబోసుకున్న మొగులు నీళ్ళాడింది. పావుగంట దాకా వర్షపు ధారలు.

సింగిడి 1 బొడిసింది. మబ్బుల నడుమ నుంచి ఎండ పొడుచుక రాసాగింది. ఈదుల్లో 2 వాన నీరు జరజరా పారిపోతోంది. పోరగాళ్ళు కొత్త బట్టలు తొడుక్కున్నా ఈదుల్లకు వచ్చి పచ్చి మన్నుతో పిచ్చికగూళ్ళు కడ్తున్నారు— అది చూసి తల్లిదండ్రులు వీపు మీద రెండు అంటించేదాకా.

ఘూమంతా మైల దీసేసినట్టున్నది.

ఆడజనం గుండె మీద చెయ్యేసుకున్నారు— 'అమ్మలయ్యో' అనుకుంటూ.

* * *

అది సంగం.

వూళ్లో చాలామంది పడచువాళ్ళు దానికి చుట్టాలే.

"అందరిన్నరా, ఇగ ఈదుల్లకుబోయి అందరికీ నచ్చజెప్పాలె. ఓయాళ్ళ ఎవ్వలేమన్నన్నా, ఆల్లనేమనొద్దు, ఆల్లకు సుత నచ్చజెప్పాలె" అన్నడు చలపతి.

"ఇగీడ మాట్లాడుకుంట గూసుంటె పనిగాదు ఇగ లేద్దాం" అన్నడు మల్లయ్య.

అందరు లేచారు సంగం బయటకు వచ్చారు.

తలుపుదగ్గర ఎవలో పొంచి వింటున్నారు.

1. ఇంద్ర ధనుస్సు 2. ఈత చెట్లలో

'ఏందే పోశాల్తాత? నువ్వా? ఏందే మరి గీడనిల్సున్నవ్? లోపలకొచ్చి కూసుండక పోతివి? దాయె వూర్లెకి పోదాం అన్నాడు పుల్లయ్య, అంటూనే పోశాల్తాత చెయ్యిపట్టుకున్నాడు, రమ్మన్నట్టు.

"ఏహె ఏం లేత్తాలే. ఇప్పుడే అచ్చిన లోపలి కత్తె ఏమనుకుంటరోనని, ఇగీడనేనిల్సున్న!" తప్పదన్నట్టుగా వెనకాల నడిచాడు పోశాలు.

"ఏమక్కా! అంత తయారయినారి. సూడుండ్రి- మొగులుమీద నుంచి ఎండ ఎట్ల పొడ్సుకొత్తాందో" అన్నాడు చలపతి.

అందరు జెప్పున తయారు కాన్రి బత్కమ్మ లాడేద్ది యెక్కడ్నో యెరికేనా? పోశాల్ తాత యింటి ముందట్నే."

దొరగారింటికి బోయే తోవలోనే పోశాలుతాతయిల్లు, గడి ముందర నిలుచుంటే పోశాలు తాతయిల్లు కనబడుతుంది.

బత్కమ్మ తనింటిముందరే అని తెల్సేసరికి, పోశాలు తాతకు కొండంత సంబరమయింది.

"తనింటి ముందట ఆడితె గౌరమ్మకు కోపమొత్తదా? ఏం? దొరే మన్సిగాని నేను మన్సిని కానా? భేషురా సంగపోళ్ళు" అనుకున్నడు.

దొరగారు పోసిన నీతిబోధలు, టీ నీళ్ళు ఎక్కడ పోయాయో.

తన మనుమరాళ్ళతో ఇంటిముందర శుభ్రంగా ఊడ్పించి అలికించి ముగ్గు లేయించాడు, దానిమ్మగింజల వరుసల్లా, పచ్చనివాకిట్లో తెల్లని ముగ్గులు అందాలు చిమ్ముతున్నాయి.

మొట్టమొదట పోశాలు తాత గౌరమ్మ వచ్చి వాకిట్లో కూచుంది, కొత్తపెళ్ళి కూతురులా.

ఇంతకుముందు పండగ లప్పుడు తాము అనుభవించిన అవమానాలూ, తిట్లూ గుర్తున్న ఏ స్త్రీయైనా ఆ వాకిలి విడిచిపెట్టి, దొరగారి చావిట్లోకి అడుగేయడం లేదు. దొర మనుషుల ఆడవాళ్ళు కూడా, తోటి స్త్రీలను కాదని అడుగు ముందుకు వేయలేక పోతున్నారు.

దొర చావిట్లో కూడా అలికారు. సాంబ్రాణి, గుగ్గిలంపొగ వేసారేమో పొగ లేస్తున్నది.

దొరసాన్ల బతుకమ్మలు సిగ్గుపడుతూ బయటకొచ్చినయ్. పూర్తిగా దొరమీదనే ఆధారపడి జీవించేవాళ్ళు మాత్రం అక్కడవున్నారు. వాళ్ళ బతకమ్మలు కూడ అక్కడికే వచ్చాయి.

నిజానికి పోశాల్తాత యింటి ముందరి బతుకమ్మలకంటే అవే అందంగా వున్నాయి. ఇక్కడ బతుకమ్మాట మొదలయ్యింది. అక్కడ చావిట్లో ఆట యింకా మొదలేకాలేదు. పెద్దలోకులకి బతుకమ్మ పాటలు రావడం అరుదు. వాళ్ళ వాళ్ళకు గుసగుసలు మొదలయ్యాయి— "పాట నీకొచ్చా" అంటే "నీకొచ్చా" అని. ఒకవేళ ఎవ్వరికైనా వచ్చినా ఇంతకు ముందెన్నడూ పాడలేదాయె— సిగ్గు. ఇవ్వాళ పాడితె ఎట్లుంటుందో.

గడీ— బంగళామీద కిటికీలోంచి చూస్తున్న దొరకళ్ళల్లో పట్టపగటి ఎండ ప్రత్యక్షమయింది.

కండ్లో కారంపొడి చల్లుకుంటున్నడు— దొర.

* * *

ఆనాటి రాత్రి

సంగంలో నూనె దీపం వెలుగుతున్నది.

ఈ వూరికింకా కరంటు రాలేదు.

కరెంటు తెప్పిస్తానని, జనం దగ్గర దొర ఎన్నడో పైసలు వసూలుచేసాడు కానీ రాలేదు. అదేమని అడిగేవాడే లేడాయె, ఇన్నిరోజులు.

కరెంటు విషయంలో సంగం యిదివరకే చర్య తీసుకుంది. జనం నుంచి వసూలు చేసిన డబ్బు వడ్డీతోసహా యిస్తానన్నాడు దొర. దాని కింకా నెలరోజులు గడువుంది. ఇక కరెంటు గ్రామానికి రావడం గురించి. మెజారిటీ జనం వెళ్ళి, కరెంటాఫీసుకు ఇంకా తహసీల్దారు, కలక్టరు, వీళ్ళందరి దగ్గరికెళ్ళి ఊరేగింపులు తీసి దరఖాస్తులు పెట్టుకున్నారు సంగం పేరున.

దసరా పండుగకు ప్రతియేడు ఆ వూరి గొల్లవాళ్ళు రెండు గొర్రెలను దొరకు యిచ్చుకోవాలి. ఈ గొర్రెలను జమ్మి దగ్గర కత్తితో నరుకుతారు.

గొర్రెలను నరికే కత్తికి దొరగారే పసుపుకుంకాలు ఓద్దుతాడు. కంకణం కట్టుకొని కత్తిని గొర్రెల మెడలమీద రాచినట్లు చేస్తాడు దొర. తర్వాత తలారికి ఇస్తాడు. తలారి గొర్రెలమెడలను నరుకుతాడు,

మాంసాన్ని పోగులేసిన తర్వాత, మోదుగు ఆకుల్లోనో మర్రి ఆకుల్లోనో పెట్టి ఇంటింటికి పంపడం ఆచారం. పెద్దలోకులకు ఎప్పటికంత ఎక్కువే ముడుతుంది.

"ఏమాయెనే ఒక్కమాటనరు. 'మీ మన్సు లేముందో జెప్పునిర్రి, మీరు గట్టిగ నిల్సుండవుంది, మేమేం జెయ్యం. మీరందరు మాటొక్కటయి, ఒక్క కట్టుమీదున్న రంటే, ఇగంత మేం జూస్కుంటం—" అన్నాడు చలపతి.

"ఇగేం జెప్పుమంటవే? లచ్చన్నా! మాది కట్టంటె కట్టె! అని మొన్ననె జెప్తిమి గద. ఓయాళ్ళ ఎవ్వడన్న యాళ్ళకు పక్కకు తప్పుకుంటె పోనీ. అళ్ళె దొరకెట్టి గొర్లిచ్చుకుంటరు—" అన్నాడు గొల్ల మల్లన్న.

"నాటికి నూరుపాల్లు ఈయ్యేడు దొర ఎట్టిగొర్లియ్యమని రాడు— మిమ్మల్నో సారి గొట్టిసూద్దామని, సందేలకు సుంకరోన్ని దోలిండు గన్క— ముందు జాగర్త కోసం అందర్దొక్కటే మాటయితె మంచిది.

"నేనింకోటి జెప్తన్ననే— దసరకు ఎట్టి గొర్లియ్యకపోతే, అయింత మీ గొర్ల కేమన్న గత్తర్లో గాయో అయితెట్లనే? బాగ ఆలోసించుకోర్రి— ఎన్కసీరి మామీద మన్నుబోత్తె లాభం లేదు" అన్నడు మల్లయ్య వాళ్ళ మనసు, గుండెల లోతు తెల్సుకుందామని.

"దసర కెట్టిగొర్లు గొట్టకపోతే గొర్లకేమయితది? మరిగ గొర్లకు ఆశపడ్డ దేవుడేం దేవుడో? మాంసంకూర మెక్కితినే దేవుడన్నమాట! అనియక్కన్ కుక్కలడుగ— అసోంటి దేవుడు మాకొద్దు!" అన్నాడు ఓదెలు.

"ఏమన్నా గానియ్యే— రే పెట్టి గొర్లిచ్చుడు మాత్రం బందే జేత్తం. దొరకు బాగ అలాటయ్యింది. పురుళ్ళకు, పుట్టెంటికెలకు— పెళ్ళిల్లకు. పేరంటాలకు ఎట్టి గొర్లియ్యలేక జత్తన్నం. ఓసారి ఈడ్సి, జాడిచ్చి ముడ్డిమీన్కేలి దంతేగాని మానం రాదు లఫ్డికొడుకులకు" అన్నాడతనే.

ఓదెలు మాటమీద గొల్లోల్లందరికి చాల గురివుంది. కండలు తిరిగిన శరీరం, మనసు తిక్క గుణం— మంచిమాట కేదంటే అదంటడు— అతనంటే వాళ్ళందరికీ భయం భక్తున్నయి. స్త్రీలంటె మంచి మర్యాదస్తుడు— యింకా, కులపెద్ద మల్లన్నకు స్వయాన బావమరిది.

"అయితె మంచిదాయె— ఇక లేద్దామా? ఇప్పటికే పన్నెండు గొట్టింది." చేతి గడియారం చూసన్నాడు చలపతి.

"ఆఁ.... ఇగ బోదాంగానీ ఇంకో మాటుందిగద మాట్లాడుకునేది? రేపు— జంబిచెట్టుమీది ఆకు మనమే మొట్టమొదలు తెంపాలె— ఎవ్వల్తోటి దెంపిద్దామో అందరు జెప్పుర్రి. అందరిమాట ఒక్కటయితె మంచిగుంట" దన్నాడు మల్లయ్య.

సృజన సంపాదకులకు అభివందనాలు–

జనవరి సృజనలో సినిమాపై వ్యాసం చూశాను.

ఈ నెల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఆనందూ, ఉత్పలేందూ పాల్గొన్నారు. చిత్రోత్సవాన్ని పురస్కరించుకొని జరిపిన సదస్సులో ఆ ఇద్దరూ తమ అనుభవాలను చెప్పారు. సత్యూ కూడా ఎమర్జెన్సీ కాలంలో ఫిల్మ్స్ డివిజను వాళ్ళకోసం ఒక చిత్రం తీశాడు. దాన్ని అణగతొక్కేశారు. ఈ సంగతి సత్యూ వివరించాడు.

చలనచిత్రోత్సవం ప్రతినిధులందరికీ కాకపోయినా, సదస్సు సభ్యులకు ఆనంద్ పట్టవర్ధన్ చిత్రాన్నీ ఉత్పలేందు చక్రవర్తి చిత్రాన్నీ వేసి చూపిస్తామన్నారు. ప్రదర్శన ఎప్పుడుంటుందో చెప్తామన్నారు. చెప్పిన వేళకి వేశారో లేదో తెలియదు. (వేస్తామన్నారు అదెంత కాదు!)

"ఇంకెవ్వలు తెంపుతరె? నువ్వే దెంపరాదు?" అన్నడు ఎల్లన్న.

"ఆకు దెంపుటానికేంది ఎల్లన్నా! దొరకెదుర్గా యాడికీ మేమే బోవాల్నా? ఇక మీరెప్పుడు బోతరు?" అన్నాడు చలపతి.

అతని మాటక్కొందరు తగ్గారు– అది నిజమేననిపించి.

"అది నిజమే చలపత్తాతా! కానీ మా అందర్కి మల్లన్నతోటి దెంపిస్తెనే మంచిగుండు ననిపిస్తాంది–" పోశాల్తాత. అతనా వూరందరికీ తాతే.

"ఏంచేలచ్చన్నా ఏమొ ఎక్కడుగేత్తన్నవ్– బయ్యపడ్తున్నవేందే? నీయవ్వ మేమందరం లేమాయె నీకేమన్నయితే? నీమీద పెయ్యేస్కనేంత గుండెలెవడి కున్నయె–" అన్నాడు ఓదెలు.

"అయితె మంచిదింగ లేద్దామా? రేపట్టి సంగపోల్లు మంచిగ హుషార్గుండాలె. బయటికెల్లినమంటె అందర్నేతుల్ల గుత్పకట్టెలుండాలె. ఎందుకంటె దస్రంటె తాగి తందనాలాడె పండుగ– దొరేమన్న జెయ్యొచ్చు– ఇగ మనోల్లయితె తాగుడు, గీగుడసొంటి ఆసనంటించుకోవద్దు–" చెప్పాడు మల్లయ్య.

అందరు లేచారు– సంగంలో పడుకునేవాళ్ళు బట్టలు పరుచుకున్నారు.

చందమామ సగం ముక్కయ్యాడు, మొగులుమీన, చుక్కల నడుమ, మబ్బుల మధ్య పరుగులు తీస్తున్నాడు.

మబ్బులు మింగుతున్నాయ్, విడిచి పెడుతున్నాయి చందమామను.

* * *

.... (ముగింపు వచ్చే సంచికలో)

చలన చిత్రోత్సవ సందర్భంలో జరిపిన సదస్సులో ఉత్పలదత్తు చాల గంభీర మైన 'కీ-నోటు' ప్రసంగం చేశాడు. ఆ వ్యాసాన్ని సంపాదించి ప్రకటించండి. ఆ ప్రసంగాన్ని సెనిగల్ పౌరుడు జ్యూరీ అధ్యక్షుడు కామ్రేడ్ అవుసేమన్ సెన్ బెన్ చాలా దృఢంగా ద్వితీయ పరిచాడు. నేటి సినిమా పరిశ్రమ యొక్క వర్గస్వభావాన్ని నిర్మొహమాటంగా తేటతెల్లం చేయడమే కాక- పాత సమాజాన్ని పడగొట్టండే కొత్త సినిమాకి స్థానం దొరకదని అభ్యుదయ వర్గాలు ఉద్ఘాటించాయి.

మద్రాసు మీ
23-1-79 ఆరుద్ర

భూమికోసం (నృత్యనాటకం) గురించి రుద్రజ్వాలగారు ఎలా బావుంటుందో వ్రాస్తే బావుండు నన్నారు....

1. దాపీదు మారడం : దాపీదు మారడని కాదు. చుట్టుపక్క పల్లెటూళ్లలో జరుగుతున్న మార్పుల ప్రభావం అతనిమీద తప్పకుండా ఉంటుంది.... (ఈవిషయం నాటకంలో ఎక్కడా ప్రస్తావించలేదు.) అయితే దాపీదు మారడానికి ముందు కొంత సంఘర్షణకు లోనౌతాడు. ఆసంఘర్షణ తప్పకుండా రాయాల్సింది.... నృత్యనాటకంలో సందర్భోచితంగా రాయవలసింది....

2. ముగింపు సినిమా ముగింపు ఎందు కయ్యిందంటే- ప్రజలు హఠాత్తుగా తిరగబడడం- దొర ఓడిపోవడం- సహజమే అయినా చివరి రంగంలో ఇంకొంచెం సంఘర్షణను పెంచాలి.... దొరకు వాళ్లకు జరిగిన తిరుగుబాటుకు రాజీబేరాలు- అవి విఫలం కావడం తప్పనిసరైన పరిస్థితి నాటకంలో కనిపించాలి. కథకంటె- నాటకం దృశ్యప్రధానమైంది కనుక ఆ ఎఫెక్టు అవసరం....

ఉన్నది ఉన్నట్టు చెప్పుతున్నామనుకున్నా ఏసంఘటనకైన వెనుక అతి బలమైన కారణాలుంటాయి. ఉదా : ఎవడన్నా కర్ర ఎత్తాడనుకో వాడికి కర్రకున్న కట్టితనం ముందే తెలిసుంటుంది.... ఇలాగా....

పకీరు, పిట్టలదొరా, బుడబుక్కల మొదలైన వేషాలు సాధారణంగా హాస్య సంభాషణం చేస్తుంటాయి.... వీటి ఉపయోగం "వేరే" ఉంటుంది. ఈ పరిస్థితిలో సమిష్టి కళారూపాలకు ప్రాధాన్యత యివ్వవలసిన అవసరం చాలాఉన్నది- రుద్రజ్వాల అభిప్రాయాలు చదివి వొదిలి పెట్టవలసినవికావు- చాలా ఆలోచించాల్సినవి.

22-1-79 - అల్లం రాజయ్య

రిపోర్టు :

విరసం సాహిత్య పాఠశాల

ఈ జనవరి 13, 14, 15 తేదీలలో విప్లవ రచయితల సంఘం తన సభ్యులకోసం, సభ్యులచే సిఫార్సు చేయబడిన సాహిత్యాభిమానుల కోసం మూడు రోజులపాటు వరంగల్‌లో సాహిత్య పాఠశాల నిర్వహించింది. ఇందులో రాష్ట్రం నలుమూలల నుండీ, ఢిల్లీ నుండీ విరసం సభ్యులూ, సాహిత్యాభిమానులూ 500 మంది పాల్గొన్నారు.

చరిత్ర - శాస్త్రీయ దృక్పథం, చరిత్ర - సాహిత్య చరిత్ర, భాషా సాహిత్యోద్యమాలు, నూతన ప్రజాస్వామిక విప్లవంలో సాహిత్యం పాత్ర, ప్రజల పాటలు, నవల - కథ - జీవితం అనే అంశాలపై పాఠాలు, చర్చలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.

పాఠశాల, సాంస్కృతిక కార్యక్రమాలు, బహిరంగసభ జరిగిన స్థలానికి కామ్రేడ్ రామనర్సయ్య నగర్ అని పేరు పెట్టారు. కామ్రేడ్ రామనర్సయ్య వరంగల్ జిల్లాకు చెందిన విప్లవకారుడు. సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి. ఎమర్జెన్సీలో ఫాసిస్టు ఇందిర - వెంగళరావు పోలీసులచేత పట్టుబడి కాల్చివేయబడిన మృతవీరుడు. సభావరణలో ప్రవేశించగానే ఎదురుగా ఆ మృతవీరుని చిత్రము ఇంకా మార్క్సిస్టు - మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, స్టాలిన్, హోచిమిన్‌ల చిత్రాలు ఎదురయినాయి. సుత్తి - కొడవలి గుర్తుగవున్న ఎర్ర జెండాకింద ఏర్పడిన సుత్తి - కొడవలి, కలం గుర్తుగల సాహిత్య, సాంస్కృతిక సంస్థ తమదని గర్వంగా చాటుకోవడానికి మూడురోజుల పాటు సాహిత్య పాఠశాలపై ఆ జెండా ఎగిరింది.

13వ తేదీ ఉదయం విరసం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె. వి. రమణారెడ్డి గారు విరసం జెండా ఎగురవేయడంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'సుత్తి - కొడవలి గుర్తుగవున్న ఎర్రని జెండా ఎగురుతున్నది' (వంగపండు ప్రసాదరావుపాట) 'ఎత్తినాం విరసం జెండా' (రుద్రజ్వాల పాట) 'ఎర్ర జెండెర్ర జెండెన్నియలో' (అల్లం వీరయ్య పాట) పాటలు సామూహికంగా పాడారు. మృతవీరులకు జోహార్లు అర్పించారు.

పాఠశాల తరగతులు జరిగిన స్థలానికి 'పరిటాల శ్రీరాములు హాల్' అని పేరు పెట్టారు. ఆ హాల్ నిండా సుప్రసిద్ధ శ్రామికవర్గ రచయితల చిత్రాలు అలంకరించారు.

పెన్నూ, గన్నూ పట్టిన విప్లవ కళాకారుడూ, విప్లవకారుడూ అయిన సుబ్బారావు పాణిగ్రాహిని ఒరవడిగా పెట్టుకునే విరసం ఏర్పడింది. 'విప్లవ రాజకీయ వస్తువుకు,

కళానైపుణ్యానికి పాణిగ్రహణం చేసినవాడు పాణిగ్రాహి'. 'జనం నేర్పిన చిక్కటి దేశీయాలతో, ఉద్యమం నేర్పిన తత్వబలంతో', "సూటిగా, సరళంగా, పటిష్టంగా, పాటినేల సత్తువతోటి, వాగునీటి స్వచ్ఛత తోటి క్రమబద్ధమైన నడకల్లో" రచనను నడిపించిన పాణిగ్రాహి పటం పాఠశాల విద్యార్థులను–

'ఈ పీడన మన కెందుకు, ఈ పాలన మన కెందుకు
భవిష్యత్తు మనదేనోయ్, ఈ విపత్తు ఇక రాదోయ్'–

అని పాడుకునేలా చేస్తూ నిలిచి వున్నది.

విరసమంటే పాణిగ్రాహి వారసత్వమని నిరూపించిన నిజమైన విప్లవకారుడు పరిటాల శ్రీరాములు. అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలో పేదరైతు కూలీలను కూడగట్టి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించి 'పోరాటాల శ్రీరాములు'గా పేరుపొందిన పరిటాల, విరసం కార్యవర్గ సభ్యుడు; 1975 మే నెలలో పట్టపగలు, నడిబజార్లో, భూస్వామ్య గుండాల తుపాకీ కాల్పుల్లో బలి అయినవాడు. ఆయన దోపిడీ దొంగల రంగుల పల్లకీని వర్ణించలేదు– జనతా ప్రజాస్వామిక విప్లవంలో సాంస్కృతిక సైనికుడిగా సాహిత్యాన్ని సృష్టించాడు. ఆయన పటం తరగతి గదికి వెలుగు.

ఎస్. ఎస్. ప్రకాశరావు "విరసం సభ్యుడు మాత్రమే కాదు, విరసం పుట్టుకకు దారితీసిన విశాఖ విద్యార్థుల సవాల్‌లో భాగం. సమాజంలో రచయిత పాత్ర పట్ల మార్క్సిస్ట్-లెనినిస్ట్ అవగాహనతో మసలుకున్నవాడు– యువతరం గర్వించ దగిన రచయిత. 'ఉప్పెన' అనువాదం విప్లవ సాహిత్యంలో ఆయన కొక శాశ్వత స్థానాన్ని సాధించి పెట్టింది." ఆదర్శ విద్యార్థి అయిన ఆయన చిత్రపటం సాహిత్య పాఠశాల విద్యార్థులకు ఉత్తేజం కలిగించేది.

జాతీయ ఉద్యమం గురించి, అప్పటి ప్రజల జీవితం గురించి శక్తివంతమైన అంచనాకట్టి, ప్రజల ఆకాంక్షలు, అన్యాయం, దోపిడీని, ప్రత్యేకించి భారత గ్రామీణ సమిష్టి జీవితాన్ని, పోరాటాన్ని వాస్తవికత పట్ల శ్రద్ధాసక్తులతో చిత్రించిన తొలి ప్రగతిశీల రచయిత, కథాకారుడు, నవలా రచయిత ప్రేమ్‌చంద్.

అంతర్జాతీయ గీతం పాడిన అమరుడు యూజీన్ పొట్టియర్. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా ఏర్పడిన శ్రామికవర్గ ప్రభుత్వం ప్యారిస్ కమ్యూన్‌లో పాల్గొని శ్రామికుడే మేధావి కళాకారుడు అని ప్రపంచానికి చాటిచెప్పిన కార్మికవర్గ కవి.

బోల్షివిక్ విప్లవానికి సాంస్కృతిక నాయకుడు 'అమ్మ' నవలతో ప్రపంచ పీడిత ప్రజల హృదయాల్లో అమ్మలాంటి ప్రేమాస్పదస్థానాన్ని పొందిన మాగ్జింగోర్కీ.

"సోషలిజం కోసం నాటిన విత్తనాల్లాంటి వాళ్ళం మేం. ఓ వసంత సుప్రభాతాన ప్రపంచ వ్యాప్తంగా మొలకలు వేస్తాం మేం.... స్వేచ్ఛా మానవుడుదయిస్తాడానాడు. ప్రజల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుం దానాడు. మానవత వికసిస్తుం దానాడు—" అంటూ 'రక్తాక్షరాలు' రాసిన జెకోస్లోవేకియా విముక్తి పోరాట వీరుడు జూలియస్ ఫ్యూజిక్.

"నాజూకైన యువతుల సువాసనాభరితమైన చెమటా? ఎద్దుల్లాంటి శ్రామికుల కంపుకొట్టే చెమటా? నా సాహిత్యం కలకాలం నిలవాలంటే నేను ఏ చెమట గురించి రాయడం మంచిది?" అని ఆలోచించి అడుగు వేసిన చైనా రచయిత లూసున్.

ఈ చిత్రపటాలు రచనకు భాష, జాతితో నిమిత్తంలేదని చెప్తాయి. ఏ భాషలో రాసినా, ఏ జాతివాడు రాసినా, రచయిత ఎవరికోసం రాస్తున్నాననే ఆలోచన కల వాడయి వుండాలనే ప్రాథమిక విషయాన్ని బోధిస్తున్నట్టుగా ఈ పటాలు ప్రదర్శింప బడి వున్నాయి. దోపిడీకి గురయిన ప్రజల పట్ల సానుభూతిని ప్రకటించడమే కాదు, వాళ్ళ పక్షం వహించాల్సిన బాధ్యత ప్రపంచంలోని ఏ మూలలో వున్న రచయితదైనా. వర్గ దృక్పథం రచయిత వెన్నెముక.

"అన్న.... అమరుడురా !.... మన.... రామనరసయ్యా"
(రామారావు - అరుణోదయ)

"పరిటాలా రాములూ ! నీకు లాల్ సలాములు
వృథాకాదు నీ మరణం రేపటి సూర్యుని కిరణం" (ఎన్ కె)

ఈ రెండు పాటలు తరగతి గదిలో పాడుకున్నాక చరిత్రపాఠం మొదలయింది.

త్రిపురనేని మధుసూదనరావు అధ్యక్షత వహించగా కె. వి. రమణారెడ్డి 'భారత దేశ చరిత్ర - శాస్త్రీయ దృక్పథం' అనే పాఠం చెప్పారు. 'నీ కలంతో గత కాలాన్ని తవ్వడం మానుకోవాలి— నీ గునపంతో తవ్వాలి' అన్న కొశాంబి మాటను ఆయన గుర్తు చేసారు. వాతావరణ శాస్త్రం, జంతుశాస్త్రం మొదలైనవి చదవకుండా చరిత్ర రాయలేము: సింధూ నాగరికత కంటె పూర్వం ఎప్పుడో ఆదిమ కమ్యూనిజం వుండేది. సింధూ నాగరికత కాలంలో మాత్రం వర్గ వ్యత్యాసా లుండేవి: భవిష్యత్తును తీర్చిదిద్దే దృష్టితో గతాన్ని చూడాలి చరిత్రకారుడు అని ఆయన చెప్పారు.

మధ్యాహ్నం కె. హనుమంతరెడ్డి అధ్యక్షత వహించగా చలసాని ప్రసాద్– నూతన ప్రజాస్వామ్య విప్లవంలో సాహిత్యం పాత్ర– అన్న అంశంపై పాఠం చెప్పారు. అమెరికా, ఫ్రాన్స్‌ల్లోను, క్రాంవెల్ నాయకత్వంలో యింగ్లాండ్‌లోను, వచ్చినవి బూర్జువా ప్రజాస్వామ్య విప్లవాలు; విప్లవం సాహిత్య సృష్టికి తోడ్పడుతుంది; విప్లవానికి ముందు, విప్లవం సాగుతున్నప్పుడు, విప్లవం తర్వాత వచ్చేది– అని మూడు భాగాలుగా సాహిత్యం పాత్రను విభజించవచ్చు; జాలి కలిగించే కథలు కాకుండా వర్గ దృక్పథంతో రాసిన సాహిత్యం కావాలి; జీవితాన్నే ప్రేరణగా తీసుకొని రచనలు చేయాలి– అని ఆయన చెప్పారు.

రాత్రి నగ్నముని అధ్యక్షతన కవిసమ్మేళనం జరిగింది. తెలుగు సాహిత్యానికి మూడు విషాద యోగాలు పట్టాయని, ఎంతో గర్వంగా చెప్పుకునే తెలుగు కవిత్వం దాదాపు ప్రాచీన కాలమంతా అనువాదమేనని, విప్లవ ఉద్యమాలే తెలుగు కవిత్వానికి సంకెళ్ళు తెంచాయని ఆయన చెప్పారు.

14 ఉదయం చేకూరి రామారావు అధ్యక్షత వహించగా త్రిపురనేని మధుసూదనరావు 'చరిత్ర–సాహిత్య చరిత్ర' పాఠం చెప్పారు. పౌరాణిక దృక్పథంలో పూర్వ కవుల గురించి చెప్పేటప్పుడు కాలక్రమ పద్ధతిని అనుసరించేవారు కాదు; ఆధునిక సాహిత్య చరిత్ర అంటే కవుల గురించి చెప్పడం, సాహిత్యం గురించి చెప్పడం. కవుల గురించి చెప్పేటప్పుడు 'మహా పురుషుల జీవితమే చరిత్ర' అనుకొని రాసిన వాళ్ళది కూడా పౌరాణిక దృక్పథమే. ఇక సాహిత్యం గురించి భావవాద దృక్పథం, మార్క్సిస్ట్ దృక్పథం అని రెండు దృక్పథాలున్నాయి. సాహిత్య చరిత్రలో, కవులే కర్తలు, కారకులు అనీ, కావ్య జన్మస్థలం కవి హృదయ క్షేత్రమనీ, కవిత్వానికి నిన్న, నేడు, రేపు లేవనీ, భావవాదులు చెప్తారు. మార్క్సిస్ట్ దృక్పథంతో తెలుగు సాహిత్య చరిత్ర యింతవరకు రాలేదు. మార్క్సిస్ట్ దృక్పథం అంటే గతితార్కిక చారిత్రిక భౌతికవాద దృక్పథం. ఈ దృక్పథంతోనే చరిత్రను, జీవితాన్ని చూడాలి. పదార్థం ప్రధానం, పదార్థం నుండి భావం పుడుతుందనడం భౌతికవాదం. ప్రకృతిలోను, సమాజంలోను ఒక వస్తువు యింకొక వస్తువుతో సంబంధం కలిగి వుంటాయనడం గతి తర్కం. ఈ గతితార్కిక భౌతికవాదాన్ని చరిత్రకు అన్వయం చేయడం గతితార్కిక చారిత్రిక భౌతికవాద దృక్పథం. భౌతిక అవసరాలు, ఉత్పత్తి మానవ సంబంధాలకు మూలం. సాహిత్యాన్ని సాహిత్య సూత్రాల ద్వారా చూడడం అశాస్త్రీయం– అని త్రిపురనేని చెప్పారు.

మధ్యాహ్నం చెరబండరాజు అధ్యక్షతన గద్దర్, వంగపండు ప్రసాదరావు, రామారావు ప్రజల పాటల గురించి తమ అనుభవాలు చెప్పారు. ప్రజల బాణీలు పట్టుకొని, ప్రజల భాషలో పాటలు రాయడం ప్రజల నుంచి ఎట్లా నేర్చుకున్నదీ గద్దర్ చెప్పారు. పశువుల కాపర్లు, కల్లుకు అలవాటు పడ్డవాళ్ళు, రైల్వే గేంగ్‌మెన్, యిట్లా అందరి జీవితాలను దగ్గరగా పరిశీలించి మాత్రమే తాను పాటలు రాసినట్టు ఆయన చెప్పారు. తన సంస్థయైన 'జననాట్య మండలి' లోని భాగంగా తాను పని చేస్తున్నానన్నారు ఆయన. 'అరుణోదయ' రామారావు మాట్లాడుతూ తాను రచయితను కాననీ, వివిధ రచయితల పాటలను బాణీలుకట్టి ప్రజల్లోకి తీసుకుపోతున్నాననీ చెప్పారు. పౌరాణిక రూపాలను తీసేయ కూడదని ఆయన అభిప్రాయపడ్డారు. వంగపండు ప్రసాదరావు మాట్లాడుతూ పాటలు రాయడానికి కూడా పద్ధతి వుందన్నారు. దరువును ఆధారం చేసుకొని పాటతయారు చేసుకుంటానని ఆయన చెప్పారు. రాంచందర్, కానూరి వెంకటేశ్వరరావు, ఎం.జె., హెచ్చార్కె కూడా తమ అనుభవాలు చెప్పారు. ముఖ్యంగా విరసం నిర్ణయాలకు అనుగుణంగా పాటలు రాస్తున్నట్టు చెరబండరాజు చెప్పారు.

14 వతేదీ రాత్రికి రామనర్సయ్య నగర్‌లో ఎంతో పొద్దు పోయేదాకా కూడా జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

15న వుదయం కె. వి. రమణారెడ్డి అధ్యక్షతన పి. సి. నరసింహారెడ్డి భాషా, సాహిత్యోద్యమాల గురించి పాఠం చెప్పారు. చెప్పుట, సంవాదం, శ్రమించేప్పుడు పాడుకునేపాట మొదలైన తొలి జన అవసర క్రియలనుంచే కథ, నాటకం, కవిత్వం వచ్చాయని, సామాజిక ఉద్యమాలతో విడివడి భాషా సాహిత్యోద్యమాలు వుండజాలవని ఆయన అన్నారు.

మధ్యాహ్నం అల్లం రాజయ్య అధ్యక్షతన చలసాని ప్రసాద్ 'కథ, నవల– జీవితం' అన్న పాఠం చెప్పారు. కథలూ, నవలల్లో మూస పాత్రలు వుండకూడదన్నారు ఆయన. తెలుగులో నవల వెనుకబడి వున్న దన్నారాయన. అల్లం రాజయ్య మాట్లాడుతూ విప్లవ సాహిత్యం కంటె విప్లవానికే ఎక్కువ ప్రాధాన్యత వుందన్నారు. జీవిత సంఘర్షణలను కథలు, నవలలు చిత్రించాలని ఆయన చెప్పారు.

సాయంత్రం టౌన్ హాల్ నుంచి రామనర్సయ్య నగర్ వరకు వూరేగింపు తీసారు. విరసం జెండా పట్టుకొని కె.వి.ఆర్. ముందు నడువగా మార్క్సిస్టు మహోపాధ్యాయుల, రచయితల చిత్రపటాలు, విప్లవ నినాదాలతో కూడిన ప్లేకార్డులు పట్టుకొని సాహిత్యాభిమానులైన యువకులు యువతులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

రాత్రి వరవరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. దాదాపు అరవై మంది సభ్యులున్న సంస్థ అయినా, తొమ్మిది సంవత్సరాల్లో విరసం ఎంతో సాధించిందని కె. వి. రమణారెడ్డి చెప్పారు. రాజకీయం అంటే కోట్లాది ప్రజల విముక్తికి సంబంధించింది. ఎవరి ప్రయోజనాల కోసం ప్రభుత్వం పోలీసులకు తుపాకులు యిచ్చిందని ఆయన అడిగారు. హనుమంతరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లోకి పోయి సమస్యలు అర్థం చేసుకోవడానికి విరసం రచయితలు ప్రయత్నిస్తున్నారన్నారు. త్రిపురనేని మాట్లాడుతూ చరిత్ర అంటే పోరాడే ప్రజల చరిత్ర అని చెప్పారు. వర్గాలను కమ్యూనిస్టులు సృష్టించలేదు, వర్గ పోరాటం నిరంతరమైనది విప్లవకారులు లేనిది విప్లవ భావాలు రావు. పురోగమన సూత్రాలను ఆధారం చేసుకొని, పార్టీని ఆధారం చేసుకొని ప్రజలు సమాజ ఆర్థిక వ్యవస్థ మీద నాయకత్వం వహించాలని ఆయన చెప్పారు.

విరసం సాహిత్య పాఠశాలలో చెప్పుకున్న పాఠాల గురించి విరసం సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాల గురించి వరవరరావు వివరించాడు.

సభానంతరం అరుణోదయ రామారావు 'రామసర్పయ్య బుర్రకథ', గద్దర్ 'నక్సల్బరి బిడ్డలు' వాగ్గుకథ, వంగపండు ప్రసాదరావు 'యంత్రమెట్లా నడుస్తు వుందంటే' సాంస్కృతిక కార్యక్రమాలు ఐదువేలమంది ప్రజలను సంక్రాంతి చలిలో రాత్రి రెండు గంటల వరకు కదలకుండా కూర్చో బెట్టాయి.

విరసం తీర్మానాలు (15-1-1979)

విరసం సాహిత్య పాఠశాల సందర్భంగా వరంగల్‌లో 15-1-79 మధ్యాహ్నం కామ్రేడ్ అట్లూరి రంగారావు అధ్యక్షతన రామనర్సయ్యనగర్, పరిటాల శ్రీరాములు హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ క్రింది తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి.

1. <u>సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలను 'కల్లోలిత ప్రాంతాలు' గా ప్రకటించిన ప్రభుత్వ ఉత్తర్వులను విరమించుకోవాలి</u>

విరసం అక్టోబర్ సర్వసభ్య సమావేశంలో ఊహించి హెచ్చరించినట్లుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉవ్వెత్తున పొంగుతున్న ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటాలను అణచటానికి మొదటి మెట్టుగా సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా అక్టోబర్ 20 న ప్రకటించింది. ఆరెండు తాలూకాల్లోనూ హింసాత్మక చర్యలకు సంబంధించి 30 కేసులు నమోదై ఉన్నాయని ఒక ప్రకటనలో ఆరోపించింది.

ఈ "కల్లోలిత ప్రాంతాల" ను పర్యటించి ఒక నివేదిక తయారుచేసిన ఢిల్లీ పి. యు. సి. ఎల్ నిజనిరూపణ కమిటీ ప్రభుత్వం చేసిన ఆరోపణలన్నీ అసత్యమైనవని నిరాధారమైనవని సాక్ష్యాధారాలతో నిరూపించడమే కాకుండా తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న హరిజన, గిరిజన పేద ప్రజలపై ప్రభుత్వం పాశవికమైన దమనకాండను అమలు చేస్తున్నదని ప్రకటించింది.

ఆ తాలూకాలకు చెందిన ఇందిరా కాంగ్రెసు నాయకులు కూడా వాటిని కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించడం అనుచితమని అభిప్రాయపడ్డారు. ఇది ఇట్లా ఉండగా ఇటీవల కరీంనగర్ జిల్లా ఎస్పీ సుకుమారన్ ఒక సుదీర్ఘమైన ప్రకటనచేస్తూ సిరిసిల్లా, జగిత్యాల తాలూకాల్లో జరిగినవని చెప్పబడుతున్న ముప్పయి హింసాత్మక చర్యలకు నక్సలైట్‌లకు సంబంధం లేదన్నారు. అంటే ఆ జిల్లాకు సంబంధించిన పోలీసు అధికారులతో సహా దాదాపు అన్ని వర్గాలవారు అక్కడ 'కల్లోలిత ప్రాంతాల' ప్రకటన అనుచితమని భావిస్తున్నారు. మరి చెన్నారెడ్డిగారు ఎవరికోసం ఈ పని చేసినట్లు? తన దగ్గరికి రాయబారం వచ్చిన కొన్ని భూస్వామ్య కుటుంబాలకోసం— ఆయన ప్రతిజ్ఞ చేసినట్లుగా "భూస్వామ్య విధానాన్ని కాపాడటానికి కంకణం కట్టుకున్నందువల్ల" ఈ చర్యకు పూనుకున్నాడు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో "కల్లోలిత ప్రాంతాలు"గా వున్న జాబితాకు మరో రెండు చేరాయన్నమాట. మందమర్రి కార్మికుల ఆందోళన సాకుతో మరో రెండు తాలూకాలు

చేసే ప్రమాదం కన్పిస్తున్నది. భౌగోళిక విస్తీర్ణతను బట్టి 'కల్లోలిత ప్రాంతాల' విషయంలో ఆంధ్రప్రదేశ్ – నాగాలాండ్, మిజోరామ్, మణిపూర్‌ల సరసన చేరుతున్నది.

ఈ చట్టం ఎమర్జెన్సీ అధికారాలకన్న భయంకరమైన అధికారాలను పోలీసులకు ఇస్తుంది. సభలు, సమావేశాలు పెట్టుకోవడానికి వీల్లేదు. అవసరమనుకొంటే పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్ కూడా కాల్పులకు ఉత్తర్వులు జారీచేయవచ్చు.

ఇంత ప్రజాస్వామ్య వ్యతిరేకమైన చట్టాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయ తలపెట్టిన ఢిల్లీ పి.యు.సి.ఎల్. కృషిని అభినందిస్తూ ప్రజాస్వామ్య శక్తులన్నీ కూడా ఈ ప్రకటన రద్దుచేయడానికి ఆందోళన చేయవలసిందిగా విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

పోలీసు క్యాంపులు పెట్టినా, పోలీసులు, భూస్వాములు కాల్పులు జరిపినా భూస్వాములు, వారి గుండాలు బలహీనవర్గాలకు చెందిన స్త్రీలను చెరిచి భీభత్సం సృష్టించినా, చివరకు "కల్లోలిత ప్రాంతాలు"గా ప్రకటించినా మొక్కవోని ధైర్యంతో, కృత నిశ్చయంతో భూమికోసం, భుక్తికోసం ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా రైతాంగం చేస్తున్న వీరోచిత పోరాటాలకు విరసం లాల్‌సలామ్ చెపుతున్నది. సాహిత్య, సాంస్కృతిక కరచాలనం చేస్తున్నది. వాళ్ళతో జోడీగా భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పిడికిలి బిగిస్తున్నది.

2. <u>మందమర్రి బొగ్గుగని కార్మికులపై పోలీసు కాల్పులను ఖండించండి.</u>

ఆదిలాబాద్ జిల్లా మందమర్రి బొగ్గుగని కార్మికులపై జనవరి 6వ తేదీన జరిగిన పోలీసు కాల్పులలో ఏడుగురు కార్మికులు బలైపోయారు. ధన్‌బాద్, బైలదిల్లా కార్మికులపై జనతా ప్రభుత్వం అమలుచేసిన లాఠీ తూటాల నీతినే ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసింది. నేరమేమిటయ్యా అంటే లారీల్లో బొగ్గును నింపే పనిలో మధ్యదళారీలు దోచుకుంటున్న పద్ధతిని అరికట్టాలని కార్మికులు సమరశీలంగా ఆందోళన చేపట్టడమే. వెయ్యి ఎకరాల భూస్వామి, సినిమా హాలు అధినేత, సారా కాంట్రాక్టర్ వగైరా మాత్రమే కాకుండా కార్మిక నాయకుని లేబిల్ కూడ తగిలించుకున్న దొరను ఒంటరిని చేసి తమ హక్కులు సాధించుకోవాలని కార్మికులు ఉద్యమించినపుడు ఆ దొరను కాపాడడానికి రంగంలోకి దిగిన పోలీసు కాల్పులు జరిపారు. నలుగురు కార్మికులు అక్కడికక్కడ చనిపోయారు. ముగ్గురు ఆసుపత్రిలో చనిపోయారు. ఏడుగురు కార్మికులు గాయపడి ఆసుపత్రిలో వున్నారు. ఆందోళన చేసిన కార్మికుల వెనుక తీవ్రవాదులున్నారనే రెడీమేడ్ ఆరోపణ ప్రభుత్వం నుంచి

పోలీసు తూటాల వెనువెంటనే వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాదు, లక్సెట్టిపేట తాలూకాల్లో రాజుకుంటున్న రైతాంగ పోరాటాన్ని అణచటానికి ఆ ప్రాంతాలను కూడ 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించదానికి ప్రభుత్వం ఒక సాకు వెతుక్కుంటున్నదని, అందుకు తానే ఇలాంటి హింసా కృత్యాలకు పూనుకుంటున్నదన్నది చాల స్పష్టం. ఈ కుట్ర విషయంలో ప్రజాతంత్ర శక్తులు అప్రమత్తంగా వుండాలని, మందమర్రి బొగ్గుగని కార్మికులపై పోలీసు కాల్పులను ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ పోలీసు కాల్పుల గురించి నిష్పాక్షికమైన న్యాయ విచారణ జరిపించాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, ఇంకా ఆసుపత్రుల్లో వున్న గాయ పడిన కార్మికులకు అవసరమైన వైద్య సౌకర్యం కలిగించాలని విరసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

3. విద్యార్థి ఆందోళనలపై ప్రభుత్వ దమనకాండను ఖండించండి.

రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లోను, పాలిటెక్నిక్‌లలోనూ తమ న్యాయమైన హక్కులకోసం పోరాడుతున్న విద్యార్థుల ఆందోళనలను అణచేయడానికి ప్రభుత్వం అన్నిరకాల హీనమైన పద్ధతులను అనుసరిస్తున్నది. పాలిటెక్నిక్ కాలేజీలను మూసివేసి 50 మంది విద్యార్థులను రస్టికేట్ చేసింది. జనవరి 18న కాలేజీలు తెరిచిననాడు హాజరుకాని విద్యార్థులపేర్లు రిజిస్టర్‌లనుంచి తొలగిస్తామని బెదిరింపు ప్రకటన చేసింది. పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన వెనుక తీవ్రవాద విద్యార్థుల ప్రోత్సాహం వుందని సాంకేతిక విద్యామంత్రి పదే పదే ప్రకటిస్తూ సమస్యలను పక్కదారి పట్టింప చూస్తున్నాడు. అట్లే కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆర్. ఎస్. ఎస్., ఎ బి వి పి విద్యార్థులకు వామపక్ష విద్యార్థులకు మధ్యన జరిగిన ఘర్షణలలో ప్రభుత్వము, విశ్వవిద్యాలయ అధికారులు ఏకపక్షం వహించి వామపక్ష విద్యార్థులపైన హత్యాప్రయత్న నేరాలను మోపుతున్నారు. అరెస్టులు చేస్తున్నారు. అత్యధిక మెజారిటీతో ఎన్నుకోబడిన విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో సహా ఐదుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించారు. పోలీసు కమాండెంట్ ఆదేశాలపై సిండికేట్ కూడా ఈ విద్యార్థులను కాలేజీ నుంచి తొలగించాలని ఆలోచిస్తున్నది.

నల్లగొండ జిల్లా, నల్లగొండ, మిర్యాలగూడా మొదలైన చోట్ల వామపక్ష విద్యార్థులపై ఆర్.ఎస్.ఎస్., ఇందిరా కాంగ్రెస్ గూండాలు పలుమార్లు దాడులు చేసి గాయపరిస్తే పోలీసులు వారిమీద ఎటువంటి చర్యతీసుకోకుండా వామపక్ష విద్యార్థులనే అరెస్టుచేసి పెద్దఎత్తున కేసులు బనాయిస్తున్నారు.

వీటన్నిటిని సమర్థించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థి ఆందోళనలలో ఉగ్రవాద విద్యార్థి సంస్థల ప్రమేయమున్నదని ఐ జి పి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడు. విద్యాలయాల్లో ప్రజాస్వామికమైన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టలేని ఈ ప్రభుత్వం తన స్వభావానికి తగినట్లుగానే విద్యార్థుల సమస్యలను లాఠీలతో, తూటాలతో, మాటి మాటికి విద్యాసంస్థల మూసివేతలతో పరిష్కరింప చూస్తున్నది.

ఇదిచాలక ఇందిరాగాంధీ అరెస్టు రాష్ట్రంలో ముఖ్యంగా విద్యాసంస్థల్లో ఏమాత్రం నిరసన వ్యక్తంగాక పోయేవరకు చెన్నారెడ్డి ప్రభుత్వం సెలవులు ప్రకటించి విద్యాసంస్థల పట్ల దానికున్న అశ్రద్ధ స్వభావాన్ని బయటపెట్టుకున్నది. విద్యార్థులపట్ల శత్రు వైఖరితో వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వ దమననీతిని విరసం ఖండిస్తున్నది. పాలిటెక్నిక్ విద్యార్థులపై, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై, నల్లగొండ విద్యార్థులపై కక్షసాధింపు చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

4. నిజామాబాద్ ప్రజాస్వామ్య శక్తులపై పోలీసుల నిర్బంధానికి విరసం ఖండన

ఈనెల 5వ తేదీన నిజామాబాద్ పట్టణంలో స్థానిక కార్మిక సంఘాలు రైతుకూలి సంఘం, పి డి ఎస్ యు, పి ఒ డబ్ల్యుల అధ్వర్యాన సిరిసిల్లా, జగిత్యాల "కల్లోలిత ప్రాంతాల" ప్రకటన రద్దుకోసం 'నిజామాబాద్ బంద్' ప్రతిపాదించబడినది. ఊరేగింపుకు పోలీస్ అధికారులు ముందు అనుమతించి కేవలం రెండుగంటల ముందే ఊరేగింపు జరపరాదని నిషేధించి 79 మంది కార్యకర్తలను అరెస్టు చేసి లాఠీలతో కొట్టి నాలుగురోజుల పిదప వదలివేసారు. ఈ పోలీసుల నిరంకుశ చర్యను విరసం ఖండిస్తున్నది. కార్యకర్తలపై బనాయించిన అక్రమ, అన్యాయ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

5. జైళ్ళు – రాజకీయ ఖైదీలు

జాతీయ పోలీసు అకాడమీ సభ్యుడు రుస్తుమ్‌జీ బీహార్‌లోని ముజఫర్‌పూర్, పాట్నాజైళ్ళలోని దుర్భర పరిస్థితుల గురించి అక్కడ ఏళ్ళుగా శిక్షనుభవిస్తున్న అసంఖ్యాకమైన అమాయక ఖైదీలగురించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో రాసిన విషయాలు, వివరమైన పరిశోధన తర్వాత అమ్నెస్టీ ఇంటర్నేషనల్ భారత దేశంలో జైళ్ళగురించి, రాజకీయ ఖైదీల గురించి, ఈనాటి స్థితిగతుల గురించి చెప్పిన విషయాలు

ఎమర్జెన్సీ ఎత్తివేసినా జైళ్ళు బాగుపడలేదని, జైళ్ళలో ఇంకా రాజకీయ ఖైదీలు మగ్గుతున్నారని మాత్రమే కాకుండా మళ్ళీ మనం ఆ చీకటి రోజుల్లోకే నడుస్తున్నామని హెచ్చరిస్తున్నాయి. నాగభూషణం పట్నాయక్ ఆరోగ్య పరిస్థితి భయాందోళనలను కలిగిస్తున్నదని పౌరహక్కుల సంఘాలు, ప్రజాతంత్ర శక్తులు ఆయన విడుదల గురించి విజ్ఞప్తులు చేస్తున్నాయి. అనారోగ్యంతో జైళ్లలో రాజకీయఖైదీలు ఒకరిద్దరు మరణించిన వార్తలు కూడా ఇటీవల మనకు తెల్సినవే. అయినా బేషరతుగా రాజకీయ ఖైదీల విడుదల విషయంలో ప్రభుత్వాలు మౌనం వహిస్తున్నాయి.

పశ్చిమ బెంగాల్‌లోని భగల్పూర్ సెంట్రల్ జైల్లో ఆరుగురు భూమిలేని నిరుపేద హరిజనులు ఉరిశిక్షలుపడి చీకటికొట్లలో మ్రగ్గుతున్నారు. వీళ్ళుచేసిన నేరమేమిటంటే భూస్వాముల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయడమే. జయప్రకాశ్‌నారాయణ ఉరిశిక్షల రద్దుకోసం ఎన్నోమార్లు విజ్ఞప్తి చేశాడు. జనతా పార్టీ రాజకీయ ఖైదీల విడుదల తన ఆశయంగా ఎన్నికల ప్రణాళికలో చెప్పుకున్నది. మరి జనతాపార్టీ కేంద్రంలో అధికారానికి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నది. మళ్ళీ జైళ్ళు నిండుతున్నాయి. రాజకీయ ఖైదీలకు కూడా ఉరిశిక్షలు అమలగుచున్నాయి. రాజకీయ ఖైదీల విడుదల కోసం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల రద్దుకోసం దేశవ్యాప్తంగా బలమైన ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మిస్తే తప్ప రానున్న మరింత భయంకరమైన ప్రమాదం నుంచి కాపాడుకోలేమని ప్రజాస్వామ్యవాదులకు విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

6. కంపూచియా ప్రజాతంత్ర రిపబ్లిక్‌పై వియత్నాం దురాక్రమణ

సోషల్ సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో కంపూచియాపై వియత్నాం సైన్యాల దురాక్రమణ పూరిత దాడిని విరసం ఖండిస్తున్నది.

తీవ్రతరమవుతున్న అగ్ర రాజ్యాల సంఘర్షణలో ఈ నూతన పరిణామం, మూడవ ప్రపంచ దేశాల మనుగడకూ, ప్రపంచ శాంతికి ఒక హెచ్చరిక. ప్రజాస్వామ్య వాదులందరూ ఈ చర్యను ఖండించాలని విరసం విజ్ఞప్తిచేస్తున్నది.

కె వి. రమణారెడ్డి
ప్రధాన కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం.

వరంగల్
15-1-1979

SRJANA Telugu Monthly Feb. 79 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

SRJANA Rs. 1-50
Hanumakonda- Warangal - 506 001